Published From Hyderabad, Mahabubnagar and Kadapa

# వార్తా తరంగాలు

జాతీయ దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar | సంపుటి :26 | సంచిక :148 | సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు | బుధవారం 07 అక్టోబర్ 2026 | పేజీలు :12 | వెల రూ5 /-










## భారత జీడీపీ వృద్ధి 7.1 శాతం

### వరల్డ్ బ్యాంక్ ప్రకటన

**న్యూఢిల్లీ, అక్టోబరు 6:**భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధిపై ప్రపంచ బ్యాంకు తన సానుకూల అంచనాలను వెలువరించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (ఎఫ్27) గాను భారత జీడీపీ వృద్ధి రేటు అంచనాను 7.1 శాతానికి పెంచుతున్నట్లు మంగళవారం వెల్లడించింది. గత ఏప్రిల్‌లో ఈ వృద్ధి అంచనా 6.6 శాతంగా ఉండగా, తాజాగా దానిని 0.5 శాతం మేర సవరించింది. ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో (క్యూ1) వృద్ధి రేటు అంచనాలను మించి 7.8 శాతంగా నమోదు కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తన తాజా 'ఇండియా డెవలప్‌మెంట్ అప్‌డేట్' నివేదికలో స్పష్టం చేసింది. ఆర్థిక సంవత్సరంలో బలమైన పెట్టుబడులు, స్థిరమైన ప్రైవేట్ వినియోగం కారణంగా వృద్ధి రేటు 7.8 శాతానికి చేరుకుందని ప్రపంచ - మిగతా3లో

## ఏడాదిలోపే ఇందిరమ్మ టవర్స్ పూర్తి చేసి లబ్ధిదారుల

# చేతికి తాళాలిస్తాం

### ఇందిరమ్మ టవర్స్ వేగంగా నిర్మించే కాంట్రాక్టర్లకు ప్రత్యేక ప్రోత్సాహకాలు

### 5,218 మంది అర్హుల నుంచి లక్కీడ్రా.. 480 కుటుంబాలకు ఇళ్ల కేటాయింపు

### రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్:–** క్యూర్ పరిధిలో తొలివిడత ప్రయోగాత్మకంగా నిర్మిస్తున్న లక్ష ఇళ్ల ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాలను పారదర్శకంగా, వేగంగా పూర్తి చేసి ఏడాదిలోగా అందించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. దీనిలో భాగంగా ఏడాది గడువును కాంట్రాక్టర్లకు నిర్దేశించామని అయితే ఒక నెల ముందుగా పూర్తి చేస్తే రూ.45 లక్షలు, రెండు నెలల ముందుగా పూర్తి చేస్తే రూ. 90 లక్షలు ప్రోత్సాహక బహుమతిగా ఇస్తామని చెప్పామని వివరించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజులరామారంలో మంగళవారం ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌కు సహచర మంత్రి, రంగారెడ్డి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే కే.పీ. వివేకానంద, పలువురు లబ్ధిదారులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచనల మేరకు 23 అసెంబ్లీ నియోజకవర్గాలలో ఇందిరమ్మ టవర్స్ ను నిరంతర ప్రక్రియగా నిర్మిస్తామని తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఇళ్ల కోసం 7,000 మందికి పైగా



దరఖాస్తులు అందగా, పరిశీలన అనంతరం 5,218 మంది అర్హులుగా తేలారని అర్హులైన వారిలో లబ్ధిదారుల ఎంపికను బహిరంగంగా లక్కీ డ్రా ద్వారా చేపట్టి, 480 మంది లబ్ధిదారులను తుది జాబితాలో ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఎంపిక ప్రక్రియను ఆన్‌లైన్ విధానంలో పారదర్శకంగా నిర్వహించామని, ఎవరికి ఏ విధంగా ఇల్లు మంజూరైందనే - మిగతా3లో

## ఎల్-నినో ప్రభావంపై ...

# నివేదిక సిద్ధం చేయాలి

### అక్టోబర్ మాసాంతంలోగా నివేదిక రూపొందించాలి

### రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



**హైదరాబాద్:**ఎల్-నినో ప్రభావంతో రాష్ట్రంలో ఏర్పడిన కరువు పరిస్థితులపై పూర్తి స్థాయి నివేదికను వెంటనే సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖపై మంగళవారం డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, విపత్తుల నిర్వహణ శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, కార్యదర్శులు దాసరి హరిచందన, గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు.ఎల్-నినో ప్రభావంతో రాష్ట్రంలోని 18 జిల్లాల్లో 320 మండలాల్లో - మిగతా3లో

# సింగరేణి ఉద్యోగులకు బోనస్

### లక్షా 30 వేలు ప్రకటించిన కిషన్ రెడ్డి



**న్యూఢిల్లీ, అక్టోబరు 6:**దసరా, దీపావళి పండుగల వేళ సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కార్మికులకు కేంద్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. పెర్ఫార్మెన్స్ లింక్డ్ రివార్డ్ కింద అర్హులైన ప్రతి కార్మికుడికి రూ. 1,10,250 చొప్పున బోనస్ ప్రకటించినట్లు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ప్రకటించారు. గతేడాది చెల్లించిన రూ. 1,03,000 బోనస్‌తో పోలిస్తే ఈసారి మరింత పెరగడం విశేషం.దేశానికి వెలుగులు పంచేందుకు పగలు, రాత్రి భూగర్భంలో కష్టపడుతున్న సింగరేణి కార్మికుల కృషి వెలకట్టలేనిదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. సింగరేణి కేవలం ఒక బొగ్గు ఉత్పత్తి సంస్థ మాత్రమే కాదని, తెలంగాణ రాష్ట్రానికి కొంగు బంగారమని, లక్షలాది కుటుంబాలకు జీవనాధారమని ఆయన ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. దేశాభివృద్ధిలో, రాష్ట్ర ప్రగతిలో సింగరేణి కార్మికుల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు.సింగరేణి సంస్థ అభివృద్ధి, కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ప్రభుత్వం నుంచి సింగరేణికి రావాల్సిన రూ. 60,000 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని కేంద్ర మంత్రి ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుత అవసరాలకు తగినట్లుగా బొగ్గు ఉత్పత్తిని మరింత పెంచేందుకు యాజమాన్యం, కార్మికులు కలిసి ప్రణాళికలు అమలు చేయాలని పిలుపునిచ్చారు. సింగరేణి కార్మికులకు, ఉద్యోగులు వారి కుటుంబసభ్యులకు దసరా, దీపావళి పండుగల సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. కేంద్రం నుంచి వెలువడిన బోనస్ ప్రకటనతో సింగరేణి బొగ్గు గనుల పరిధిలో కార్మికుల్లో పండుగ వాతావరణం నెలకొంది.

## పులిచింతల ప్రాజెక్టును సందర్శించిన ఉప ముఖ్యమంత్రి భట్టి



**సూర్యపేట:** చింతలపాలెం మండలంలోని పులిచింతల ప్రాజెక్టును డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మంగళవారం సందర్శించారు. పులిచింతల ప్రాజెక్టు సందర్శనలో నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్లాల్ పవార్, ఎస్పీ నరసింహ తదితరులు పాల్గొన్నారు. జెన్కో అధికారులు ఉప ముఖ్యమంత్రికి విద్యుత్ జనరేషన్ వివరించారు.

## ఖరీఫ్ ఎరువుల పంపిణీ

# విజయవంతం...



ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా ఎరువుల పంపిణీ విజయవంతంగా జరిగిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతులకు ఎరువుల కొరత రాకుండా ముందస్తుగానే ఎరువులను పొజిషన్ చేయడం, షిప్‌మెంట్లను వేగంగా రాష్ట్రానికి తీసుకురావడం, ఫెర్టిలైజర్ యాప్ ద్వారా పంపిణీని పర్యవేక్షించడం వంటి చర్యలతో ఎరువుల పంపిణీని సక్రమంగా నిర్వహించామని మంత్రి పేర్కొన్నారు.ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందుగానే ఎరువుల లభ్యతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి తెలిపారు. రైతులకు ఎరువుల కొరత రాకుండా ముందస్తుగానే స్టాక్స్‌ను పొజిషన్ చేయడంతో పాటు, దిగుమతి చేసుకునే ఎరువుల విషయంలో షిప్‌యార్డుల వద్ద ప్రత్యేక అధికారులను నియమించి కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సమన్వయం చేశామని చెప్పారు. షిప్‌మెంట్లు ఆలస్యం కాకుండా సంబంధిత అధికారులను సమన్వయం చేస్తూ, షిప్‌యార్డుల నుంచి రాష్ట్రానికి ఎరువులు త్వరితగతిన చేరేలా చర్యలు తీసుకున్నామని వివరించారు.

**ఫెర్టిలైజర్ యాప్‌తో పంపిణీలో పారదర్శకత...**

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఫెర్టిలైజర్ యాప్‌ను తెలంగాణ ప్రభుత్వం విజయవంతంగా అమలు చేసి, ఎరువుల - మిగతా3లో

## 27 లక్షల మందికి

# ఏకకాలంలో అల్పాహారం..

### ప్రపంచంలో ఎక్కడా లేదు

### తెలంగాణలోనే తొలిసారి.. విద్యార్థుల పౌష్టికాహారంపై ప్రత్యేక దృష్టి

### బీఆర్ఎస్‌కు గతమే తప్ప భవిష్యత్తు లేదు..

### మళ్లీ వచ్చేది ఎందుకో చెప్పాలి

### సంక్షేమం ఉచితం కాదు.. రాష్ట్ర జీఎస్‌డీపీ వృద్ధికి పెట్టుబడి

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

రాష్ట్రంలోని 27 లక్షల మంది విద్యార్థులకు ప్రతిరోజూ వేడివేడి అల్పాహారం అందించే కార్యక్రమం ప్రపంచంలో మరెక్కడా లేదని, తెలంగాణలోనే ఈ వినూత్న పథకాన్ని అమలు చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. విద్యార్థులకు అందిస్తున్న పౌష్టికాహారం ఉచితం కాదని, అది రాష్ట్ర భవిష్యత్తు మానవ వనరులపై చేస్తున్న పెట్టుబడని పేర్కొన్నారు. పిల్లలు ఆరోగ్యంగా ఉండి బాగా చదువుకుంటేనే భవిష్యత్తులో రాష్ట్ర ఉత్పత్తికి పెద్ద ఎత్తున తోడ్పడతారని, తద్వారా జీఎస్‌డీపీ వృద్ధికి దోహదం చేస్తారని చెప్పారు.సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గంలోని మునగాల గ్రామంలో పాఠశాలల విద్యార్థుల కోసం రూ.9.6 కోట్లతో నిర్మించనున్న సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌కు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో భట్టి విక్రమార్క మాట్లాడారు. 1,020 పాఠశాలల్లో చదువుతున్న దాదాపు 60 వేల మంది విద్యార్థులకు ఒకే కిచెన్ నుంచి పరిశుభ్రమైన, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వేడివేడి అల్పాహారం అందించేందుకు మునగాలలో ఈ గ్రీన్‌ఫీల్డ్ కిచెన్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 27 లక్షల మంది విద్యార్థులకు వారానికి ఆరు రోజులపాటు అల్పాహారం అందిస్తున్నామని తెలిపారు. మూడు రోజులు పాలు, మూడు రోజులు రాగిజావ అందిస్తున్నామని చెప్పారు. ఇంటి వద్ద వంద మందికి వంట చేయడం కూడా కష్టమైన పరిస్థితుల్లో 27 లక్షల మంది విద్యార్థులకు ఏకకాలంలో అల్పాహారం అందించే కార్యక్రమం ప్రపంచంలో ఎక్కడా లేదని, ఇది తెలంగాణ



ప్రభుత్వ మానవీయ దృక్పథానికి నిదర్శనమని పేర్కొన్నారు. పిల్లల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తని అన్నారు. ఎదిగే వయసులో పిల్లలకు అవసరమైన పౌష్టికాహారం అందిస్తేనే వారు ఆరోగ్యవంతమైన మానవ వనరుగా ఎదుగుతారని చెప్పారు. అందుకే పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు చిన్ననాటి నుంచే నాణ్యమైన ఆహారం అందిస్తూ, వారిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లే బాధ్యతను ప్రభుత్వం తీసుకుందని వివరించారు.




# మధురఫలం..జాడ ఏదీ

**నిజామాబాద్, అక్టోబరు 6:**ఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గడం.. మరోవైపు పెరిగిన ఉష్ణోగ్రతలు.. సీతాఫలాల దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయిపూత దశలోనే ఇబ్బందులు మొదలై.. పిందెలు రాలిపోతుండటంతో చెట్లకు కాసిన కాయలు కూడా పూర్తిస్థాయిలో ఎదగడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా సీతాఫలాల చెట్లు ఉన్నప్పటికీ ఉమ్మడి పాలమూరు జిల్లా మాత్రం వీటికి పెట్టింది పేరు. జిల్లాలో గుట్టలు, బంజరు భూములు, అటవీ ప్రాంతాల్లో విస్తారంగా ఉండడమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఇక్కడ పండిన పండ్లను హైదరాబాద్ తో పాటు ఇతర ప్రాంతాలకు ఎగుమతులు చేసేవారు. అలాగే మహిళ సంఘాల ఆధ్వర్యంలో సీతాఫలాలను ప్రాసెసింగ్ చేసి కంపెనీలకు విక్రయించి ఆదాయం పొందుతారు. ప్రతీ సీజన్ లో సీతాఫలాల సేకరణతోనూ పెద్ద ఎత్తున గ్రామీణ ప్రజలు ఉపాధి పొందుతున్నారు. ఈసారి వాతావరణ పరిస్థితులతో సీతాఫలం దిగుబడిపై ప్రభావం చూపుతున్నాయి. సకాలంలో వర్షాలు లేకపోవడం, అధిక ఉష్ణోగ్రతలు కొనసాగడంతో పూత, పిందె దశలోనే సీతాఫలం చితికిపోతోంది. కొన్ని పిందెలు రాలిపోగా.. మరికొన్ని కాయలు ఎదగకుండా చెట్లపైనే దెబ్బతిన్నాయి.జూలై నుంచి ఆగస్టు మధ్య పూత పిందెగా మారి, సెప్టెంబర్ మొదటి వారం కల్లా కాయలు పక్వానికి వస్తాయి. కానీ ఏడాది ఎల్ నినో ప్రభావంతో వర్షాలు గతి తప్పాయి. రోజుల తరబడి వానలు లేకపోవడం, అధిక ఉష్ణోగ్రతల కారణంగా చెట్లకు పిందెలు దక్కలేదు. సాధారణంగా ఒక్కో చెట్టుకు 50 నుంచి 60 కాయలు ఉండాలి. కానీ ప్రస్తుతం పదికి మించి కాయలు కనిపించడం లేదు. సీతాఫలం పంటలో పూత నుంచి కాయ తయారయ్యే దశ కీలకం. ఆ సమయంలో తేమ, వర్షపాతం, ఉష్ణోగ్రతలు మారితే పండ్ల ఏర్పాటుపై ప్రభావం పడే అవకాశం ఉంది. వాస్తవంగా సహజంగా పెరిగే సీతాఫలం చెట్ల సంఖ్య కూడా తగ్గుతోంది... దీనికి తోడు ఎల్‌నినో తోడైంది. గుట్టలు తొలగించడం, క్వారీలు, రియల్ ఎస్టేట్ వెంచర్లు, భూముల వినియోగంలో మార్పులతో సహజ సీతాఫలం చెట్ల విస్తీర్ణం తగ్గుతోంది. ఫలితంగా సాధారణ సంవత్సరాలతో పోలిస్తే ఈసారి సరఫరాపై వాతావరణ ప్రభావం మరింత స్పష్టంగా కనిపిస్తోంది.సీతాఫలా దిగుబడి తగ్గడంతో డిమాండ్ పెరిగింది. దీంతో రేట్లు అమాంతం పెరిగాయి. గతేడాది 15 గ్రాముల నుంచి 180 గ్రాముల వరకు ఉన్న ఒక పండు రూ.5 నుంచి రూ.7 వరకు... ఇంకాస్త పెద్దదైతే రూ.8 నుంచి రూ.10 వరకు విక్రయించారు. గంపల లెక్కన అయితే రూ.200 నుంచి రూ.250 వరకు అమ్మారు. ఇక తాజాగా గ్రామీణ ప్రాంతాల కంటే హైదరాబాద్ వంటి పట్టణాల్లో సీతాఫలాల ధరలు ఆకాశన్నంటుతున్నాయి. ఒక్కొక్క సీతాఫలాన్ని నాణ్యత, బరువును బట్టి.. ధర 30 నుంచి 50 వరకు అమ్ముతున్నారు. ఇక ఈ సారి ఎల్ నినో, వర్షాభావ పరిస్థితుల కారణంగా సీజనల్ గా ఉపాధి పొందే వారిపైన తీవ్ర ప్రభావం పడింది. సీతాఫలాలను సేకరించే గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఈ సీజన్ లో కష్టకాలం ఎదురవుతోంది. ఆశించిన స్థాయిలో సీతాఫలాల దిగుబడి కనిపించకపోవడంతో ఉపాధి కోల్పోయారు. వీరికి తోడు ఈ పండ్లను సేకరించన తర్వాత ప్రాసెసింగ్ చేసే మహిళ సంఘాలు సైతం ఖాళీగానే కనిపిస్తున్నారు. గతేడాది ఇదే సమాయానికి దాదాపుగా 60శాతం వరకు సీతాఫలాల ప్రాసెసింగ్ నిర్వహించిన వారికి ఈ సీజన్ లో ఇప్పటివరకు ఒక్క పండు రాలేదు అంటేనే పరిస్థితి ఏ రకంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.ఒకప్పుడు గుట్టల దగ్గర.. రోడ్ల పక్కన.. గ్రామీణ ప్రాంతాల్లో సులభంగా కనిపించిన సీతాఫలం.. ఇప్పుడు అరుదుగా మారుతోంది. వాతావరణ మార్పులతో దిగుబడి తగ్గడం.. సహజంగా పెరిగే చెట్ల సంఖ్య పడిపోవడం.. రెండూ కలిసి సీతాఫలం ధరలను పెంచుతున్నాయి. ఎల్‌నినో ప్రభావం తగ్గుతుందా... వచ్చే సీజన్‌లోనైనా సీతాఫలాల వృద్ధికి పరిస్థితులు అనుకూలిస్తాయా చూడాలి



# గవర్నర్ కోటలో సోషల్ ఇంజనీరింగ్

**హైదరాబాద్,అక్టోబరు 6:**తెలంగాణ శాసనమండలిలో నవంబర్‌లో మూడు గవర్నర్ కోటా ఎమ్మెల్సీలు ఖాళీ అవుతున్నాయి. మూడు ఎమ్మెల్సీ స్థానాల కోసం పార్టీలో ఊహించని స్థాయిలో పోటీ నెలకొంది. ఇటీవలే ప్రకటించిన పట్టభద్రుల కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలు రెండింటినీ రెడ్డి సామాజికవర్గానికే కేటాయించడంపై సోషల్ మీడియా వేదికగా, పార్టీ శ్రేణుల్లో విమర్శలు వ్యక్తమయ్యాయి. అందుకే సామాజిక సమీకరణాలను దారిలోకి తెచ్చేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం గవర్నర్ కోటాలోని స్థానాలను పూర్తిగా బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు కేటాయించే వ్యూహంతో ముందుకు వెళ్తోంది.ఈ నామినేషన్లలో తెలంగాణ ఉద్యమకారులకు, త్యాగాలు చేసిన కుటుంబాలకు ప్రాధ్యానమివ్వాలనే నిర్ణయం బలంగా వినిపిస్తోంది. ముఖ్యంగా తెలంగాణ తొలితరం ఉద్యమ నేత, ఆత్మగౌరవ ప్రతీక అయిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ కుటుంబానికి గవర్నర్ కోటాలో ఓ ఎమ్మెల్సీ స్థానాన్ని కేటాయించే ఆలోచనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. పద్మశాలి సామాజికవర్గానికి చెందిన బాపూజీ కుటుంబానికి, వారి కుమార్తెకు ఈ అవకాశం కల్పించడం ద్వారా అటు ఉద్యమకారులను గౌరవించినట్లవుతుందని, ఇటు కీలకమైన బీసీ ఓటు బ్యాంకుకు స్పష్టమైన సంకేతం ఇచ్చినట్లవుతుందని కాంగ్రెస్ భావిస్తోంది.ఈ మూడు స్థానాల భర్తీతో పార్టీలోని అసంతృప్తిని చల్లార్చడమే కాకుండా, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పక్కా సామాజిక ప్రాతిపదికను సిద్ధం చేసుకోవాలని అధిష్టానం యోచిస్తోంది. పద్మశాలి, గౌడ, ముదిరాజ్ లేదా ఎస్సీ సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం వహించే సీనియర్ నేతలు, కేడర్‌లో పట్టున్న ఉద్యమకారుల పేర్లను నివేదికల రూపంలో సేకరిస్తున్నారు. గ్రాడ్యుయేట్ స్థానాల్లో ఓపెన్ కేటగిరీకి ప్రాధాన్యత లభించడంతో, ఈ నోటిఫికేషన్‌లో అణగారిన వర్గాలకే పెద్దపీట వేయకపోతే సామాజిక న్యాయం నినాదానికి విఘాతం కలుగుతుందనే అభిప్రాయం పార్టీ అగ్రనేతల్లోనూ నెలకొంది. గవర్నర్ కోటా నామినేషన్ల చట్టబద్ధత, నియామకాల ప్రక్రియపై గతంలో కోర్టు కేసులు నడవడం, సుప్రీంకోర్టు పరిణామాలు కూడా ఈ నామినేషన్లపై ప్రభావం చూపే అవకాశం ఉందని తెలుస్తోంది. న్యాయపరమైన అంశాలను అధిగమించి, రాజ్యాంగ నిబంధనలకు కట్టుబడి కళలు, సామాజిక సేవ, సాహిత్యం లేదా ప్రజా సేవలో అనుభవం ఉన్న బీసీ, ఎస్సీ నేపథ్యమున్న నాయకుల పేర్లను గవర్నర్ ఆమోదానికి సిఫార్సు చేయాలని మంత్రివర్గం సన్నాహాలు చేస్తోంది.నవంబర్ ఎమ్మెల్సీ రగడ



కాంగ్రెస్ పార్టీకి అటు ఉద్యమకారులను ఆదుకోవడానికి, ఇటు సామాజిక న్యాయాన్ని నిలబెట్టుకోవడానికి ఒక రాజకీయ అవకాశంగా మారింది. కొండా లక్ష్మణ్ బాపూజీ కుటుంబానికి దక్కే అవకాశంతో పాటు మిగిలిన రెండు స్థానాల్లో ఎవరికి చోటు లభిస్తుందనేది తెలంగాణ పొలిటికల్ వర్గాల్లో ఆసక్తికర చర్చగా మారింది. బీసీ, ఎస్సీల మేళవింపుతో కూడిన ఈ వ్యూహం ఫలిస్తే, రేవంత్ రెడ్డి మార్క్ సోషల్ ఇంజనీరింగ్‌కు క్షేత్రస్థాయిలో మంచి మైలేజ్ లభించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# రూ. 65 వేల కోట్ల పెండింగ్ బిల్లులు

**రేవంత్ ప్రభుత్వానికి ఆర్థిక సవాల్!**

**హైదరాబాద్, అక్టోబరు 6:**తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. డిసెంబర్ 2023లో బాధ్యతలు చేపట్టిన నాటికి గత ప్రభుత్వం నుంచి వారసత్వంగా లభించిన రూ. 40,000 కోట్ల మేర పాత బిల్లులను క్లియర్ చేయడం కొత్త ప్రభుత్వానికి పెద్ద బాధ్యతగా మారింది. అందులోంచి ప్రాథమికంగా దాదాపు రూ. 8,000 కోట్ల బకాయిలను ప్రభుత్వం చెల్లించినప్పటికీ, నిరంతరం సమకూరుతున్న కొత్త బిల్లులు, పరిపాలనా వ్యయాల కారణంగా పెండింగ్ బిల్లుల భారం తగ్గే బదులు రెట్టింపైంది. ప్రస్తుతం కాంట్రాక్టర్లు, మాజీ సర్పంచులు, సరఫరాదారుల బకాయిలే ఏకంగా రూ. 51,000 కోట్లు దాటిపోవడం రాష్ట్ర ఆర్థిక ఆరోగ్య పరిస్థితికి అద్దం పడుతోంది.రోడ్లు, నీటిపారుదల, ఇతర మౌలిక వసతుల పనులు చేపట్టిన కాంట్రాక్టర్లతో పాటు గ్రామాల్లో అభివృద్ధి పనులు పూర్తి చేసిన మాజీ సర్పంచులు బిల్లులు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ చెల్లింపులు నిలిచిపోవడంతో బ్యాంకుల నుంచి తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక కాంట్రాక్టింగ్ రంగానికి చెందిన చిన్న, మధ్యతరహా వ్యాపారులు సంక్షోభంలో కూరుకుపోయారు. ఇదివరకు చేపట్టిన పనులకే నిధులు విడుదల కాకపోవడంతో నూతన అభివృద్ధి పనుల నిమిత్తం టెండర్లు పిలిచేందుకు లేదా కాంట్రాక్టర్లు ముందుకు వచ్చేందుకు వెనుకంజ వేస్తున్నారు. ఇది రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి కార్యక్రమాల వేగాన్ని తీవ్రంగా మందగించేలా చేస్తోంది.ఈ వరుస బకాయిలకు తోడు



ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల చెల్లింపుల సమస్య మరీ జటిలంగా మారింది. ఆగస్టు 2026 నాటికి ఉద్యోగులు, రిటైర్డ్ సిబ్బందికి చెల్లించాల్సిన మొత్తం బకాయిలు రూ. 14,000 కోట్లకు చేరుకున్నాయి. విధుల్లో ఉన్న సిబ్బందికి చెందిన డీఏ బకాయిలు, సరెండర్ లీవ్ గ్రాంట్లు రూ. 6,200 కోట్ల మేర పేరుకుపోగా, రిటైర్డ్ ఉద్యోగుల జీపీఎఫ్ , పెన్షన్ ప్రయోజనాల బకాయిలు ఏకంగా రూ. 8,000 కోట్లు దాటాయి. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ. 4,575 కోట్ల బకాయిలను విడుదల చేసినట్లు చెబుతున్నప్పటికీ, ఈ ఒక్క ఏడాదిలోనే సుమారు 9,000 మంది ఉద్యోగులు విధి నిర్వహణ నుంచి పదవీ విరమణ పొందడంతో గ్రాట్యుటీ, పెన్షన్ ఎన్‌క్యాష్‌మెంట్ భారం కొత్తగా వచ్చి చేరింది.మరోవైపు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ మరియు తాత్కాలిక ప్రాతిపదికన సేవలందిస్తున్న ఉద్యోగులకు అందాల్సిన వేతనాల్లో కూడా రూ. 2,000 కోట్ల మేర బకాయిలు ఉండటం క్షేత్రస్థాయి పాలనపై ప్రభావం చూపుతోంది. దీంతో పాటు జులై 2023 నుంచి పెండింగ్‌లో ఉన్న 6 కరువు భత్యం వాయిదాలలో ప్రభుత్వం ఇటీవల 2 వాయిదాలకు ఆమోదం తెలిపినప్పటికీ, ఇంకా మరో 4 డీఏ వాయిదాలు బకాయిల రూపంలోనే వేచి చూస్తున్నాయి. రాష్ట్ర బడ్జెట్‌లో పెన్షన్లు, జీతాల వ్యయం విపరీతంగా పెరగడమే ఈ సంక్షోభానికి ప్రధాన కారణం. 2023-24 నాటికి రాష్ట్ర మొత్తం బడ్జెట్‌లో జీతాలు, పెన్షన్ల వాటా 17.81 శాతంగా ఉండగా, 2026-27 ఆర్థిక సంవత్సరానికి అది 19.47 శాతానికి పెరిగింది. పన్నుల ఆదాయం, కేంద్ర నిధుల రాక అంచనాల కంటే తగ్గడం, దానికి తోడు రుణాల అసలు, వడ్డీ చెల్లింపులు గరిష్ఠ స్థాయికి చేరడం వల్ల ఖజానాపై విపరీతమైన ఒత్తిడి పెరుగుతోంది. మూలధన వ్యయానికి నిధులు సరిపోక పాత అప్పులు తీర్చడానికే కొత్తగా రుణాలు సేకరించాల్సిన పరిస్థితి ఉత్పన్నమవుతోంది.

# దసరాకు కొత్త పింఛన్లు..

**హనుమకొండ:** రాష్ట్ర ప్రభుత్వం దసరా కానుకగా చేయూత పథకం కింద కొన్ని వర్గాలకు చేయూత పింఛన్లు మంజూరు చేయనుంది. అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఇప్పటికే స్వీకరించారు. అయితే ఎన్నో ఏళ్ల నుంచి పింఛన్ కోసం ఎదురుచూస్తున్న వృద్ధులకు మాత్రం ప్రస్తుతం ఇవ్వడం లేదు. ఈ దఫా కేవలం వితంతు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, చేనేత, గీత కార్మికులతో పాటు ఫైలేరియా, డయాలసిస్ బాధితులకు మాత్రమే కొత్త పింఛన్లు ఇవ్వనున్నారు. వీరి దరఖాస్తులను మాత్రమే ఆన్‌లైన్ చేయడంతో వాటిని మండలస్థాయి అధికారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం విచారణను పూర్తి చేశారు.

**13206 ఎంపిక**

హనుమకొండ జిల్లాలోని 14 మండలాల పరిధిలో నూతనంగా చేయూత పింఛన్ కోసం మొత్తం 15,025 దరఖాస్తులు నమోదయ్యాయి. వితంతువులు 7,583 దరఖాస్తు చేసుకోగా దివ్యాంగులు 3,990, కల్లుగీత కార్మికులు 1,584, ఒంటరి మహిళలు 991, చేనేత కార్మికులు 877, ఫైలేరియా బాధితులు 285, డయాలసిస్ బాధితులు 90 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తులను సూపరింటెండెంట్ క్యాడర్ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ పూర్తి చేశారు. 13206 మందిని అర్హులుగా గుర్తించి అధికారులు నివేదికను ఉన్నతాధికారులకు అందజేశారు. ఇందులో మండల స్థాయి అధికారులకు మరింత క్షుణ్ణంగా పరిశీలన చేసి ప్రక్షాళన చేపట్టనున్నారు. ఆ తర్వాత జిల్లాస్థాయి అధికార, యంత్రాంగం పరిశీలన చేసి నివేదికను ప్రభుత్వానికి అందించనున్నారు. జిల్లాస్థాయిలో ఎంపిక చేసిన లబ్ధిదారులకు నూతన పింఛన్ అందుకోనున్నారు.

**దసరాకు కొత్త పింఛన్**

ప్రభుత్వం దసరా పండుగ కానుకగా అర్హులైన పేదలకు నూతన పింఛన్లు అందించేందుకు వేగంగా చర్యలు చేపడుతోంది. క్షేత్రస్థాయిలో పూర్తి పారదర్శకతతో దరఖాస్తుల విచారణ పూర్తి చేసి, ఏ ఒక్క అర్హుడికి అన్యాయం జరగకుండా లబ్ధిదారులను ఎంపిక చేస్తోంది. పేదరిక నిర్మూలనే ధ్యేయంగా పింఛన్ల పంపిణీకి శ్రీకారం చుట్టి, భాసటగా నిలిచేందుకు ప్రభుత్వం సన్నాహాలు వేగవంతం చేసింది. పండుగ వెలుగుల్లో ప్రతీ పేద కుటుంబం సంతోషంగా ఉండాలనే సత్సంకల్పంతో ఈ పింఛన్ల ప్రక్రియను శరవేగంగా కొలిక్కి తెచ్చింది. ప్రభుత్వం అందిస్తున్న ఈ దసరా కానుకపై లబ్ధిదారులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

## ఏడాదిలోపే ఇందిరమ్మ టవర్స్ పూర్తి చేసి లబ్ధిదారుల చేతికి తాళాలిస్తాం

- మొదటి పేజీ తరువాయి

వివరాలను కూడా లబ్ధిదారులకు తెలియజేయడంతో పాటు సంబంధిత ధ్రువపత్రాలను అందజేస్తామని చెప్పారు. ప్రస్తుతం కేటాయించిన ఇళ్లతో కార్యక్రమం ముగియదని, మరో మూడు విడతల్లోనూ ఇళ్ల నిర్మాణాన్ని చేపడతామని మంత్రి చెప్పారు. ప్రస్తుతం సుమారు 7.5 ఎకరాల స్థలం అందుబాటులో ఉందని, దీనితో పాటు నియోజకవర్గంలో ఉన్న ఇతర ప్రభుత్వ, హౌసింగ్ శాఖ భూములను గుర్తించి అక్కడ కూడా పేదలకు ఇళ్లు నిర్మించే చర్యలు చేపడతామని తెలిపారు. ఈ మేరకు హౌసింగ్ శాఖ ఉన్నతాధికారులకు ఇప్పటికే సూచనలు చేసినట్లు వెల్లడించారు. ఇళ్ల నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని మంత్రి అన్నారు. లబ్ధిదారులు కూడా తమ ఇళ్ల నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. "మీ కళ్ల ముందే మీ ఇల్లు నిర్మించబడాలి.. నాణ్యతతో కూడిన ఇంటిని సొంతం చేసుకున్నామనే తృప్తి, ఆనందం మీకు కలగాలి" అనేదే ఇందిరమ్మ ప్రభుత్వ ఉద్దేశమని చెప్పారు.పేదల చిన్న చిన్న కోరికలను నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం ఆ దిశగా చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు.పేదవాడి సొంతింటి కలను కేవలం హామీగా కాకుండా, కార్యరూపంలోకి తీసుకువస్తున్నామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి, హౌసింగ్ శాఖ సెక్రటరీ వి.పి.గౌతమ్, కలెక్టర్ మనూ చౌదరి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పలువురు లబ్దిదారులు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పట్ల ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## భారత జీడీపీ వృద్ధి 7.1 శాతం

- మొదటి పేజీ తరువాయి

బ్యాంకు పేర్కొంది. ఇదే ఒరవడి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ కొనసాగుతోందని, వృద్ధికి ప్రైవేట్ వినియోగమే ప్రధాన చోదక శక్తిగా నిలుస్తుందని విశ్లేషించింది. వీటికి తోడు, అంచనాల కంటే మెరుగ్గా రాణిస్తున్న ఎగుమతులు కూడా ఆర్థిక వృద్ధికి మరింత ఊతమిస్తాయని వివరించింది.రంగాల వారీగా విశ్లేషిస్తే, పారిశ్రామిక రంగం ముందస్తు అంచనాలను మించి రాణిస్తోందని ప్రపంచ బ్యాంకు తెలిపింది. తొలి త్రైమాసికంలో విద్యుత్ రంగం 9.3 శాతం, మౌలిక సదుపాయాలు, నిర్మాణ రంగాలు 7.2 శాతం వృద్ధిని సాధించాయి. అయితే, నైరుతి రుతుపవనాల లోటు కారణంగా వ్యవసాయ రంగం పనితీరు కొంత బలహీనంగా ఉండే అవకాశం ఉందని నివేదిక హెచ్చరించింది. ఆగస్టు వరకు వర్షపాతం తక్కువగా నమోదు కావడం గ్రామీణ డిమాండ్‌పై స్వల్ప ప్రభావాన్ని చూపవచ్చని అభిప్రాయపడింది.అంతర్జాతీయ అనిశ్చితుల దృష్ట్యా ప్రైవేట్ పెట్టుబడులపై ప్రభావం పడవచ్చని, ఫలితంగా ప్రభుత్వ వ్యయం కొంత మేర తగ్గే అవకాశం ఉందని నివేదిక పేర్కొంది. అయినప్పటికీ, పటిష్ఠమైన ప్రభుత్వ పెట్టుబడులు, అనుకూల ఆర్థిక విధానాలు ఈ లోటును భర్తీ చేస్తాయని విశ్లేషించింది. సేవల రంగంలో సైతం వృద్ధి పటిష్ఠంగా కొనసాగుతోందని ప్రపంచ బ్యాంకు తన నివేదికలో వెల్లడించింది.

## ఎల్-నినో ప్రభావంపై ... నివేదిక సిద్ధం చేయాలి

- మొదటి పేజీ తరువాయి

తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు అధికారులు తెలిపారు. కరువు పరిస్థితులపై ప్రణాళిక, రెవెన్యూ, గ్రౌండ్ వాటర్, వ్యవసాయం, పంచాయతీరాజ్, గ్రామీణ మంచి నీటి సరఫరా తదితర శాఖల నుంచి సమగ్ర వివరాలను సేకరించి, నిబంధనల ప్రకారం కరువు ప్రభావిత మండలాలను గుర్తించాలని ఆదేశించారు.జూన్ నుంచి సెప్టెంబర్ వరకు కొనసాగిన నైరుతి రుతుపవనాల సీజన్‌లో నమోదైన వర్షపాతం సహా 12 ప్రామాణిక అంశాలను పరిగణనలోకి తీసుకుని సమగ్ర కరువు నివేదికను రూపొందించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలు, నిర్దేశించిన ప్రమాణాలను ప్రామాణికంగా తీసుకుని కరువు ప్రభావిత మండలాలను ప్రకటించే ప్రక్రియను చేపట్టాలని, ఇందుకు సంబంధించిన పూర్తి స్థాయి నివేదికను అక్టోబర్ మాసాంతంలోగా సిద్ధం చేయాలని సీఎస్ ఆదేశించారు.ఎల్-నినో ప్రభావంపై రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని నిర్ణయించిన నేపథ్యంలో, ఆ సమావేశానికి అవసరమైన అన్ని వివరాలతో సమగ్ర నివేదికను సిద్ధం చేయాలని ఆయన అధికారులను కోరారు.

## ప్రతిపక్షం స్థాయికి కాక్రోచ్‌లు..

- మొదటి పేజీ తరువాయి

ఈ ఉద్యమాలకు తెరతీశాయి. పేరుకు యువత, జెన్-జీ ఆందోళనలని సోషల్ మీడియాలో డబ్బా కొట్టుకుంటున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో బారికేడ్లను నెట్టి, పోలీసులతో ఘర్షణ పడుతూ అరెస్టులవుతున్న వారిలో అత్యధికులు ఆయా రాజకీయ పార్టీల అనుబంధ విద్యార్థి, యువజన విభాగాల కార్యకర్తలేనన్నది బహిరంగ రహస్యం.వాస్తవానికి నేటి సరికొత్త తరం యువతకు తమ కెరీర్, నైపుణ్యాలు, ఉద్యోగావకాశాలు, స్టార్టప్‌లే ప్రధానం తప్ప.. ఇలాంటి రాజకీయ ముసుగుల కోసం నెలల తరబడి రోడ్లెక్కి నిరసనలు చేసే తీరిక, ఆసక్తి ఎంతమాత్రం లేవు. కేవలం కొందరు డిజిటల్ ఇన్‌ఫ్లుయెన్సర్లు, సోషల్ మీడియా రీల్స్ సరదాతో వైరల్ అవుతున్న హైటెక్ ఆందోళనకారులను అడ్డం పెట్టుకుని, పార్టీల క్యాడర్‌ను తరలించి ఒక కృత్రిమ ప్రజా తిరుగుబాటును సృష్టించేందుకు విపక్షాలు పడరాని పాట్లు పడుతున్నాయి. ప్రస్తుతం దేశ రాజకీయ ముఖచిత్రంలో అసలైన ప్రధాన ప్రతిపక్షంగా కాక్రోచ్ లే వ్యవహరిస్తుండగా, పార్లమెంట్‌లో కూర్చున్న కాంగ్రెస్ వంటి వ్యవస్థాగత పార్టీలన్నీ నామమాత్రపు డమ్మీ లుగా మిగిలిపోయాయి.కేంద్ర ప్రభుత్వాన్ని విధానపరంగా నిలదీయడంలో, పాలనాపరమైన వైఫల్యాలపై ప్రజల్లో బలమైన చర్చను లేవనెత్తడంలో అధికారిక విపక్షాలు ఘోరంగా చేతులెత్తేశాయి. తమ స్వయంకృతాపరాధాలతో ప్రజల విశ్వసనీయతను కోల్పోయి, ఇప్పుడు ఒక నాన్-పొలిటికల్, నాన్-సీరియస్ గ్రూప్ విసిరే ఎంగిలి రొట్టెల కోసం, వారు కల్పించే వేదికల మైలేజ్ కోసం వెంపర్లాడే దుస్థితికి దేశంలోని ప్రతిపక్షాలన్నీ దిగజారాయి. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సైతం తన ప్రధాన ప్రతిపక్ష పాత్రను అధికారికంగానే కాక్రోచ్ జనతా పార్టీకి రాసిచ్చేస్తే మంచిదేమో అన్న సెటైర్లు రాజకీయ విశ్లేషకుల నుంచి వినిపిస్తున్నాయి. ప్రజాక్షేత్రంలో ప్రజల నాడిని పట్టుకుని పోరాడే దమ్ము లేక, ప్రతీదానికీ ఈవీఎంలు, ఎన్నికల సంఘం అంటూ సాకులు వెతుక్కుంటూ కాలం గడిపే పార్టీలకు రాజకీయం చేయడం చేతకానట్లే.

## ఖరీఫ్ ఎరువుల పంపిణీ విజయవంతం...

- మొదటి పేజీ తరువాయి

పంపిణీ ప్రక్రియను డిజిటల్ విధానంలోకి తీసుకువచ్చామని మంత్రి తెలిపారు. ఈ విధానం ద్వారా ఎక్కడ ఎంత ఎరువుల నిల్వ ఉంది.. ఎంత పరిమాణంలో బుకింగ్ జరిగింది.. ఎంత మేరకు రైతులు ఎరువులను కొనుగోలు చేశారు అనే వివరాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించే అవకాశం ఏర్పడిందన్నారు.అంతకుముందే రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన యూరియా యాప్‌ను సమర్థవంతంగా అమలు చేసి, ఎరువుల అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌కు అడ్డుకట్ట వేయడంలో విజయం సాధించామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో యూరియా పంపిణీని పారదర్శకంగా నిర్వహించేందుకు ఈ యాప్ ఎంతగానో ఉపయోగపడిందన్నారు. రాష్ట్రంలో అమలు చేసిన యూరియా యాప్ విజయవంతమైన నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వం ఈ విధానాన్ని మరింత విస్తృత స్థాయిలో అమలు చేసేందుకు జాతీయ ఫెర్టిలైజర్ యాప్‌ను ఈ ఏడాది అందుబాటులోకి తీసుకువచ్చిందని తెలిపారు.

# అధికార, ప్రతిపక్ష కుటుంబాల ఆస్తుల పంచాయతీ

**విచారించాలని ఛీఫ్ జస్టీస్ కు లేఖ రాసిన ఎంపి రఘునందన రావు**



**పటాన్ చెరు:**అధికార, ప్రతిపక్ష కుటుంబాల ఆస్తుల పంచాయతీ పై హైకోర్టు చీఫ్ జస్టిస్ కి మెదక్ ఎంపీ రఘునందన్ రావు లేఖ రాసారు . పత్రికల లో వచ్చిన ఆరోపణల వివరాలను జతపరిచారు. ఆ రెండు కుటుంబాల ఆస్తులపై వెంటనే విచారణ జరపాలని విజ్ఞప్తి చేసారు. రాష్ట్ర ముఖ్యమంత్రి అదేవిధంగా బీఆర్ఎస్ నాయకుల మధ్య జరుగుతున్న ఆస్తుల పంచాయతీ గురించి విచారణ జరిపించమని ఎవరూ అడగడం లేదంటున్నారు. సోమవారం వరకు చూసి న్యాయ విచారణ జరగని పక్షంలో నేనే అడుగుతూ అన్నారు.ఈ రోజు ఉదయం 10:30 గంటలకు హైకోర్టు తెరిచే సమయానికి డ్రాఫ్ట్ చేసిన ఫిర్యాదు గౌరవ హైకోర్టు న్యాయమూర్తికి ఫిర్యాదు చేశాను. ఇది సిల్ ా రూపం లో కానీ విచారణ రూపంలో కానీ వెంటనే స్వీకరించాలని రాతపూర్వక ఫిర్యాదు చేశాను. అక్టోబర్ 2 న నేను చెప్పినట్టుగా ఈ ఫిర్యాదు చేశాను. సీఎం మీద కేటీఆర్, బీఆర్ఎస్ ా మీద సీఎం చేసిన ఆరోపణలు రెండింటిని జతపరిచి తర్జుమా కూడా చేశాను. సుప్రీం కోర్టు చీఫ్ జస్టిసిగారికి కూడా ఫిర్యాదు చేస్తానని అన్నారు.బీఆర్ ఎస్ వారు కేసీఆర్ కుటుంబం దోచుకుందని చెప్తున్న లక్ష కోట్ల రూపాయలు... రెండున్నర సంవత్సరాల లో రేవంత్ రెడ్డి సంపాదించిన యాభై వేల కోట్ల రూపాయలు మొత్తం ప్రజలకు పంచాలని కోరుతున్న. అటు ప్రతిపక్ష కుటుంబం, ఇటు సీఎం కుటుంబం అఫిడవిట్ల కన్నా ఎక్కువ ఉన్న ఆస్తుల ను వెంటనే గుర్తించి విచారణ చెయ్యాలని గౌరవ హైకోర్టును విన్నవిస్తున్న. రేపే సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ కి కూడా రేపే పోస్ట్ ద్వారా పంపిస్తా . వాళ్ళు దోచుకున్నది, వీళ్ళు దోచుకున్నది ప్రజల ముందు పెట్టాలని అది ప్రజలకు పంచాలని కోరుతున్నానని అన్నారు.

## గ్రేటర్ కమిషనర్ కు హైకోర్టు నోటీసులు



**హైదరాబాద్, అక్టోబరు 6:**గాంధీ జయంతి సందర్భంగా నగరంలో మాంసం దుకాణాలను మూసివేయాలని ఆదేశాలు జారీ చేసినందుకు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌కు తెలంగాణ హైకోర్టు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది. ఫిబ్రవరిలో కోర్టు ఇచ్చిన ఆదేశాలకు విరుద్ధంగా ప్రవర్తించారంటూ దాఖలైన పిటిషన్‌పై నిన్న విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ శ్రవణ్ కుమార్ ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చారు.తార్నాకకు చెందిన న్యాయ విద్యార్థి వడ్ల శ్రీకాంత్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. గతంలో ఇలాంటి ఉత్తర్వులపై శ్రీకాంత్ కోర్టును ఆశ్రయించగా, ఈ ఏడాది ఫిబ్రవరిలో హైకోర్టు కీలక ఆదేశాలిచ్చింది. స్లాటర్‌హౌస్‌లు, మాంసం దుకాణాల మూసివేతకు సంబంధించిన ఏ ఉత్తర్వులైనా జీహెచ్ఎంసీ చట్టం-1955 నిబంధనలకు అనుగుణంగానే ఉండాలని స్పష్టం చేసిందని పిటిషనర్ తరఫు న్యాయవాది విజయ్ గోపాల్ కోర్టుకు వివరించారు.అయితే, ఆ ఉత్తర్వులను పట్టించుకోకుండా అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా స్లాటర్‌హౌస్‌లు, రిటైల్ మాంసం, బీఫ్ దుకాణాలను మూసివేయాలని సెప్టెంబర్ 30న జీహెచ్ఎంసీ పత్రికా ప్రకటన విడుదల చేసిందని ఆయన వాదించారు. జీహెచ్ఎంసీ చట్టం ప్రకారం రూపొందించిన నిబంధనలను గెజిట్‌లో ప్రచురించకుండా ఈ నిర్ణయం తీసుకోవడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. మాంసం దుకాణాల మూసివేత వ్యాపారుల ప్రాథమిక హక్కులను (ఆర్టికల్ 19(1)(స్త్ర)) ఉల్లంఘిస్తుందని తెలిపారు.కోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా ధిక్కరించిన కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని, ఆయనకు రూ.50,000 జరిమానా విధించాలని పిటిషన్‌లో కోరారు. వాదనలు విన్న న్యాయస్థానం, కమిషనర్‌కు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను వచ్చేనెల 2వ తేదీకి వాయిదా వేసింది.

### బార్ల యజమానులకు నష్టం లేదు..

## వినియోగదారులపై స్వల్ప భారం

**మంత్రి జూపల్లి**

**ప్రివిలేజ్ ఫీజుతో బార్ల యజమానులకు నష్టం లేదన్న మంత్రి జూపల్లి**

**వినియోగదారులపై పడేది స్వల్ప భారమేనని స్పష్టీకరణ**

**బీఆర్ఎస్ హయాంలో మద్యం ఆదాయం 260 శాతం పెరిగిందని వెల్లడి**




రాష్ట్రంలో కొత్తగా ప్రతిపాదించిన ప్రివిలేజ్ ఫీజు వల్ల బార్ల యజమానులకు ఎలాంటి నష్టం జరగదని, వినియోగదారులపై మాత్రమే స్వల్ప భారం పడుతుందని తెలంగాణ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. ప్రివిలేజ్ ఫీజును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బార్స్ అండ్ రెస్టారెంట్స్ అసోసియేషన్ చేపట్టిన నిరసనలపై ఆయన స్పందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... మద్యం ధరలు పెంచడం వల్ల ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుందే తప్ప, వినియోగం పెద్దగా తగ్గదని గత అనుభవాలు చెబుతున్నాయన్నారు. హైదరాబాద్ నగరం అప్‌గ్రేడ్ అయినందున, ఇతర రాష్ట్రాల్లో ఉన్న విధంగానే ఇక్కడా బార్ లైసెన్సులను జారీ చేశామని తెలిపారు. ఈ కొత్త రుసుము బార్ యాజమాన్యాలకు నష్టం కలిగించేది కాదని ఆయన పునరుద్ఘాటించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మద్యం ద్వారా వచ్చే ఆదాయం రూ.10,000 కోట్ల నుంచి రూ.36,000 కోట్లకు, అంటే దాదాపు 260 శాతం పెరిగిందని జూపల్లి గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మద్యం ఆదాయం ప్రస్తుతం రూ.40,000 కోట్లుగా ఉందని వివరించారు. ప్రభుత్వం చట్ట ప్రకారమే ముందుకు వెళుతోందని, మద్యం ఉత్పత్తికి నీటి కొరత ఏమీ లేదని ఆయన పేర్కొన్నారు.

# బీసీ సీఎం నినాదం వెనుక..?



**హైదరాబాద్, అక్టోబరు 6:**తెలంగాణ కాంగ్రెస్ పార్టీ నేతల రాజకీయం చాలా తేడాగా ఉంటుంది. రేవంత్ రెడ్డి తన రాజకీయ వ్యూహాలతో బీఆర్ఎస్ పార్టీని ముప్పుతిప్పలు పెడుతూంటే.. ఇతర నేతలు మాత్రం కొత్త కొత్త టాపిక్స్‌తో ... స్వయంకృతాపరాధాలతో పార్టీని ఇరుకున పెడుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూపంలో రాష్ట్రంలో ఒక బలమైన నాయకుడు పార్టీకి ప్రధాన పిల్లర్‌గా ఉండి ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారు. ఆయన చరిష్మా, దూకుడును చూసే ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించారన్నది కాదనలేని సత్యం. ఇలాంటి పరిస్థితుల్లో పార్టీలో ఎలాంటి ప్రాతిపదిక లేకుండా, అకస్మాత్తుగా బీసీ సీఎం నినాదాన్ని తెరపైకి తీసుకురావాల్సిన అవసరం కాంగ్రెస్ నాయకులకు ఏమొచ్చింది..? మర్ధుడైన నాయకుడు సీఎంగా ఉండి ప్రభుత్వాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్న సమయంలో, ఇలాంటి వివాదాస్పద నినాదాలు ఎవరి ప్రయోజనాల కోసం?టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ అయినా, లేదా పార్టీలోని ఇతర బీసీ నాయకులైనా ముందుగా ప్రజల్లో తమకంటూ ప్రత్యేకమైన ప్రజాదరణ, పలుకుబడి సంపాదించుకోవాలి. కేవలం పదవులను అడ్డంపెట్టుకుని లేదా అధిష్టానం కటాక్షం ఉందనే భ్రమలతో ఎదిగిపోదామంటే రాజకీయాల్లో కుదరదు. రేవంత్ రెడ్డికి దీటుగా ప్రజల్లోకి వెళ్లడం, పార్టీని రాష్ట్రవ్యాప్తంగా గెలిపించగల సత్తాను సొంతంగా నిరూపించుకోవడం ముఖ్యం. తాను కూడా పార్టీని అధికారంలోక్కి వడంలో కీలక పాత్ర పోషించగలను అని ప్రజలకు విశ్వాసం కలిగించిన తర్వాతే సీఎం పదవి లేదా భవిష్యత్తు నాయకత్వం గురించి ఆలోచించాలి. అంతేకాని, క్షేత్రస్థాయిలో ఎలాంటి బలమైన ప్రజాసమద్దతు కూడగట్టుకోకుండా, నేరుగా రాహుల్ గాంధీ తమకు సీఎం పదవి కట్టబెట్టేస్తారనే ఆశతో నినాదం వినిపించడం కాంగ్రెస్‌లోనే సాధ్యం.అసలు ముందుగా పార్టీ మళ్లీ అధికారంలోకి రావాలి కదా! పార్టీ గెలవకుండా కేవలం పదవుల పంచాయతీలు పెట్టుకుంటే మొదటికే మోసం వస్తుందనే కనీస స్పృజ్ఞ ఈ నేతలకు ఎందుకు ఉండటం లేదు? రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం దూసుకుపోతుంటే, దానికి తూట్లు పొడిచేలా వర్గపోరును ప్రోత్సహించే ఇటువంటి నినాదాలు పార్టీ శ్రేణుల్లో తీవ్ర గందరగోళానికి దారితీస్తున్నాయి. ఏమాత్రం కాలానికి తగ్గట్టుగా లేని, ప్రజలకు ఉపయోగపడని ఇలాంటి అనవసర ప్రచారాల వల్ల పార్టీ బలహీనపడటం మినహా ఒరిగేదేమీ లేదు. ఈ నినాదాలతో ఏ వర్గాన్ని సంతృప్తి పరచాలని చూస్తున్నారో, అసలు దీని వెనుక ఏ లాలూచీ రాజకీయాలున్నాయో ఆ నాయకులకే తెలియాలి.రాష్ట్రంలో సమర్ధవంతమైన పాలన అందిస్తున్న ప్రభుత్వాన్ని బలోపేతం చేయాల్సింది పోయి, అనవసరమైన కుల సమీకరణాల తెరవెనుక వ్యక్తిగత లబ్ది కోసం పావులు కదపడం కాంగ్రెస్ పార్టీకి ఏమాత్రం శ్రేయస్కరం కాదని కార్యకర్తలు కూడా గొణుక్కుంటున్నారు. ప్రజలు కోరుకుంటున్న అభివృద్ధి, సంక్షేమం పట్ల దృష్టి పెట్టకుండా, ఇలాంటి కుర్చీలాటల నినాదాలతో కాలయాపన చేస్తే భవిష్యత్తులో పార్టీ తీవ్ర మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. నాయకులు ఈ అర్థంపర్థం లేని ప్రచారాలను మాని, పార్టీ ఐక్యత కోసం, ప్రభుత్వ విజయాల ప్రచారం కోసం పాటుపడాలన్న సూచనలు ఆ పార్టీ కిందిస్థాయి క్యాడర్ నుంచి వస్తున్నాయి.

# రూ. 80కి చేరిన సన్నబియ్యం



**నల్గొండ, అక్టోబరు 6:** సన్న బియ్యం ధరలు సామాన్యుడికి చుక్కలు చూపిస్తున్నాయి. కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే కిలో సన్న బియ్యం ధర ఏకంగా 25% మేర పెరిగింది. గతంలో కిలో రూ.50 నుంచి రూ.55 మధ్య ఉన్న ధరలు, ఇప్పుడు రూ.65 నుంచి రూ.83 వరకు చేరాయి. లో క్వాలిటీ సన్నరకం బియ్యం సైతం రూ.60కి పైగా ధర పలుకుతున్నాయి. ఎల్‌నినో ఎఫెక్ట్, వర్షాలు లేక ధాన్యం దిగుబడి తగ్గడం, యాసంగి సాగు విస్తీర్ణం తగ్గడంతో ధరల పెరుగుదలకు ప్రధాన కారణాలుగా తెలుస్తోంది. తెలంగాణలో పండుతున్న సన్నరకం ధాన్యానికి కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లో భారీ డిమాండ్ ఉంది. కోతలు మొదలవ్వగానే ఆయా రాష్ట్రాల వ్యాపారులు పచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేసి ముంబై, బెంగళూరు, చెన్నై నగరాలకు తరలిస్తుండటంతో స్థానికంగా కొరత ఏర్పడుతుంది. గతంలో మిల్లర్లు వ్యాపారులకు గడువు ఇచ్చేవారు. ప్రస్తుతం నగదు చెల్లించిన తర్వాతే బియ్యం ఇస్తుండటంతో రిటైల్ షాపుల యజమానులు ధరలు భారీగా పెంచుతున్నారు. పౌరసరఫరాల సంస్థ గత ఖరీఫ్‌లో సేకరించిన ధాన్యంలో మిగులు, కస్టమ్ మిల్లింగ్ రైస్‌లో అక్రమాలు జరగడం మార్కెట్‌ను దెబ్బతీస్తున్నాయి. విజిలెన్స్ తనిఖీల్లో రూ.2,000 కోట్ల విలువైన ధాన్యం మాయమైనట్లు తేలింది.కొందరు మిల్లర్లు ప్రభుత్వ మేలు రకం ధాన్యాన్ని ఇతర రాష్ట్రాలకు విక్రయించి, నాణ్యత లేని ధాన్యాన్ని, రేషన్ బియ్యాన్ని అక్రమంగా మిల్లులకు తరలించి ధరల పెరుగుదలకు పరోక్ష కారణమవుతున్నాయి.

**బియ్యం ధరలు (25 కిలోలు)**

**లలిత సోనామసూరి: కిలో రూ.71.33**

**కర్నూలు సోనామసూరి: కిలో రూ.70**

**హెచ్ఎంటీ రా రైస్: కిలో రూ.69 - రూ.78**

పొరుగు రాష్ట్రాల వ్యాపారులు సన్నధాన్యం సేకరించకుండా ప్రభుత్వం కఠిన ఆంక్షలు విధించాలి. బియ్యం అక్రమ నిల్వలు, మిల్లుల్లో రీసైక్లింగ్‌పై విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టాలి. ధాన్యం కేటాయింపుల సమయంలో మిల్లుల సామర్థ్యం, ఖాళీలను కచ్చితంగా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. రేషన్ సన్నబియ్యంలో నూకల శాతాన్ని తగ్గించడం ద్వారా ఈ అక్రమాలకు అడ్డుకట్ట వేయవచ్చు. ఒకవైపు సంక్షేమ పథకాల అమలు, మరోవైపు పేరుకుపోయిన రూ. 65,000 కోట్లకు పైగా సర్వీస్, డెవలప్‌మెంట్ బకాయిలను సమతుల్యం చేసుకోవడం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి అత్యంత సంక్లిష్టమైన సవాలుగా మారింది. పన్నుయేతర ఆదాయాన్ని పెంచుకోవడం, ప్రాధాన్యతా ప్రాజెక్టులను సవరిస్తూ క్రమశిక్షణతో కూడిన ఆర్థిక నిర్వహణను పాటించకపోతే.. ఈ బకాయిల సుడిగుండం రాష్ట్ర యంత్రాంగాన్ని మరింత ప్రతిష్టంభనలోకి నెట్టే ప్రమాదం ఉందని ఆర్థిక విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

### మందుబాబుల్లో

# తెలంగాణ టాప్...

**15 ఏళ్లకే గ్లాసు బద్దలు కొడుతున్నారు**




**హైదరాబాద్, అక్టోబరు 6:**మద్యం వినియోగంలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. రాష్ట్రంలో 15 ఏళ్లు పైబడిన పురుషుల్లో ఏకంగా 43.9 శాతం మంది మద్యం సేవిస్తున్నట్లు NFHS-6 సర్వే గణాంకాలు వెల్లడించాయి. దేశవ్యాప్తంగా ఇదే వయసు పురుషుల్లో మద్యం వినియోగం సగటు 18.9 శాతంగా ఉండగా.. తెలంగాణలో నమోదైన శాతం దానికి రెండింతలకు పైగా ఉండటం గమనార్హం. ఈ గణాంకాలు రాష్ట్రంలో మద్యం వినియోగం ఏ స్థాయిలో ఉందో స్పష్టం చేస్తున్నాయి.NFHS-6 గణాంకాల ప్రకారం.. మద్యం వినియోగంలో తెలంగాణ తర్వాత రాజస్థాన్ రెండో స్థానంలో ఉంది. ఆ రాష్ట్రంలో 15 ఏళ్లు పైబడిన పురుషుల్లో 42.2 శాతం మంది మద్యం సేవిస్తున్నట్లు నమోదైంది. 38.3 శాతంతో ఛత్తీస్‌గఢ్ మూడో స్థానంలో ఉండగా.. 33.6 శాతంతో జార్ఖండ్ నాలుగో స్థానంలో, 26.9 శాతంతో మధ్యప్రదేశ్ ఐదో స్థానంలో నిలిచాయి. ఈ రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో మద్యం వినియోగం గణనీయంగా ఎక్కువగా ఉన్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి.తెలంగాణలో పట్టణ ప్రాంతాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో మద్యం వినియోగం అధికంగా ఉండటం మరో కీలక అంశంగా మారింది. పట్టణ ప్రాంతాల్లో 15 ఏళ్లు పైబడిన పురుషుల్లో మద్యం వినియోగం 36.3 శాతంగా ఉండగా.. గ్రామీణ ప్రాంతాల్లో ఇది 46.6 శాతంగా నమోదైంది. అంటే నగరాల కంటే గ్రామీణ ప్రాంతాల్లో మద్యం సేవించే వారి శాతం దాదాపు 10 శాతం పాయింట్లు ఎక్కువగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో మద్యం వినియోగాన్ని తగ్గించేందుకు అవగాహన కార్యక్రమాలు, ప్రజారోగ్య చర్యలు మరింత అవసరమనే చర్చకు ఈ గణాంకాలు దారితీస్తున్నాయి.మద్యం వినియోగం పురుషులకు మాత్రమే పరిమితం కావడం లేదని NFHS-6 గణాంకాలు సూచిస్తున్నాయి. మహిళల్లోనూ మద్యం సేవించే వారి శాతం నమోదైంది. తెలంగాణలో మహిళల మద్యం వినియోగం 7.1 శాతంగా ఉండగా.. ఈ విభాగంలో రాజస్థాన్ 19.9 శాతంతో మొదటి స్థానంలో ఉంది. తెలంగాణ 7.1 శాతంతో రెండో స్థానంలో నిలిచింది. ఛత్తీస్‌గఢ్‌లో 5.7 శాతం, జార్ఖండ్‌లో 5.5 శాతం, మధ్యప్రదేశ్‌లో 1.6 శాతం మహిళలు మద్యం సేవిస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.మొత్తంగా చూస్తే తెలంగాణలో పురుషుల్లో మద్యం వినియోగం జాతీయ సగటుతో పోలిస్తే చాలా అధికంగా ఉండటం, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వినియోగం మరింత ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగించే అంశంగా మారింది. మహిళల్లోనూ వినియోగం పెరుగుతున్నట్లు కనిపించడం మరో ముఖ్య పరిణామం. మద్యం అధికంగా తీసుకోవడం కుటుంబ ఆర్థిక పరిస్థితులు, ఆరోగ్యం, సామాజిక జీవనంపై ప్రభావం చూపే అవకాశం ఉండటంతో.. ఈ గణాంకాల నేపథ్యంలో మద్యం వినియోగ నియంత్రణ, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## శంషాబాద్ ఎయిర్‌పోర్టులో 1.20 కోట్ల బంగారం పట్టివేత



**హైదరాబాద్ :**శంషాబాద్ ఎయిర్‌పోర్టులో డీఆర్ఐ అధికారులు సుమారు 800 గ్రాముల బంగారు ఆభరణాలను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన ఓ నగల వ్యాపారి తిరుచిరాపల్లి నుంచి ఇండిగో విమానంలో హైదరాబాద్‌కు వచ్చారు. ఆయన బ్యాగులో అక్రమంగా బంగారం తరలిస్తున్నారనే పక్కా సమాచారంతో అధికారులు తనిఖీలు నిర్వహించి, సుమారు రూ.1.20 కోట్ల విలువైన బంగారాన్ని పట్టుకున్నారు. ఈ ఘటనపై డీఆర్ఐ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డికి బెయిల్.. జైలు నుంచి విడుదల

**లైంగిక వేధింపుల కేసులో ట్రైనీ ఐపీఎస్‌కు బెయిల్**

**67 రోజుల తర్వాత జైలు నుంచి ఉదయ్ కృష్ణారెడ్డి విడుదల**

**షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిన ఉప్పరపల్లి కోర్టు**

**సహచర మహిళా అధికారి ఫిర్యాదుతో గతంలో అరెస్ట్**



లైంగిక వేధింపుల ఆరోపణల కేసులో అరెస్టయిన ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డికి ఊరట లభించింది. సుమారు 67 రోజులుగా జైల్లో ఉన్న ఆయనకు హైదరాబాద్‌లోని ఉప్పరపల్లి కోర్టు మంగళవారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. దీంతో ఆయన చర్లపల్లి జైలు నుంచి విడుదలయ్యారు. గతంలో ఉదయ్ కృష్ణారెడ్డి తనను లైంగికంగా వేధిస్తున్నారని ఆరోపిస్తూ, ఆయన సహచర మహిళా ఐపీఎస్ అధికారి అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు అనంతరం ఉదయ్ కృష్ణారెడ్డిని అరెస్ట్ చేశారు. అనంతరం అతడిని కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. అప్పటి నుంచి ఆయన చర్లపల్లి జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. తాజాగా ఈ కేసులో విచారణ జరిపిన ఉప్పరపల్లి కోర్టు, ఆయనకు బెయిల్ మంజూరు చేయడంతో జైలు నుంచి బయటకు వచ్చారు.

# తెలంగాణలో 35 మంది ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల తొలగింపు



తెలంగాణలో నకిలీ విద్యార్హత సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన 35 మంది ప్రభుత్వ జూనియర్ లెక్చరర్లను ఇంటర్మీడియట్ విద్యాశాఖ విధుల నుంచి తొలగించింది. వారు సమర్పించిన సర్టిఫికెట్లు నకిలీవని ధ్రువీకరణ కావడంతో ఈ కఠిన చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. వివరాల్లోకి వెళితే, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మొదట కాంట్రాక్టు లెక్చరర్లుగా పనిచేసిన వీరందరినీ 2023లో ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసింది. అయితే, వారి విద్యార్హత పత్రాలపై అనుమానాలు రావడంతో ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఆ సర్టిఫికెట్లను సంబంధిత విశ్వవిద్యాలయాలకు వెరిఫికేషన్ కోసం పంపింది. పరిశీలన అనంతరం ఆ సర్టిఫికెట్లు నకిలీవని యూనివర్సిటీలు తేల్చి చెప్పాయి. దీంతో విద్యాశాఖ సదరు లెక్చరర్లకు షో-కాజ్ నోటీసులు జారీ చేసి, వారి వివరణ తీసుకున్న తర్వాత సర్వీస్ నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.ఉద్యోగాలు కోల్పోయిన వారిలో రాజన్న-సిరిసిల్ల జిల్లా నుంచి ఆరుగురు ఉండగా, పెద్దపల్లి, సిద్దిపేట, సూర్యాపేట జిల్లాల నుంచి ముగ్గురు చొప్పున ఉన్నారు. భద్రాద్రి కొత్తగూడెం, కరీంనగర్, ఖమ్మం, నిర్మల్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల నుంచి ఇద్దరేసి లెక్చరర్లు ఉన్నారు. మరో ఎనిమిది జిల్లాల నుంచి ఒక్కొక్కరు చొప్పున ఈ జాబితాలో ఉన్నారు.ఇదే తరహా ఆరోపణలపై గతంలో సుమారు 10 మంది లెక్చరర్లను తొలగించినట్లు సమాచారం. ప్రస్తుతం మరో 320 మంది లెక్చరర్ల సర్టిఫికెట్లను కూడా వెరిఫికేషన్ కోసం యూనివర్సిటీలకు పంపినట్లు అధికారులు వెల్లడించారు.ఇదిలా ఉండగా, ఈ వ్యవహారంపై సీబీ-సీఐడీ, విజిలెన్స్ విచారణ జరిపించాలని ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఛైర్మన్ డాక్టర్ పి. మధుసూదన్ రెడ్డి డిమాండ్ చేశారు. గతంలో ఈ నకిలీ పత్రాలను పరిశీలించి, ధ్రువీకరించిన అధికారుల పాత్రపై కూడా విచారణ జరపాలని ఆయన కోరారు. మోసం రుజువైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# దామరగిద్ద కస్తూర్బా పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ ప్రియాంక





**నారాయణపేట అక్టోబర్ 6 (స్కై న్యూస్)** దామరగిద్ద మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల/కళాశాలను జిల్లా కలెక్టర్ ప్రియాంక మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాల ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న అదనపు గదుల భవనాన్ని పరిశీలించిన ఆమె, నిర్మాణ పనులు తుది దశలో ఉన్నందున పనులను త్వరగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులను ఫోన్ ద్వారా ఆదేశించారు.పాఠశాల ఆవరణలో ఫర్నిచర్ నిరుపయోగంగా ఉండటాన్ని గమనించిన కలెక్టర్ సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాత భవనంలో పాఠశాల, కళాశాల తరగతుల నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎస్ఓ స్వాతి కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, నూతన భవనంలోని కింది అంతస్తులో ఉన్న అదనపు గదులను తరగతుల నిర్వహణకు వినియోగించుకోవాలని సూచించారు.అనంతరం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం తరగతి గదిని సందర్శించిన కలెక్టర్ విద్యార్థినులతో మాట్లాడి వారి విద్యాభ్యాసం, భవిష్యత్ లక్ష్యాలను తెలుసుకున్నారు. ఉన్నత విద్యలో ఏ కోర్సులు చదవాలనుకుంటున్నారని ప్రశ్నించగా, విద్యార్థినులు న్యాయ విద్యను అభ్యసించాలని ఉందని తెలిపారు. విద్యార్థినులు పట్టుదలతో చదివి కనీసం డిగ్రీ వరకు విద్యను కొనసాగించాలని, ఉన్నత విద్యతో పాటు భవిష్యత్‌లో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేలా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు.వొకేషనల్ తరగతి గదిని సందర్శించి విద్యార్థినులతో మాట్లాడిన కలెక్టర్, వారి భవిష్యత్ విద్యా ప్రణాళికలను అడిగి తెలుసుకున్నారు. బీఎస్సీ నర్సింగ్ చదవాలనుకుంటున్నామని విద్యార్థినులు తెలపగా, జిల్లా కేంద్రంలో నర్సింగ్ కళాశాల అందుబాటులోకి రానుందని, విద్యార్థినులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పోషకాహారం తీసుకోవాలని తెలిపారు.మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థినుల వద్దకు వెళ్లిన కలెక్టర్, మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని పరిశీలించారు. మెస్ కమిటీ విద్యార్థినులతో మాట్లాడి కూరగాయలు, నిత్యావసర సరుకుల నాణ్యత, భోజన నిర్వహణను క్రమం తప్పకుండా పరిశీలిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టోర్ రూమ్‌ను పరిశీలించి నిత్యావసర సరుకుల నిల్వలను తనిఖీ చేశారు. మెనూ బోర్డును చూశారు.పాఠశాలలోని ఆర్వో ప్లాంట్ పనిచేయడం లేదని తెలుసుకున్న కలెక్టర్ వెంటనే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. అవసరమైతే కొత్త ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు.డైనింగ్ షెడ్‌ను పరిశీలించిన కలెక్టర్, పక్షులు లోపలికి రాకుండా షెడ్ ఎత్తును పెంచి అవసరమైన నిర్మాణ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎస్ఓను ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పరిశుభ్రమైన, నాణ్యతతో కూడిన పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ తిరుపతయ్య, ఎంపీడీవో సాయిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ఉద్యమాన్ని ఉధృతం...



**నాగర్ కర్నూల్ అక్టోబర్ 6( స్కై న్యూస్)** ప్రజాస్వామ్యంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కును కల్పించే వరకు వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ సిపిఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు డిమాండ్ చేశారు మంగళవారం రాష్ట్ర కమిటీగా పిలుపుమేరకు కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ గుప్తాను తొలగించాలని కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు కార్యక్రమానికి సిపిఎం సీనియర్ నాయకులు ఆర్ శ్రీనివాసులు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా వారు మాట్లాడుతూ దేశంలోనే అత్యున్నత ప్రజాస్వామిక సంస్థలైన ఎన్నికల కమిషన్ సిబిఐ మరియు ఈ డి సుప్రీంకోర్టు మీడియా లాంటి వ్యవస్థలన్నింటిని ప్రధానిగా నరేంద్ర మోడీ బాధ్యతలు చేపట్టిన తర్వాత తమ జేబు సంస్థలుగా మార్చుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థల లో మతోన్మాద వ్యక్తులను చేర్చి వారికి అనుకూలమైన విధానాలను అమలు చేసుకుంటున్నారని విరుచుకుపడ్డారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడవలసిన చీఫ్ ఎన్నికల అధికారి జ్ఞానేశ్ కుమార్ బిజెపికి ఏజెంట్గా మారి వివిధ రాష్ట్రాలలో సుమారు 13 కోట్ల ఓట్లను తొలగించారని కొన్ని రాష్ట్రాలలో ఈ తతంగం వల్లే బిజెపి అధికారంలోకి వచ్చినట్లు ఆరోపించారు. ఎన్నికల కమిషన్ ఏర్పాటును మార్గదర్శకాలను నిబంధనలను తీసుకురావాలని కేంద్రంలో రాక్షస పాలనను అంతం చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో జరుగుతున్న ఆందోళనలను కవర్ చేసేందుకు వెళ్లిన మహిళా జర్నలిస్టుల పట్ల విద్యార్థుల పట్ల పోలీసులు అవలంబించిన తీరు దారుణమని విమర్శించారు ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కేశవులు గౌడ్ సిపిఎం జిల్లా నాయకులు కందికొండ గీత సిపిఐ నాయకులు శివశంకర్ శ్రీనివాసులు శివుడు లక్ష్మీపతి కృష్ణాజి కిరణ్ కుమార్ రవీందర్ పరిశరామ్ ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు మల్లేష్ ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రేమ్ కుమార్ జిల్లా కార్యదర్శి మధు గౌడ్ శివకృష్ణ నాయకులు యూసుఫ్ రామస్వామి పర్వతాలు రామకృష్ణ రాధాకృష్ణ సిపిఎం నాయకులు రామయ్య ఆంజనేయులు తారా సింగ్ సైదులు అశోక్ శివరాం కురుమయ్య తదితరులు పాల్గొన్నారు

## లబ్ధిదారునికి ఎల్ఓసి పత్రాన్ని అందజేసిన ఆలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు విజయుడు



**జోగులాంబ గద్వాల అక్టోబర్ 6 (స్కై న్యూస్):**జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం వడ్డేపల్లి మండలం లోని కొంకల గ్రామానికి చెందిన కురువ శేఖర్ గారికి అనారోగ్య సమస్య ఉన్నందున మెరుగైన చికిత్స కొరకై 8 లక్షల రూపాయల ఎల్ఓసి పత్రాన్ని లబ్ధిదారునికి అందజేసిన ఆలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు విజయుడు ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు మాణిక్య రెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పేదల ఇంటి నిర్మాణానికి ఉప్పల వెంకటేష్ చేయూత



**ఆమనగల్లు, అక్టోబర్ 6(స్కై న్యూస్):**ఆమనగల్లు: ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ సహకారంతో ఆమనగల్లు మున్సిపాలిటీలోని 15వ వార్డుకు చెందిన సముద్రాల యాదమ్మ, ఏలే లక్ష్మీల నూతన ఇంటి నిర్మాణానికి అవసరమైన సిమెంట్ బస్తాలను మంగళవారం వార్డు కౌన్సిలర్ ఎంగలి భాగ్యమ్మ రఘు అందజేశారు. పేద కుటుంబాలకు అండగా నిలుస్తూ ఇంటి నిర్మాణానికి సహకారం అందించడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు. ఉప్పల వెంకటేష్ అందిస్తున్న సేవలను వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, వార్డు ప్రజలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఏడుపాయల వనదుర్గామాతను దర్శించుకున్న గవర్నర్ పీఆర్వో దశరథం





**పాపన్నపేట/మెదక్,అక్టోబర్ 6 (స్కై న్యూస్ ప్రతినిధి ):** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ ఏడుపాయల వనదుర్గామాత ఆలయాన్ని మంగళవారం గవర్నర్ పీఆర్వో దశరథం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న గవర్నర్ పీఆర్వో దశరథానికి ఆలయ ఈఓ మదం వీరేశం, దేవస్థానం సిబ్బంది, ఆలయ పూజారులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. పూజల అనంతరం ఆలయ అర్చకులు ఆయనకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆలయ విశిష్టత, పూజా కార్యక్రమాల వివరాలను గవర్నర్ పీఆర్వో దశరథానికి వివరించారు. ఆయన ఆలయ పరిసరాలను పరిశీలించి, అమ్మవారిని దర్శించుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి రామచందర్ రాజు, ఏపీఆర్వో బాబు రావు, ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు శ్రీ సరస్వతీ టాలెంట్ హైస్కూల్ విద్యార్థులు..




**జోగులాంబ:** జోగులాంబ గద్వాల్ జిల్లాలో ఈ నెల 4వ తేదీన నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో శ్రీ సరస్వతీ టాలెంట్ హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.పాఠశాల కరస్పాండెంట్ మాకం భీమపల్లి తెలిపిన వివరాల ప్రకారం..9వ తరగతి విద్యార్థి అరవింద్ అండర్-14 విభాగంలో 300 మీటర్ల పరుగు పందెంలో 7వ తరగతి విద్యార్థి రోహిత్ నాయక్ అండర్-12 విభాగంలో 60,200 మీటర్ల పరుగు పందెంలో సేవా నాయక్ అండర్-10 విభాగంలో 60 మీటర్ల పరుగు పందెంలో పాల్గొన్నారు.జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి విజయం సాధించిన ఈ ముగ్గురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 8, 9 తేదీల్లో కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో వారు పాల్గొననున్నారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. వెంకటయ్య గౌడ్,ఇన్‌చార్జి కృష్ణారెడ్డి,పిఇటిలు వేణు,ఆనంద్ విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు.రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు

## హక్కుల పోరాటాలలో నూతన కమిటీల పాత్ర కీలకం...

**జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అరవిందస్వామి**



**నాగర్ కర్నూల్ కల్వకుర్తి అక్టోబర్ 6 (స్కైన్యూస్)** బీసీల ఐక్యత హక్కుల సాధన తోపాటు సంక్షేమ పథకాల అమలులో జాతీయ బీసీ సంక్షేమ సంఘం నూతన కమిటీలు క్రియాశీలక పాత్ర పోషించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అరవిందస్వామి కోరారు మంగళవారం జిల్లాలోని కల్వకుర్తి తాలూకాలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్దయ్య యాదవ్ నాయకత్వంలో వివిధ మండలాల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా ఉమ్మడి పాలమూరు జిల్లాలో నూతన కమిటీలను నియమించే ప్రక్రియలో భాగంగా సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పాత కొత్త నాయకులతో చర్చించి గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు అన్ని కమిటీలను నియమించనున్నట్లు కమిటీల ద్వారా బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలను అధ్యయనం చేసి వాటి పరిష్కారానికి ఉద్యమ కార్యాచరణను రూపొందించడం జరుగుతుందని తెలిపారు. సందర్భంగా పెద్దయ్య యాదవ్ మాట్లాడుతూ ఉమ్మడి పాలమూరు జిల్లాలో బీసీ సంఘాలన్నీ ఐక్యంగా ముందుకు వస్తేనే రాజకీయ పార్టీలు బీసీలకు సముచిత స్థానం కల్పిస్తాయని గుర్తు చేశారు. ఎన్నికలు ఏవైనా బిసి అభ్యర్థులను గెలిపించుకోవాలని రాజకీయాలలో సముచిత స్థానం సాధిస్తేనే ఆత్మగౌరవం సాధ్యమవుతుందని అన్నారు ఈ కార్యక్రమంలో నూతన తాలూకా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు

## గద్వాలలో ఈ నెల 9న కిసాన్ మేళా

**జోగులాంబ గద్వాల, అక్టోబర్ 6(స్కై న్యూస్):**వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికత, నూతన సాగు పద్ధతులు, అధిక దిగుబడి సాధించే మార్గాలపై జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశాల మేరకు రైతులకు అవగాహన కల్పించేందుకు ఈ నెల 9న 'కిసాన్ మేళా' నిర్వహిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ మహా వ్యవసాయ విజ్ఞాన సదస్సును జిల్లా కేంద్రంలోని రూరల్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న కేఎస్ ఫంక్షన్ హాల్ లో నిర్వహిస్తామన్నారు. ఇందులో ఆధునిక వ్యవసాయ పరికరాలు, ఆధునిక సాగు యంత్రాలు, డ్రోన్ టెక్నాలజీపై తెలియజేయడం జరుగుతుందన్నారు. ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులతో ముఖాముఖి చర్చలు, పంటల సాగులో మెలకువలు, తెగుళ్ల నివారణపై సలహాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. నాణ్యమైన హైబ్రిడ్ విత్తనాలు, నూతన ఎరువుల వాడకంపై అవగాహన, రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ రాయితీలు, పథకాల వివరాలు మరియు దరఖాస్తు విధానంపై మార్గదర్శకాలు చేస్తారన్నారు.రైతన్నలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, ఆధునిక వ్యవసాయ పద్ధతులను తెలుసుకుని లాభసాటి వ్యవసాయం వైపు అడుగులు వేయాలని ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పేర్కొన్నారు.

## మంగళికుంట తండాలో ఘనంగా ఉచిత పశు వైద్య శిబిరం



**అమనగల్, అక్టోబర్ 06(స్కై న్యూస్):**కొత్తకుంట తండా గ్రామపంచాయత్ పరిధిలోని మంగళికుంట తండాలో ఉచిత పశు గర్భకోశ వ్యాధి చికిత్సా శిబిరం అత్యంత విజయవంతంగా నిర్వహించబడింది. పశు సంవర్ధక శాఖ మరియు పశు గణాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఈ కార్యక్రమం చేపట్టారు.ఈ శిబిరంలో పాడి పశువులకు సంబంధించి పలు రకాల ఉచిత వైద్య సేవలు అందించారు. ఎదకు వచ్చిన పశువులకు కృత్రిమ గర్భాధారణ చేయడం, ఎదకు రాని పశువులకు ప్రత్యేక చికిత్సలు చేయడం, అలాగే గర్భకోశ వ్యాధుల నివారణకు మందులు అందజేయడం జరిగింది. వీటితో పాటు లేగదూడలు, దుడ్డెలకు నట్టల నివారణ మందులను తాగించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ నేనావత్ పత్య నాయక్ మాట్లాడుతూ.. పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి పశువుల ఆరోగ్యం ఎంతో కీలకమని, ప్రభుత్వం ఉచితంగా కల్పిస్తున్న ఇటువంటి పశు వైద్య శిబిరాలను రైతులందరూ పూర్తిగా వినియోగించుకోవాలని కోరారు. అనంతరం రైతులకు ఉచితంగా ఖనిజ లవణ మిశ్రమ (మినరల్ మిక్చర్) ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ శిబిరంలో అమనగల్ మండల పశు వైద్య అధికారిణి డా. పల్లవి, ఇర్విన్ పశువైద్య అధికారి డా. విజయ్ కుమార్, గోపాలమిత్ర సూపర్వైజర్ లక్ష్మయ్య, గోపాల మిత్రులు ఇ. రమేష్, బి. హరీష్ గౌడ్, గ్రామ పెద్దలు మరియు పరిసర ప్రాంతాల పాడి రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేశారు.

## కలెక్టర్ కు వినతిపత్రం...



**జోగులాంబ గద్వాల, అక్టోబర్ 6 (స్కై న్యూస్):**37వ వార్డ్ దౌదర్పల్లి దర్గా దగ్గర ఉన్న ప్లాట్ ల లబ్ధిదారులకు జరిగిన అన్యాయం పై హైకోర్టు ఇచ్చిన అనుకూలమైన తీర్పు పై వారి తరపున కలెక్టర్ ను కలిసిన నాయకులు దౌదర్పల్లి దర్గా దగ్గర ప్రభుత్వం ఇచ్చిన ప్లాట్ విషయం లో లబ్ధిదారులు హై కోర్ట్ వెళ్లడంతో హై కోర్ట్ లబ్ధిదారులకు 2బి హెచ్ కే కానీ,80 చదరపు గజాల స్థలం కానీ లబ్ధిదారులకు ఇవ్వాలని ఆదేశిస్తూ లబ్ధిదారులతో ప్లాట్ పట్టాను ఒక్కసారి పరిశీలించి ఇవ్వాలని హై కోర్ట్ ఆదేశించింది ఆ తీర్పు కాపీని జిల్లా కలెక్టర్ కు 37 వ వార్డ్ ప్రజల తరపున కౌన్సిలర్ గంగాళం మంజులరాణి, మాజీ కౌన్సిల్లర్ భీం సేన్ రావ్ నాయకులు చిత్తారి కిరణ్ వినతిపత్రం ఇవ్వడం జరిగింది

## 3వ వార్డులో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న వైస్ చైర్ పర్సన్ గీత ఆచారి



**ఆమనగల్లు, అక్టోబర్ 6 (స్కై న్యూస్):** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని నుచ్చుగుట్ట తండా 3వ వార్డులో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్ పర్సన్ శ్రీమతి గీత ఆచారి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి రేషన్ కార్డు అందేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సునీత ప్రశాంత్ నాయక్, పార్లమెంట్ బీజేవైఎం కో-కన్వీనర్ రవి రాథోడ్, సెక్రటరీ సురేందర్, బీఎన్ఓ దశరథ్ నాయక్, రాంపాల్ నాయక్, తార్య నాయక్, సంతోష్, నరేందర్ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని వారు తెలిపారు.

వార్తాతరంగాలు
బుధవారం 07 అక్టోబర్ 2026

# బదిలీ అయిన వైద్య సిబ్బందికి ఆత్మీయ సన్మానం..

### 10--15 ఏళ్లుగా అంకితభావంతో సేవలు.. ఘనంగా వీడ్కోలు



**ఆమనగల్లు, అక్టోబర్ 6(స్కై న్యూస్):**ఆమనగల్లు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ)లో గత 10 నుంచి 15 ఏళ్లుగా అంకితభావంతో, చిత్తశుద్ధితో సేవలందించి ఇటీవల బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లిన వైద్యులు, నర్సింగ్ అధికారులు, వైద్య సిబ్బంది జయశ్రీ, హెప్సీభా, సునీత, అలివేలు తిరుపతిరెడ్డి, చంద్రశేఖర్, నాగేశ్వరి, ఎల్లమ్మ, బన్సిలాల్, విష్ణు, సంపూర్ణ లు మంగళవారం ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బదిలీ అయిన సిబ్బందిని ఘనంగా సన్మానించి షీల్డ్ లు అందజేశారు. విధుల పట్ల సేవానిరతితో పనిచేసి ప్రజలతోపాటు ప్రజాప్రతినిధుల అభిమానం, మన్ననలు పొందిన వారి సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్స్ మైమున బేగం, నాగరాజు, విజయలక్ష్మి మరియు వైద్య ఆరోగ్య శాఖకు చెందిన ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, వైద్యులు, సిబ్బంది పాల్గొని బదిలీ అయిన వైద్య సిబ్బందికి ఆత్మీయ వీడ్కోలు పలికారు.

# ఐడీఓసీలో సమయపాలన పాటించాలి

### కలెక్టర్‌కు లార్డ్స్ ఆర్గనైజేషన్ విజ్ఞప్తి

**జోగులాంబ గద్వాల జిల్లా అక్టోబర్ 5 (స్కైన్యూస్)** ఐడీఓసీలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని లార్డ్స్ ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రెసిడెంట్ డా. బి.ఆర్. అబ్రహం జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. హాజరు నమోదు అనంతరం కొందరు అధికారులు, సిబ్బంది కార్యాలయాల్లో అందుబాటులో ఉండటం లేదని తెలిపారు. ప్రతి ఉద్యోగి ఐడీ కార్డు ధరించేలా ఆదేశాలు ఇవ్వాలని, సింగిల్ ఎంట్రీ--ఎగ్జిట్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు పారదర్శకంగా, జవాబుదారీతనంతో ప్రభుత్వ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# పంటలు ఎండుతుంటే పరాచకాలా..?

### ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి సవాల్



**రంగారెడ్డి జిల్లా అక్టోబర్ 6 (స్కై న్యూస్):** చింతగూడెం గ్రామ శివారులో విద్యుత్ సమస్యతో పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీజేపీ రాష్ట్ర నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి విమర్శించారు. గ్రామంలో ఎండిపోతున్న పంటలను ఆయన పరిశీలించారు. గత వారం రోజులుగా ట్రాన్స్‌ఫార్మర్ పలుమార్లు కాలిపోవడంతో సుమారు 20 ఎకరాలకు సాగునీరు అందడం లేదన్నారు. తరచూ విద్యుత్ అంతరాయాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే విద్యుత్ సమస్యను పరిష్కరించి, ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచాలని డిమాండ్ చేశారు. రైతులకు పంటల బీమా ఎందుకు అమలు చేయడం లేదో ప్రభుత్వం సమాధానం చెప్పాలని విష్ణువర్ధన్ రెడ్డి ప్రశ్నించారు. "చౌరస్తాలో తొడలు కొట్టడం కాదు రైతుల సమస్యలపై సీఎంను నిలదీయాలి" అంటూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై విమర్శలు చేశారు. పంట నష్టపరిహారం, పంటల బీమా, నిరంతర విద్యుత్ అందించాలని కోరారు. వారం నుంచి పది రోజుల్లో చింతగూడెం విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకపోతే రైతులతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఆర్ఎంపీలు పరిధి దాటితే చర్యలు తప్పవు

### షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీలో అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి హెచ్చరిక



**రంగారెడ్డి జిల్లా, అక్టోబర్ 6 (స్కై న్యూస్):** ఆర్ఎంపీలు, పీఎంపీలు తమ పరిధి దాటి తుది వైద్యం, శస్త్రచికిత్సలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి హెచ్చరించారు. మంగళవారం షాద్‌నగర్ 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో వైద్యుల హాజరు, ఓపీ రిజిస్టర్, ఇన్‌పేషెంట్ వార్డులు, ఆపరేషన్ థియేటర్, రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఆర్ఎంపీలు, పీఎంపీలు ప్రాథమిక, ప్రథమ చికిత్స వరకు మాత్రమే సేవలు అందించాలని, తుది వైద్యం అర్హత కలిగిన వైద్యులే అందించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి ఆపరేషన్లు నిర్వహించినట్లు తేలితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆసుపత్రి నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని సూచించారు. జనరిక్ ఔషధ కేంద్రాన్ని తనిఖీ చేసి మందుల లభ్యత, విక్రయాలు, నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు.తదుపరి బాలికల పాఠశాలను సందర్శించిన డాక్టర్ కిరణ్మయి విద్యార్థులతో మాట్లాడి ఉన్నత లక్ష్యాలతో చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి కార్యనిర్వహణాధికారి డా. విష్ణువర్ధన్, తహసీల్దార్ నాగయ్య, మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా మొయినుద్దీన్

### నియామక ఉత్తర్వులు జారీ చేసిన కల్వకుంట్ల కవిత



**రంగారెడ్డి జిల్లా అక్టోబర్ 6 (స్కై న్యూస్):** తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా ఎండీ మొయినుద్దీన్ నియమితులయ్యారు. సంస్థ ఫౌండర్ చైర్‌పర్సన్ కల్వకుంట్ల కవిత నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని జాగృతి కార్యాలయంలో కవితను మొయినుద్దీన్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన కవితకు, రాష్ట్ర అధ్యక్షురాలు మాధవికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, బతుకమ్మ విశిష్టతను ప్రపంచానికి చాటిచెప్పేందుకు జాగృతి ఆశయాల మేరకు జిల్లాలో బాధ్యతాయుతంగా పనిచేస్తానని మొయినుద్దీన్ తెలిపారు.

## అష్టాదశ శక్తిపీఠాలలో ఐదవ శక్తిపీఠమైన జోగులాంబ సన్నిధిలో

# దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

### భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలి

### అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఉత్సవాలను విజయవంతం చేయాలి:జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**జోగులాంబ గద్వాల, అక్టోబర్ 6 (స్కై న్యూస్):**దసరా శరన్నవరాత్రి మహోత్సవాలను జోగులాంబ సన్నిధిలో ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు.మంగళవారం ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,ఈ నెల 11 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేసి,భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఘనంగా నిర్వహించాలన్నారు.దేవాలయం లోపల భక్తులకు దర్శనం,ప్రసాదం, త్రాగునీరు, మరుగుదొడ్లు తదితర ప్రాంతాలకు సులభంగా చేరుకునేలా స్పష్టమైన దిశా సూచికలు ఏర్పాటు చేయాలని సూచించారు.దైవదర్శనానికి వచ్చే విఐపిల ప్రోటోకాల్ విషయంలో సమస్యలు రాకుండా పూర్తి జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేసి,అక్కడి నుంచి దేవస్థానం వరకు షటిల్ వాహనాలు ఏర్పాటు చేయాలని సూచించారు.అత్యవసర సహాయం కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, ప్రత్యేక సిబ్బందిని నియమించి,ఫోన్ నంబర్‌కు విస్తృత ప్రచారం కల్పించాలని ఆదేశించారు.అదనపు ప్రసాదం కౌంటర్లు ఏర్పాటు చేసి,భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. వేడుకలకు వచ్చే భక్తులకు త్రాగు నీటిని మిషన్ భగీరథ అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు.పారిశుద్ధ్య పనులను పకడ్బందీగా చేపట్టి దేవాలయ ప్రాంగణాన్ని, ఘాట్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మునిసిపల్ అధికారులను ఆదేశించారు. అత్యవసర సమయాలలో వైద్య సేవలు అందించే విధంగా మెడికల్ క్యాంపు,ఒక అంబులెన్స్‌ను ఏర్పాటు చేయాలని,విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా నిరంతర విద్యుత్తు సరఫరాకు చర్యలు చేపట్టాలని సూచించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా, వాహనాల రద్దీని నియంత్రించేందుకు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు.అలంపూర్ వరకు ఆర్టీసీ బస్సు సర్వీసులు,అలంపూర్ నుంచి దేవస్థానం వరకు ప్రత్యేక షటిల్ సర్వీసులు పెంచాలని ఆర్టీసీ డీఎంను ఆదేశించారు.ఘాట్ వద్ద భక్తుల భద్రత కోసం ఈతగాళ్లను, లైఫ్ జాకెట్లను అందుబాటులో ఉంచాలని మత్స్యశాఖ అధికారిణిని ఆదేశించారు.భక్తుల సౌకర్యార్థం ఫుడ్ స్టాళ్లను అనువైన ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలన్నారు. తెప్పోత్సవ పడవలను ఇరిగేషన్ అధికారులు తనిఖీ చేసి,ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఉన్న పడవలనే వినియోగించేలా చూడాలని సూచించారు.దేవాలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు.అగ్ని ప్రమాదాల నివారణకు ఫైర్ ఇంజిన్‌ను సిద్ధంగా అందుబాటులో ఉంచాలని అగ్నిమాపక అధికారిని ఆదేశించారు.అలంపూర్ ఆలయాల చరిత్ర,జోగులాంబ అమ్మవారి విశిష్టతను తెలియజేసే సౌండ్ అండ్ లైట్స్ షోతో పాటు దసరా ఉత్సవాలపై సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు.గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులందరూ సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధు మోహన్,అదనపు ఎస్పీ శంకర్,దేవాలయ శాఖ ఈఓ దీప్తి,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సుజాతనగర్ కేంద్రంలో రూ.10 కోట్లతో

# కళాశాల, పబ్లిక్ స్కూల్

### కొత్తగూడెం కార్పొరేషన్ రూపురేఖలు మారుస్తా

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

### రూ.5.33కోట్లతో 37 అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

### సుజాతనగర్ పట్టణంలో అభివృద్ధి పనుల సందడి





**కొత్తగూడెం అక్టోబర్6( స్కై న్యూస్):** సుజాతనగర్ కేంద్రంలో రూ.10 కోట్ల వ్యయంతో త్వరలోనే ప్రభుత్వ జూనియర్ కళాశాల, తెలంగాణ పబ్లిక్ స్కూల్ భవనాల నిర్మాణాలు చేపట్టబోతున్నామని, ఈ ప్రాంత ప్రజలు, విద్యార్థుల చిరకాల ఆకాంక్షను నెరవేర్చడాన్ని గర్వంగా భావిస్తున్నానని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సుజాతనగర్ పట్టణం కోమటిపల్లి, నిమ్మలగూడెం, నాయకులగూడెం, దేగలమడుగు, లెనిన్ నగర్, లక్ష్మీదేవిపల్లి, మంగపేట, సుజాతనగర్, నర్సింహసాగర్ పరిధిలోని 20, 21, 23 డివిజన్లలో మొత్తం రూ.5.33 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న రోడ్లు, డ్రైన్లు, పార్కులు, ఇతర 37 అభివృద్ధి పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపనలు చేశారు. ఇందులో భాగంగా 20వ డివిజన్‌లో రూ.1.99 కోట్లతో 16 పనులకు, 21వ డివిజన్‌లో రూ.1.43 కోట్లతో 9 పనులకు, 23వ డివిజన్‌లో రూ.1.91 కోట్లతో చేపట్టనున్న 12 అభివృద్ధి పనులకు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో జరిగిన సభల్లో ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ. డివిజన్లలో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించి దశలవారీగా ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నామని, తద్వారా కొత్తగూడెం కార్పొరేషన్ రూపురేఖలు మారుస్తానని స్పష్టం చేశారు. పట్టణ పరిధిలోని కాలనీల్లో నెలకొన్న రహదారులు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించి పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనుల నిర్మాణాల్లో ఎలాంటి నాణ్యతా లోపాలు లేకుండా అధికారులు పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. కేటాయించిన ప్రజాధనం సద్వినియోగమయ్యేలా చూస్తూ, నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా నిర్మాణాలను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. కార్యక్రమాల్లో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, నగర మేయర్ మూడ్ గణేష్, డిప్యూటీ మేయర్ లలిత, కాంగ్రెస్ నాయకులు నాగా సీతారాములు, మండే హనుమంతరావు, కమిషనర్ సుజాత, తాసిల్దార్ కృష్ణ ప్రసాద్, ఎస్ హెచ్ ఓ కళ్యాణి, కార్పొరేషన్ మేనేజర్ సత్యనారాయణ, డీఈ నరేష్, ఏఈ శ్రీకాంత్, హౌసింగ్ ఏఈ అర్పిత, విద్యుత్ ఏఈ కిషన్, వార్డు ఆఫీసర్లు రవికుమార్ విజయలక్ష్మి, మల్లిక, కృష్ణకుమారి, కార్పొరేటర్లు అనిత, శ్రావణి, స్థానిక నాయకులు భూక్య దస్రు, వాసిరెడ్డి మురళి, కొమారి హన్మంతరావు, జక్కుల రాములు, ఈర్ల మల్లేష్, తాళ్లూరి పాపారావు, బొడ్డు కేశవరావు, కొమారి కృష్ణ, భాగం కృష్ణ, బానోత్ వెంకట్, మంగ్య, చందర్, హత్తిరామ్, కున్సోత్ శంకర్, భీమా, గుగులోత్ రవి, బండి రమేష్, దండు సురేష్, గడ్డం రాజేందర్, లావుడియా గోపి తదితరులు పాల్గొన్నారు.

# పల్లెపల్లెకు ఆర్టీసీ ప్రయాణ సేవలను విస్తరిస్తాం

### ప్రజారవాణా ఆర్టీసీని ప్రజలు ఆదరించాలి

### కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు






**పాల్వంచ అక్టోబర్ 6 (స్కై న్యూస్ ):** ప్రతి పల్లెకు ప్రజారవాణా ఆర్టీసీ ప్రయాణ సేవలను అందుబాటులోకి తీసుకువస్తాం అని కొత్తగూడెం శాసనసభసభ్యులు కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. మంగళవారంమండల పరిధిలోని నారాయణరావుపేట గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన పాల్వంచ-దంతలబోర ఆర్టీసీ బస్ సర్వీసులును లాంఛనంగా ప్రారంభించనున్నారు. తొలుత జండా ఊపి బస్ సర్వీసును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ మారుమూల గ్రామాల ప్రధాన రోడ్ల సమస్యను పరిష్కరించామని అతి త్వరలో అంతర్గత రోడ్లు పనులు కూడా పూర్తి చేస్తామని తెలిపారు.ప్రజారవాణా ఆర్టీసీని ప్రజలు ఆదరించాలని, ఆర్టీసీ బస్సులు సురక్షితంగా ప్రయాణించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా కాంగ్రెస్ నాయకులు నాగసీతారాములు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీసంశెట్టి పూర్ణచంద్రరావు ఉప్పుశెట్టి రాహుల్, సంఘము సర్పంచ్, బానోతు రవి, నారాయణరావుపేట సర్పంచ్ బండి సరస్వతి, దంతలబోర్ సర్పంచ్, నాయకులు బానోతు రంజిత్, ప్రేమచంద్, ప్రశాంత్, సాయిలి శ్రీను, ఎష్ట్ర.శ్రీను, సాయిలి ఎంకన్న, వెల్లంకి శివరావు, సత్యనారాయణ రాజు, మేక రాంబాబు, గ్రామ పెద్దలు, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పేద కుటుంబాలకు అండగా

# లయన్స్ క్లబ్‌ల మానవతా సేవ...




**రంగారెడ్డి జిల్లా, అక్టోబర్ 6 (స్కై న్యూస్):** సమాజ సేవలో భాగంగా లయన్స్ క్లబ్ షాద్‌నగర్, లయన్స్ క్లబ్ బేర సంయుక్త ఆధ్వర్యంలో షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి మార్చురీ ఫ్రీజర్‌ను విరాళంగా అందజేశారు. మృతదేహాలను సురక్షితంగా భద్రపరిచేందుకు అవసరమైన పరికరాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి అందించడం ద్వారా లయన్స్ క్లబ్‌లు మానవతా సేవకు మరో అడుగు వేశాయి. మంగళవారం ఆసుపత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ డా. కొప్పిశెట్టి కిరణ్మయి చేతుల మీదుగా మార్చురీ ఫ్రీజర్‌ను ఆసుపత్రి అధికారులకు అందించారు. కుటుంబ సభ్యులు దూర ప్రాంతాల్లో ఉండటం, అంత్యక్రియలకు ఆలస్యం కావడం వంటి పరిస్థితుల్లో మృతదేహాలను తాత్కాలికంగా భద్రపరచేందుకు ఈ ఫ్రీజర్ ఎంతో ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు. ముఖ్యంగా పేద, నిరుపేద కుటుంబాలకు ఇది ఆర్థిక భారం తగ్గించడంతో పాటు అవసర సమయంలో ఎంతో తోడ్పాటునందిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి అవసరమైన పరికరాన్ని సమకూర్చిన లయన్స్ క్లబ్‌ల సేవా కార్యక్రమాన్ని అధికారులు అభినందించారు. ప్రజల అవసరాలను గుర్తించి ఆరోగ్య రంగానికి మరింత సేవలు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు కమ్మదనం సుధాకర్, రెడ్యా నాయక్, శరత్ చంద్రబాబు, శాంతిలాల్ పటేల్, కమ్మదనం సందీప్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. విష్ణువర్ధన్, డీఎంహెచ్ఓ డా. విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

## శాతవాహనలో ఆదాయపు పన్ను రిటర్న్స్, జీఎస్టీ ఫైలింగ్‌పై

# రెండు రోజుల కార్యశాల...

**"ప్రతి పౌరుడికి ఆదాయపు పన్ను, జీఎస్టీపై అవగాహన అవసరం -- ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్"**

**"పన్నులపై అవగాహనతోనే దేశ ఆర్థికాభివృద్ధి సాధ్యం- ఆచార్య కృష్ణ చైతన్య"**

**కరీంనగర్ అక్టోబర్ 06 (స్కై న్యూస్):**శాతవాహన విశ్వవిద్యాలయ వాణిజ్యశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అకడమిక్ ఎంపవర్‌మెంట్ ప్రోగ్రామ్ -- 100 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా "ఆదాయపు పన్ను రిటర్న్స్ జీఎస్టీ ఫైలింగ్‌పై రెండు రోజుల ప్రాక్టికల్ స్కిల్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్" కు అధ్యక్షత వహించిన కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.వి. శ్రీరంగ ప్రసాద్ మాట్లాడుతూ, తరగతి గదిలో నేర్చుకున్న అంశాలను వాస్తవ జీవితంలో అన్వయించుకునే సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ఈ ప్రాక్టికల్ వర్క్‌షాప్‌లు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉపకులపతి ఆచార్య యు. ఉమేష్ కుమార్ మాట్లాడుతూ, దేశ నిర్మాణంలో ప్రతి పౌరుడు వివిధ పన్నుల ద్వారా భాగస్వామి అవుతున్నారని తెలిపారు. ఆదాయపు పన్నుతో పాటు వివిధ రకాల ప్రత్యక్ష, పరోక్ష పన్నులపై ప్రతి ఒక్కరూ కనీస అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పన్నులు చెల్లించడం కేవలం చట్టపరమైన బాధ్యత మాత్రమే కాకుండా దేశాభివృద్ధికి అందించే సహకారమని పేర్కొన్నారు. ముఖ్యంగా వాణిజ్యశాస్త్ర విద్యార్థులు పన్నుల వ్యవస్థ, పన్ను చట్టాలు, రిటర్నుల దాఖలు వంటి అంశాలపై ఆచరణాత్మక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. విశిష్ట అతిథిగా హాజరైన విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య పి. సతీష్ కుమార్ మాట్లాడుతూ, వస్తు సేవల పన్ను నిత్యజీవితంలో అంతర్భాగమైందని వివరించారు. ప్రతి కుటుంబం నిత్యావసర వస్తువులు, గృహోపకరణాలు, ఇతర ఉత్పత్తులు కొనుగోలు చేయడం ద్వారా జీఎస్టీ వ్యవస్థతో సంబంధం కలిగి ఉంటుందని తెలిపారు. మనం కొనుగోలు చేసే వస్తువుల ధరల్లో పన్నుల ప్రభావం ఉంటుందని, అందువల్ల సామాన్య ప్రజలు సైతం అవగాహన



పెంపొందించుకోవాలని సూచిస్తూ పన్నులపై అవగాహనతో ఆర్థిక క్రమశిక్షణకు, బాధ్యతాయుతమైన వినియోగదారులుగా మారడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. కీలకోపన్యాసకులుగా పాల్గొన్న ఉస్మానియా వాణిజ్యశాస్త్ర విభాగాధిపతి ఆచార్య కె. కృష్ణ చైతన్య మాట్లాడుతూ, వాణిజ్యం లేని సమాజాన్ని ఊహించలేమని, మానవ జీవితంలో ప్రతి రోజూ అనేక కార్యకలాపాలు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా వాణిజ్యంతో ముడిపడి ఉంటాయని వివరించారు. వస్తువుల కొనుగోలు, విక్రయాలు, బ్యాంకింగ్, డిజిటల్ చెల్లింపులు, పెట్టుబడులు, వ్యాపార లావాదేవీలు వంటి అంశాలు వాణిజ్యశాస్త్ర ప్రాధాన్యాన్ని తెలియజేస్తాయన్నారు. ప్రస్తుత కాలంలో వాణిజ్యశాస్త్రానికి విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని, ముఖ్యంగా ఆదాయపు పన్ను, జీఎస్టీ, అకౌంటింగ్, ఆడిటింగ్, టాక్స్ కన్సల్టెన్సీ, ఫైనాన్షియల్ సర్వీసెస్ వంటి రంగాల్లో విద్యార్థులకు అనేక ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు సైద్ధాంతిక పరిజ్ఞానంతో పాటు ప్రాక్టికల్ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటే వృత్తిపరంగా ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని సూచించారు.




గౌరవ అతిథిగా పాల్గొన్న చార్టర్డ్ అకౌంటెంట్ సీఏ డి. నిరంజన చారి మాట్లాడుతూ, వ్యక్తులు, వ్యాపార సంస్థలు ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేయడంలో, జీఎస్టీ నమోదు, రిటర్నుల సమర్పణ, పన్నుల గణన, చట్టపరమైన నిబంధనల అమలులో చార్టర్డ్ అకౌంటెంట్లు కీలక పాత్ర పోషిస్తారని వివరించారు. ఆదాయపు పన్ను రిటర్న్ అంటే ఏమిటి, ఎవరు దాఖలు చేయాలి, ఆదాయ వివరాలు, పాన్ కార్డు, ఫారం-16 తదితర పత్రాల ప్రాముఖ్యత వంటి ప్రాథమిక అంశాలపై అవగాహన కల్పించారు. వర్క్‌షాప్ కన్వీనర్, వాణిజ్యశాస్త్ర విభాగాధిపతి, ఉపకులపతి ఓఎస్డీ డాక్టర్ డి. హరికాంత్ మాట్లాడుతూ, విద్యార్థులకు ఆదాయపు పన్ను, జీఎస్టీకి సంబంధించిన ప్రాథమిక అంశాలతో పాటు రిటర్నులను స్వయంగా దాఖలు చేసే విధానంపై ఆచరణాత్మక శిక్షణ అందించడమే ఈ రెండు రోజుల వర్క్‌షాప్ ప్రధాన లక్ష్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో వర్క్‌షాప్ కో-కన్వీనర్లు డాక్టర్ కె. తిరుపతి, డాక్టర్ బి. నరేష్, డాక్టర్ బి. పరశురాములు, వాణిజ్యశాస్త్ర విభాగ అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, వివిధ కళాశాలల విద్యార్థులు, విశ్వవిద్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ పనులను

# వేగవంతం చేయాలి

**షాద్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధి సమీక్షలో అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి**



**రంగారెడ్డి జిల్లా అక్టోబర్ 6 (స్కై న్యూస్):** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి, ప్రజలకు ప్రభుత్వ సేవలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి అధికారులను ఆదేశించారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని రెడ్ రోజ్ గార్డెన్‌లో షాద్‌నగర్ నియోజకవర్గ స్థాయి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. జలసిరి, వ్యవసాయ కుంటలు, ఇంకుడు గుంతలు, బోర్‌వెల్ రీఛార్జ్ పనులతో భూగర్భ జలాలను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఘన వ్యర్థాల నిర్వహణ, తడి-పొడి చెత్త వేరు చేయడం, కంపోస్ట్ తయారీపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.గ్రామపంచాయతీల్లో రికార్డుల నిర్వహణ, ఆస్తిపన్నుల వసూళ్లు, నర్సరీలు, వనమహోత్సవం, పంచాయతీ భవనాల నిర్మాణం తదితర అంశాలపై సమీక్షించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, డీపీఓ సురేష్ మోహన్, డీఆర్‌డీఓ శ్రీలతతో పాటు ఆయా మండలాల అధికారులు పాల్గొన్నారు.

## అమ్రాబాద్ గర్ల్ హై స్కూల్ కు

# మంచినీళ్ల ట్యాంక్ విరాళం



**అమరాబాద్ స్కై న్యూస్ అక్టోబర్ 6** ఇంటర్నేషనల్ వాసవి క్లబ్ గవర్నర్ శ్రీ కలిమి చెర్ల భాస్కర్ విరాళంగా అందజేశారు వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సేవలు గురించి మాట్లాడుతూ 40 విగ్రహాలను రాష్ట్రంలో విరాళంగా ఇచ్చినట్లు అలాగే 30 స్కూళ్లకు వాటర్ ట్యాంకులు ఇచ్చినట్లు పేదవారికి దుప్పట్లు బియ్యం కూడా పంచినట్లు ఆయన తెలిపారు ఈమధ్య కాలంలోనే కల్వకుర్తి ఏరియాలో గుడులకు నైవేద్యం ఎక్కించుకునేటప్పుడు ఎలక్ట్రానికల్ నగర అంటే గంట 15000 విలువైన గంట నాదం చేసే ఎలక్ట్రానిక్ పరికరాన్ని విరాళంగా ఇచ్చినట్లు ఈరోజు అమరాబాదులో అమరేశ్వర ఆలయంలో పూజలు చేసి స్కూల్లో నోట్ బుక్స్ లు మరియు వాటర్ ట్యాంక్ మరియు మామిడి జమ చెట్లను స్కూల్ ఆవరణలో స్వయంగా నాటారు ఎక్కడ పేదలకు ఆపద ఉన్న ఇంటర్నేషనల్ వాసవి క్లబ్ ను ఆశ్రయిస్తే ఆదుకుంటామని క్లబ్ గవర్నర్ కలికిచర్ల రమేష్ తెలిపారు ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అమరాబాద్ మండల ప్రెసిడెంట్ కామిశెట్టి శ్రీనివాసులు పాపిశెట్టి శ్యాంసుందర్ భాగ్యలక్ష్మి సంబు వెంకటరమణ శోభ సత్యనారాయణ పద్మ గీత ముఖ్య అతిథులుగా ఉమామహేశ్వర దేవస్థానం సంబు శోభ మాలేశంకరయ్య దంపతులు ఇంకా అల్లాజీ దంపతులు సంబుశేఖర్ దంపతులు నరసింహ కాదా శ్రీనివాస్ లీలా హిమావతి సురేష్ కుమార్ సురేష్ వాసవి క్లబ్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు

# 'ఎస్ ఐ ఆర్' ప్రక్రియను వెంటనే ఆపాలి

**షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ డిమాండ్**

**కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ ఆందోళన..**

**అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం**

**రంగారెడ్డి జిల్లా, అక్టోబర్ 6 (స్కై న్యూస్):** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని, ఎస్ ఐ ఆర్ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ డిమాండ్ చేశారు. టీపీసీసీ పిలుపుమేరకు రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట డీసీసీ అధ్యక్షురాలు పారిజాత ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ధర్నాలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ ఆందోళన కార్యక్రమానికి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, డీసీసీ అధ్యక్షురాలు పారిజాత, మాజీ కార్పొరేషన్ చైర్మన్, సీపీఐ, సీపీఎం నాయకులు పర్వతాలు తదితరులతో పాటు జిల్లాలోని వివిధ నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో



తరలివచ్చారు. ఈ సందర్భంగా వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ఎస్ ఐ ఆర్ ప్రక్రియ పేరుతో రాష్ట్రవ్యాప్తంగా 90 లక్షల ఓట్లు గల్లంతయ్యే పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఎస్ ఐ ఆర్ పేరుతో లక్షలాది ఓట్లను తొలగించారని ఆయన పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ఎన్నికల సంఘాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా తమ చెప్పుచేతల్లో పెట్టుకున్నారని శంకర్ ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ఉన్న ఎన్నికల వ్యవస్థపై రాజకీయ ప్రభావం ఉండకూడదని అన్నారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్నాయని, ప్రజల నిరసన హక్కులను కూడా కాలరాస్తున్నారని ఆరోపించారు. త్వరలో కేంద్ర ఎన్నికల సంఘం తీరుకు వ్యతిరేకంగా ఇండియా కూటమి ఎంపీల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు శంకర్ తెలిపారు. ఓటర్ల జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియను వెంటనే నిలిపివేసి, అర్హులైన ఓటర్ల హక్కులను కాపాడాలని వినతిపత్రంలో కోరారు.

## పథకాలు ఆగవు.. ప్రత్యర్థుల ఆటలు సాగవు

**కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



**రంగారెడ్డి జిల్లా అక్టోబర్ 6 (స్కై న్యూస్):** ప్రత్యర్థులు ఎన్ని కుట్రలు చేసినా నిరుపేదల ప్రయోజనాల కోసం చేపట్టిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగదని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. షాద్ నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 47 మంది లబ్ధిదారులకు ఆయన కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. నందిగామ మండలం నుంచి 27 మంది , కొత్తూరు మండలం నుంచి 13 మంది జిల్లేడు చౌదరిగుడా మండలం నుంచి ఏడు మంది లబ్ధిదారులు ఈ చెక్కులను అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆడపడుచుల వివాహాల కోసం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ పథకానికి సంబంధించి ప్రతిపక్షాలు కుట్రలు పని పథకం ఆగిపోయేందుకు ప్రయత్నించారని, కానీ ప్రభుత్వం అడ్డంకులను అధిగమించి ఈ పథకాన్ని కొనసాగిస్తుందని వెల్లడించారు. నిరుపేదలకు ప్రయోజనాలు చేకూర్చే పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నంతకాలం ఎవరూ అడ్డుకోలేరని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

## ఎస్ ఐ ఆర్ అన్యాయానికి నైతిక బాధ్యత వహించి సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి

**- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**




**ఆమనగల్లు,అక్టోబర్ 06 (స్కై న్యూస్):**ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో జరుగుతున్న అన్యాయానికి నైతిక బాధ్యత వహిస్తూ సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి డిమాండ్ చేశారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కలెక్టరేట్ ఎదుట అఖిలపక్షం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన నియోజకవర్గ నాయకులతో కలిసి పాల్గొన్నారు. అర్హులైన వారికి ఓటరు జాబితాలో అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలని, ఓటర్ల హక్కులను కాపాడాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

# కరీంనగర్‌లో మొట్టమొదటి ఇండోర్ 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం టెక్నికల్ చార్జ్ కేంద్రం

**పట్టణాల్లో విద్యుత్ అంతరాయాలకు అడ్డుకట్ట**

**రూ.6.92 కోట్లతో తెలంగాణ చౌక్‌లో ఆధునిక సబ్‌స్టేషన్ నిర్మాణం : సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి**

**కరీంనగర్ అక్టోబర్06 ( స్కై న్యూస్)**పట్టణ ప్రాంతాల్లో తీవ్రంగా ఉన్న స్థలాభావం (భూసౌకర్యాల కొరత) సమస్యను అధిగమిస్తూ, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడంలో ఇండోర్ సబ్‌స్టేషన్లు ఎంతగానో దోహదపడతాయని టీజీ ఎన్‌పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి స్పష్టం చేశారు. కరీంనగర్ పట్టణంలో విద్యుత్ మౌలిక వసతులను మరింత బలోపేతం చేస్తూ తెలంగాణ చౌక్‌లో నిర్మించిన 33/11 కేవీ ఇండోర్ విద్యుత్ ఉపకేంద్రాన్ని సీఎండీ కర్ణాటి వరుణ్ రెడ్డి మంగళవారం టెక్నికల్ ఛార్జ్ చేశారు. టీజీఎన్‌పీడీసీఎల్ పరిధిలో కరీంనగర్‌లో నిర్మించిన తొలి ఇండోర్ సబ్‌స్టేషన్ ఇదే కావడం విశేషం అన్నారు .ఈ సందర్భంగా సీఎండీ శ్రీ కర్ణాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ఆధునిక సాంకేతికతతో నిర్మించిన ఇండోర్ సబ్‌స్టేషన్‌ల ద్వారా తక్కువ స్థలంలో అధిక సామర్థ్యంతో విద్యుత్ సరఫరా వ్యవస్థను అభివృద్ధి చేయడంతో పాటు, వినియోగదారులకు మరింత నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించడమే సంస్థ లక్ష్యమని పేర్కొన్నారు. కరీంనగర్ పట్టణ అభివృద్ధి, పెరుగుతున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరొక ఇండోర్ సబ్ స్టేషన్ కూడా కలెక్టరేట్ లో రాబోతుందని అన్నారు. భవిష్యత్ డిమాండ్‌కు సరిపడేలా ఇండోర్ సబ్‌స్టేషన్ సామర్థ్యం, ఫీడర్ల విస్తరణకు అవసరమైన ఏర్పాట్లు ముందుగానే ఏర్పాటు చేయడం జరిగిందని సీఎండీ తెలిపారు.కేవలం 484 చదరపు గజాల విస్తీర్ణంలో రూ.6.92 కోట్ల వ్యయంతో ఈ ఆధునిక ఇండోర్ విద్యుత్ ఉపకేంద్రాన్ని నిర్మించామని , గ్రౌండ్ ఫ్లోర్‌లో కంట్రోల్ రూమ్‌తో పాటు ఆధునిక స్విచ్‌గేర్ ప్యానెళ్లను ఏర్పాటు చేయగా, మొదటి అంతస్తులో సబ్‌డివిజన్, సెక్షన్ కార్యాలయాలను ఏర్పాటు చేశామని వివారించారు. ఈ ఉపకేంద్రానికి 132 కేవీ వావిలాలపల్లి, పద్మనగర్ ఉపకేంద్రాల నుంచి 33 కేవీ విద్యుత్ సరఫరా అందుబాటులో ఉందని , అదనంగా మరో 33 కేవీ ఫీడర్‌ను ఇతర ఉపకేంద్రాలకు భవిష్యత్‌లో విస్తరించేందుకు సిద్ధంగా ఉంచామని చెప్పారు. ప్రారంభ దశలో ఆరు 11 కేవీ ఫీడర్ల



ద్వారా విద్యుత్ సరఫరా చేయనుండగా, భవిష్యత్ అవసరాల కోసం మరో రెండు 11 కేవీ ఫీడర్ల ఏర్పాటుకు సైతం అవకాశం కల్పించామన్నారు.ఈ ఇండోర్ సబ్‌స్టేషన్ అందుబాటులోకి రావడంతో కరీంనగర్ పట్టణంలోని 33/11 కేవీ ఎస్‌ఆర్‌ఆర్, భగత్‌నగర్, సప్తగిరి సబ్‌స్టేషన్లపై ఉన్న విద్యుత్ భారాన్ని తగ్గించడంతో పాటు పట్టణంలో విద్యుత్ సరఫరా సామర్థ్యం మరింత మెరుగుపడనుందన్నారు. ఈ సబ్‌స్టేషన్‌లో రెండు 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఎస్టర్ ఆయిల్ టెక్నాలజీతో ఏర్పాటు చేశామని, ఎస్టర్ ఆయిల్‌కు అధిక ఫ్లాష్ పాయింట్ ఉండటంతో అగ్ని ప్రమాదాల నియంత్రణలో మెరుగైన భద్రతను అందిస్తుందన్నారు. తేమను తట్టుకునే సామర్థ్యం అధికంగా ఉండటంతో ట్రాన్స్‌ఫార్మర్ ఇన్సులేషన్ జీవితకాలం పెరగడంతో పాటు అధిక ఉష్ణోగ్రతలు, అధిక లోడ్లను మరింత సమర్థవంతంగా నిర్వహించగలదని చెప్పారు. ఈ ఫలితంగా నిర్వహణ అవసరాలు, దీర్ఘకాలిక నిర్వహణ వ్యయం తగ్గే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు.సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ ప్యానెళ్లలో ూజూణూ సదుపాయం, ×జుణ రిలేలు, అధునాతన =ుఖ వ్యవస్థలను ఏర్పాటు చేశామని, వీటిని టీజీఎన్‌పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలోని కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం చేశామని పేర్కొన్నారు. దీంతో సబ్‌స్టేషన్‌ను రిమోట్‌గా పర్యవేక్షించడం జరుగుతుందని అవసరమైన నియంత్రణ చర్యలు చేపట్టడం సాధ్యమవుతుందన్నారు. ఆధునిక సాంకేతికతను వినియోగించడం ద్వారా విద్యుత్ సరఫరాలో అంతరాయాలను వేగంగా గుర్తించి, పునరుద్ధరణ చర్యలను మరింత సమర్థవంతంగా చేపట్టేందుకు అవకాశం ఏర్పడుతుందని వివరించారు.టిజి ఎన్పీడీసీఎల్ పరిధిలో నిజామాబాద్ సర్కిల్ లో పులాంగ్ రైతుబజార్ ఇండోర్ సబ్‌స్టేషన్‌కు సంబంధించి జీం1 కంట్రోల్ రూమ్ స్లాబ్ పనులు పూర్తయ్యాయని తెలిపారు. అలాగే హనుమకొండ సర్కిల్ పరిధిలో వైకుంఠధామం వద్ద సబ్‌స్టేషన్ పిల్లర్ల నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయని వివరించారు. దీనితోపాటు గర్ల్స్ హైస్కూల్ ఇండోర్ సబ్‌స్టేషన్‌కు సంబంధించి భూసేకరణ ప్రక్రియ పూర్తయి, పనులు కొనసాగుతున్నాయన్నారు.కామారెడ్డి సర్కిల్ పరిధిలో కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం , ఖమ్మం సర్కిల్ పరిధిలో ఖమ్మం బస్ స్టాండ్ ప్రాంతాల్లో ఇండోర్ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి సంబంధించి ప్రస్తుతం టెండర్ ప్రక్రియ పూర్తయి పనులు చురుకుగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యుత్ నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడంలో ఇండోర్ సబ్‌స్టేషన్ లు కీలక పాత్ర పోషిస్తాయని , ఆధునిక సాంకేతికతతో నిర్మిస్తున్న ఈ ఇండోర్ సబ్‌స్టేషన్ల ద్వారా పట్టణ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయాలను గణనీయంగా తగ్గుతాయని సీఎండీ వరుణ్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు వి . మోహన్ రావు , టి . మధుసూదన్ , సి.ఈ లు కె .తిరుమల్ రావు , సురేందర్ , అన్నపూర్ణ , కరీంగర్ ఎస్ఈ విజేందర్ రెడ్డి , డి.ఈ లు ఏడీలు తదితరులు పాల్గొన్నారు .

# ప్రభుత్వ పథకాలను సమర్థంగా అమలు చేయాలి: ఎంపీ డీకే అరుణ

**దిశ కమిటీ సమావేశంలో శాఖల వారీగా పథకాలు, అభివృద్ధి పనులపై సమీక్ష**

**అమృత్ పథకం పనులు మున్సిపాలిటీ పనులు డిసెంబర్‌లోగా పూర్తి చేయాలి**

**మహబూబ్ నగర్, అక్టోబర్ 6(స్కైన్యూస్ ):**కేంద్ర ప్రభుత్వ నిధులతో అమలు చేస్తున్న కేంద్ర పథకాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలు చేసి, అర్హులైన లబ్ధిదారులకు ప్రయోజనం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆమె అధ్యక్షతన జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వ్యవసాయం, ఉద్యానవన, వైద్య ఆరోగ్యం, విద్య, మార్కెటింగ్, పంచాయతీరాజ్, మున్సిపల్, ఆర్అండ్‌బీ, విద్యుత్, క్రీడలు, యువజన సర్వీసులు తదితర శాఖల ఆధ్వర్యంలో అమలవుతున్న పథకాలు, చేపడుతున్న అభివృద్ధి పనుల ప్రగతిని శాఖల వారీగా సమీక్షించారు. పథకాల అమలు, పనుల పురోగతి, లబ్ధిదారులకు అందుతున్న ప్రయోజనాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.సమావేశంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.ప్రతి నియోజకవర్గంలో ఒక గ్రామం చొప్పున పైలెట్ ప్రాజెక్ట్ గా చేపట్టి జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో పీఎం సూర్య ఘర్ బిజిలీ యోజన పథకం ద్వారా ఇంటి పైకప్పులపై సోలార్ విద్యుత్ వ్యవస్థల ఏర్పాటును ప్రోత్సహించాలని ఎంపీ డీకే అరుణ సూచించారు. ప్రతి నియోజకవర్గంలో కనీసం ఒక గ్రామాన్ని ఎంపిక చేసి ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని టీజీఎస్‌పీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజనీర్‌కు సూచించారు. సర్పంచ్‌లు ముందుకు వచ్చే గ్రామాల్లో సోలార్ విద్యుత్ వ్యవస్థల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అన్నారు.

**అమృత్ పథకం పనులు డిసెంబర్‌లోగా పూర్తి చేయాలి**

మున్సిపాలిటీల్లో అమృత్ పథకం ద్వారా చేపడుతున్న తాగునీటి సరఫరా పనులను డిసెంబర్‌లోగా పూర్తి చేయాలని




ఎంపీ సూచించారు. సంబంధిత ఏజెన్సీలతో సమావేశాలు నిర్వహించి పనులను వేగవంతం చేయాలని, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి రైతులు, మహిళా సంఘాలకు డ్రోన్ల ద్వారా పంటలకు పురుగుమందుల పిచికారీపై అవగాహన కల్పించాలని ఎంపీ సూచించారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడంతో పాటు హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న మహబూబ్‌నగర్ జిల్లా అవసరాలను దృష్టిలో ఉంచుకుని మార్కెట్‌లో డిమాండ్ ఉన్న వైవిధ్యమైన పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు.

**కెజిబివిల్లో విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం**

జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో ద్యార్థుల ఆరోగ్యం, భద్రత, ఆహార నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీ సూచించారు. ఫుడ్ పాయిజన్ వంటి అవాంఛనీయ ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు.మిడ్జిల్ ఖ+దీఎలో వర్షపు నీరు నిల్వ కాకుండా డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు అంచనాలు సిద్ధం చేయడంతో పాటు నూతన డైనింగ్ హాల్ నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సూచించారు.పీఎం శ్రీ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలి పీఎం శ్రీ పథకం కింద జిల్లాలోని 26 పాఠశాలల్లో ల్యాబ్‌లు, అదనపు తరగతి గదులు, టాయిలెట్లు తదితర మౌలిక వసతుల కల్పన పనులు చేపడుతున్నట్లు అధికారులు వివరించారు. ఈ పాఠశాలల్లో సీబీఎస్ఈ విద్యతో పాటు 8వ తరగతి నుంచే ఐఐటీ, మెడిసిన్ తదితర పోటీ పరీక్షలకు శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు.టీడీ గుట్ట రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ) నిర్మాణానికి సంబంధించిన భూసేకరణ అంశాలపై సమావేశంలో చర్చించారు. భూసేకరణకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఎదురైనా తమ దృష్టికి తీసుకురావాలని రైల్వే అధికారులకు ఎంపీ సూచించారు. జిల్లాలో జరుగుతున్న రైల్వే ఆర్.ఓ.బి పనులు,నేషనల్ హై వే రోడ్డు పనులు సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ పనుల పురోగతిలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు.ఆర్‌డబి,పంచాయతీ రాజ్ శాఖా ద్వారా చేపట్టిన రహదారుల పనులు కూడా సమీక్షించి ఆదేశాలు జారీ చేశారు. పార్లమెంటు నియోజకవరంలోని సొంత భవనాలు లేని అంగన్వాడీ కేంద్రాలకు ప్రభుత్వ భూమి కేటాయించేలా తహశీల్దార్ల ద్వారా ప్రతిపాదనలు పంపించాలని, వి.బి.జి. రామ్ జీ నిధులతో అంగన్వాడీ భవనాలు ,వి.ఓ భవనాలు,జి.పి.భవనాలు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్మాణాలను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా స్పందిస్తూ జిల్లాలోని ప్రతి ఖ+దీఎని మండల ప్రత్యేక అధికారులు క్రమం తప్పకుండా సందర్శించి విద్యార్థుల సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తున్నారని తెలిపారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.సమావేశంలో డీఆర్‌డీఓ నర్సింహులు, జడ్పీ సీఈఓ వెంకట రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి, కార్పొరేషన్ మేయర్ గుమ్మాల మమత,జిల్లా పౌర సరఫరాల అధికారి గంప శ్రీనివాస్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, దిశ కమిటీ సభ్యులు, రైల్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రిజిస్ట్రార్ నిర్వహణలో బ్రౌన్ గ్రంథాలయ అభివృద్ధి



**కడప ఎడ్యుకేషన్ అక్టోబర్ 06: (స్కై న్యూస్ )** యోగి వేమన విశ్వ విద్యాలయం అలానే అనుబంధ సంస్థ అయిన బ్రౌన్ గ్రంథాల యం నూతన రిజిస్ట్రార్ ఆచార్య గంగిరెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి దిశగా పయనిస్తా యని విశ్వవి ద్యాలయం పాలకమండలి మాజీ సభ్యులు, వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి ఆకాంక్షించారు. మంగళవారం విశ్వవిద్యాలయంలో ఆచార్య గంగిరెడ్డికి జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ అతిచిన్న వయసులో రిజిస్ట్రార్ గా పరిపాలనపరమైన కీలక భాధ్యతలు తీసుకోవడం సంతో షదాయకమన్నారు. విశ్వవి ద్యాలయ పరిధిలోని బ్రౌన్ గ్రంథాలయాన్ని ప్రగతి పథంలో తీసుకువెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో రచయితల సంఘం ప్రతినిధులు డా.వెల్లాల వెంకటేశ్వరాచారి, డాక్టర్ తుమ్మ లూరు సురేష్ బాబు, డాక్టర్ కొవ్పోలు రెడ్డి శేఖర్ రెడ్డి, రాజ గోపాల్ రెడ్డి, వి. సుధాకర్, శివా రెడ్డి, ఖాజా, సూర్య నారాయణ రెడ్డి, దానం తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా బ్యాడ్మింటన్ జట్టుకు మహమ్మద్ సుమైర్ ఇబ్రహీం ఎంపిక



**జడ్చర్ల, అక్టోబర్ 6 :(స్కైన్యూస్ )**మహబూబ్ నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన అండర్-17 ఎస్ జి ఎఫ్ జిల్లా బ్యాడ్మింటన్ సెలెక్షన్స్ లో ప్రతిభ కనబరిచిన మహమ్మద్ సుమైర్ ఇబ్రహీం మహబూబ్ నగర్ జిల్లా జట్టుకు ఎంపికయ్యాడు. జడ్చర్ల లోని శ్రీ చైతన్య పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సుమైర్ ఇబ్రహీం ప్రతిరోజూ జడ్చర్ల స్పోర్ట్స్ ఏరీనాలో క్రమం తప్పకుండా శిక్షణ పొందుతున్నాడు. అతని కృషికి గుర్తింపుగా జిల్లా జట్టుకు ఎంపిక కావడంపై కుటుంబ సభ్యులు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా తండ్రి ఎం.డి.నిజాముద్దీన్, సాయి నరసింహులు గుప్తా, ధృవ బాదిమి, కోచ్ సయ్యద్ లు సుమైర్ ను అభినందించి, రాబోయే పోటీల్లో మరింత ప్రతిభ కనబరిచి జడ్చర్లతో పాటు జిల్లాకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.

## 552వ ఉర్సు హజ్రత్ సయ్యద్ షా అహ్మద్ ఖత్తాల్ హుస్సేనీ అష్రఫీ జలాలీ (రహ)

**వార్షిక ఉర్సు షరీఫ్ పోస్టర్లను ఆవిష్కరించిన నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్**

**కొల్లశీపల్లి లో అక్టోబర్ 16న 26వ అంతర్‌మత సదస్సు**



**నారాయణపేట, అక్టోబర్ 6 ( స్కైన్యూస్ ):**నారాయణపేట జిల్లా కొల్లశీపల్లి లో నిర్వహించనున్న వార్షిక 552వ ఉర్సు షరీఫ్ హజ్రత్ మఖ్దూమ్ ఖ్వాజా సయ్యద్ షా అహ్మద్ ఖత్తాల్ హుస్సేనీ అష్రఫీ జలాలీ (రహ.) ఉర్సుకు సంబంధించిన పోస్టర్లను నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. 552వ ఉర్సు షరీఫ్ సందర్భంగా అక్టోబర్ 16వ తేది శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కొల్లంపల్లి దర్గా షరీఫ్ ప్రాంగణంలో 26వ అంతర్ మత సదస్సు నిర్వహించనున్నట్లు అష్రఫియా ఎడ్యుకేషనల్ సొసైటీ, కొల్లశీపల్లి ఉపాధ్యక్షులు అడ్వకేట్ అబ్దుల్ సలీం తెలిపారు.ఈ సదస్సులో గోగి షరీఫ్ బార్గాహ్ జలాలియా సజ్జదానషీన్ సయ్యద్ షా కలీముల్లాహ్ హుస్సేనీ అధ్యక్షత వహించనున్నారు. అంతర్‌మత సదస్సుకు రాష్ట్ర మంత్రి శ్రీ వాకిటి శ్రీహరి, మహబూబ్‌నగర్ ఎంపి డీకే అరుణ,ఎమ్మెల్సీ ఎన్ నవీన్ కుమార్ రెడ్డి, నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికా రెడ్డి, తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఉబేదుల్లా కోత్వాల్,జిల్లా కలెక్టర్ శ్రీమతి ప్రియాంక,జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్‌తో పాటు మతదీషులు వివిధ పార్టీ రాజకీయ నాయకులు , సంతులు, మషాయిఖ్‌లు, ఉలమాలు పాల్గొననున్నారు. నమాజ్-ఎ-అసర్ అనంతరం బార్గాహ్ ఖత్తాలియా (రహ.)లో రస్మ్-ఎ-పర్చమ్ కుషాయీ (పర్చమ్ జలాలియా) కార్యక్రమం నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమంలో ఉలమాలు, మషాయిఖ్‌లు పాల్గొంటారు. నమాజ్-ఎ-మగ్రిబ్ అనంతరం లంగర్ ఖత్తాలియా ఏర్పాటు చేయనున్నారు. అక్టోబర్ 17, శనివారం నమాజ్-ఎ-ఫజర్ అనంతరం ఖాన్కాహ్ ఖత్తాలియా నుంచి సందల్ ఊరేగింపు ప్రారంభమై దర్గా షరీఫ్‌కు చేరుకుంటుంది. అక్కడ సజ్జాదానషీన్, హజ్రత్ చందా హుస్సేనీ (రహ.) మనవడు మఖ్దూమ్ ఖ్వాజా సయ్యద్ షా జలాల్ హుస్సేనీ అష్రఫీ జలాలీ చేతుల మీదుగా రస్మ్-ఎ-సందల్ నిర్వహించబడుతుంది. నమాజ్-ఎ-ఇషా అనంతరం దర్గా ప్రాంగణంలో చిరాగాన్ మరియు మహ్ఫిల్-ఎ-సమా నిర్వహించనున్నారు. అక్టోబర్ 18, ఆదివారం ఉదయం 8 గంటలకు మహ్ఫిల్-ఎ-కుల్ మరియు తబర్రుకాత్ పంపిణీ కార్యక్రమాలు నిర్వహించబడతాయి. ఉర్సు షరీఫ్ సందర్భంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు 552వ ఉర్సు ముబారక్‌లో అష్రఫీయా జలాలియా సిల్సిలాకు చెందిన కొల్లశీపల్లి అనుబంధితులు, భక్తులు,, హిందు,ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు. పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో అడ్వకేట్ అబ్దుల్ సలీం, అడ్వకేట్ అమీరుద్దీన్, మున్సిపల్ కౌన్సిలర్ మహమ్మద్ తఖీ చాంద్, దస్తగీర్ చాంద్, సయ్యద్ ఆరిఫ్ ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

## సిద్ధాపూర్ డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా మూడో రోజుకు చేరిన రిలే నిరాహార దీక్ష

**జీవో 641 రద్దు చేసేవరకు పోరాటం ఆగదు**

**జేఏసీ చైర్మన్ రాంబాల్ నాయక్**

**రంగారెడ్డి జిల్లా అక్టోబర్ 6 (స్కై న్యూస్):** షాద్‌నగర్ నియోజకవర్గం, కొత్తూరు మండల పరిధిలోని సిద్ధాపూర్‌లో ప్రతిపాదిత డంపింగ్ యార్డు ఏర్పాటుకు వ్యతిరేకంగా చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఉధృతంగా కొనసాగుతున్నాయి. సిద్ధాపూర్ డంపింగ్ యార్డు జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ ) ఆధ్వర్యంలో చేపట్టిన ఈ నిరసన కార్యక్రమం మంగళవారం నాటికి మూడవ రోజుకు చేరుకుంది.ఈ సందర్భంగా ఆందోళనకారులు "డంపింగ్ యార్డు హటావో -- సిద్ధాపూర్ బచావో" అంటూ పెద్దపెట్టున నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు.దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి జేఏసీ చైర్మన్ రాంబాల్ నాయక్ మాట్లాడుతూ సిద్ధాపూర్ పరిసర ప్రాంతాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ డంపింగ్ యార్డును ఏర్పాటు చేయనివ్వబోమని స్పష్టం చేశారు. సారవంతమైన వ్యవసాయ



భూములు, పంటలు కలుషితమై రైతాంగం తీవ్రంగా నష్టపోతుందని, పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్రమైన అనారోగ్య సమస్యల బారిన పడతారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించి తీసుకొచ్చిన ఈ ఆలోచనలను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. భావితరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని డంపింగ్ యార్డు ప్రతిపాదనను, సంబంధిత జీవో 641ను ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని జేఏసీ నేతలు ముక్తకంఠంతో హెచ్చరించారు. ప్రభుత్వం స్పందించి నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే ప్రజా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కో కన్వీనర్ బిచ్యా నాయక్, జేఏసీ కో చైర్మన్ రజిత నాయక్, మురళి, రమేష్, చాకలి రమేష్, గున్ని మహేష్, దేశమని శీను, రాజేందర్ రెడ్డి, వడ్డే బాలయ్య, బాబు రాజ్ నాయక్, శ్రీనివాస్ రెడ్డి ఎల్లారాం రామకృష్ణారెడ్డి, మనోజ్, శ్రీధర్ చారి ,ఎం శీను, శంకర్ రాజు లింగారాం రఘు, చాకలి కృష్ణయ్య, రాజయ్య, లింగం, నరేష్, రాజయ్య, రవి, జేఏసీ ప్రతినిధులు, స్థానిక రైతులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పేదలకు ఇండ్లు, రేషన్ కార్డులు ఇచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే....

**: దేవరకద్ర ఎమ్మెల్యే శ్రీ జి. మధుసూదన్ రెడ్డి**

**భూత్పూర్, అక్టోబర్ 6(స్కైన్యూస్ )** మున్సిపాలిటీ కేంద్రంలోని కె ఎం ఆర్ ఫంక్షన్ హాల్‌లో భూత్పూర్ మండలం, మున్సిపాలిటీకి చెందిన లబ్ధిదారులకు దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి అర్హులైన లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులతో పాటు రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్, స్మార్ట్ రేషన్ కార్డులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు అందజేశారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు చెల్లిస్తూనే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.2 లక్షల పంట రుణమాఫీ, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు వంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు.పైరవీలకు తావులేకుండా అర్హతే ప్రామాణికంగా ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నామని స్పష్టం చేశారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల సమస్యలను పట్టించుకోలేదని, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీలోనూ అవకతవకలు జరిగాయని విమర్శించారు.అర్హులైన ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో ఏడాదికి సుమారు రూ.13 వేల కోట్లతో తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్నబియ్యం అందిస్తున్నామని తెలిపారు.అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్లకు పెద్దపీట కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేవరకద్ర నియోజకవర్గంలో మొదటి విడతగా 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, ఇందులో భూత్పూర్ మండలానికే 452 ఇళ్లు కేటాయించామని తెలిపారు.ప్రస్తుతం గుడిసెల్లో నివసిస్తున్న అర్హులను గుర్తించి రెండో విడత ఇళ్లు మంజూరు చేస్తున్నామని, వచ్చే ఏడాది మార్చిలో మూడో విడత ఇందిరమ్మ ఇళ్లను కూడా అందిస్తామని చెప్పారు.పదేళ్లలో బీఆర్ఎస్ చేయలేని పనులను.. కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల్లో చేసి చూపిస్తోంది అన్నారు.ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో మహిళా సాధికారతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రాష్ట్రంలోని మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు.ప్రజలకు సంక్షేమం అందుతుంటే బీఆర్ఎస్ నాయకులు ఓర్వలేకపోతున్నారని విమర్శించారు, గత పదేళ్ల పాలనలో ప్రజలకు జరిగిన మేలు కంటే బీఆర్ఎస్ నాయకుల స్వప్రయోజనాలపైనే ఎక్కువ దృష్టి పెట్టారని ఆరోపించారు.ప్రజా సంక్షేమం, మహిళా సాధికారత, అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బాలకోటి , వైస్ చైర్మన్ సూర్యకళ, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచులు, మండల, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు

## గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు మరింత చేరువ

**మంత్రి సత్యకుమార్ యాదవ్**

**కడప కలెక్టరేట్ అక్టోబరు 6: (సై న్యూస్ )** గ్రామీణ ప్రాంత ప్రజ లకు ప్రాథమిక వైద్య సేవలను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఆ యుష్మాన్ ఆరోగ్య మందిర్‌లను విస్తరిస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకు మార్ యాదవ్ తెలిపారు. ఆరోగ్యం పరమం ధనం' కార్యక్ర మంలో భాగంగా మంగళవారం గుడివాడ నుంచి రాష్ట్రవ్యా ప్తంగా 165 ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (విలేజ్ హెల్త్ క్లినిక్)లను వర్చువల్ విధానంలో ప్రారంభిం చారు.జిల్లాలో జమ్మలమడుగు డివిజన్‌లోని దేవగుడి-2, బొ మ్మేపల్లి, పెద్ద దండ్లూరు, దొరసా నిపల్లి, కడప డివిజన్‌లోని చీమ లపెంట విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ప్రారంభించారు.ఈ సందర్భంగా కడప జిల్లా కలెక్టర్ కార్యాలయం లోని



సభాభవనం నుంచి అధికా రులు, వైద్య సిబ్బంది వర్చువల్ కార్య క్రమంలో పాల్గొన్నా రు.ఇం దులో డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ మహమ్మద్ తాహా, డాక్టర్ గీత, డాక్టర్ మల్లేష్, డాక్టర్ ఖాజా మొహిద్దీన్, డాక్టర్ చెన్నారెడ్డి, డెమో భారతి, జిల్లా గణాంక అధికారి రమేష్ రెడ్డి, వైద్యా ధికారులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, పంచా యతీరాజ్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సీఈసీ నుంచి జ్ఞానేశ్వర్‌ను తొలగించి, అరెస్ట్ చేయాలి

**మెదక్:** సీఈసీ పదవి నుంచి జ్ఞానేశ్వర్‌ను తొలగించి అరెస్టు చేయాలని డిసిసి అధ్యక్షులు రెడ్డి పల్లి ఆంజనేయులు గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం మెదక్ కలెక్టరేట్ ఎదుట సిఈసి జ్ఞానేశ్వర్ ను తొలగించాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి డిసిసి అధ్యక్షుడితో పాటు సిపిఎం జిల్లా కార్యదర్శి నర్సమ్మ ల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఓటు హక్కు పరిరక్షణ, రాజ్యాంగ విలువల సంరక్షణే లక్ష్యంగా ప్రజలను చైతన్య పరిచేందుకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వారు ప్రకటించారు.

**రాజ్యాంగ వ్యవస్థలపై ఒత్తిడి చేస్తున్నారనే ఆరోపణలు.**

కేంద్రంలోని మోదీ ప్రభుత్వం, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఒత్తిడితో రాజ్యాంగ సంస్థల స్వతంత్రతకు విఘాతం కలిగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని వారు ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని, ప్రతి అర్హుడైన పౌరుడికి ఓటు వేసే అవకాశం కల్పించడం ఎన్నికల వ్యవస్థ బాధ్యత అని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాల నిర్వహణలో పారదర్శకత ఉండాలని, అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించబడకుండా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితాలపై ప్రజల్లో అనుమానాలు తలెత్తినప్పుడు వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత ఎన్నికల యంత్రాంగంపై ఉందన్నారు. ఓటు హక్కుకు భంగం కలిగించే ఏ చర్యనైనా ప్రజాస్వామ్య పరిరక్షణ కోణంలో ప్రశ్నిస్తామని పేర్కొన్నారు. ఓటు హక్కు పరిరక్షణ ఉద్యమాన్ని కేవలం ప్రకటనలకే పరిమితం చేయబోమని వారు స్పష్టం చేశారు. గ్రామాలు, పట్టణాలు, బూత్ స్థాయిలో ప్రజలను చైతన్యపరచడంతో పాటు, అవసరమైతే దేశ రాజధాని ఢిల్లీ వరకు ఉద్యమాన్ని తీసుకెళ్తామని తెలిపారు. అర్హులైన ఓటర్ల పేర్లు ఓటరు జాబితాల్లో ఉన్నాయా లేదా అనే అంశాన్ని పరిశీలించాలని, ఏవైనా తప్పులు గుర్తిస్తే చట్టబద్ధమైన మార్గాల్లో సరిదిద్దుకునేందుకు ప్రజలకు అవగాహన కల్పిస్తామని అన్నారు. ఓటు హక్కు అనేది కేవలం ఎన్నికల్లో ఓటు వేయడానికి మాత్రమే పరిమితం కాదని, ప్రజాస్వామ్యంలో పౌరుడి భాగస్వామ్యానికి అది పునాది అని పేర్కొన్నారు. ప్రతి ఓటరుకు సమాన గౌరవం, సమాన హక్కులు కల్పించాలన్నదే తమ పోరాట లక్ష్యమన్నారు. ఎన్నికల వ్యవస్థకు సంబంధించిన వ్యవహారంలో జ్ఞానేశ్వర్ పాత్రపై తీవ్ర అభ్యంతరాలను వ్యక్తం చేసిన నేతలు ఆయనను ప్రధాన ఎన్నికల కమిషనర్ పదవి నుంచి తొలగించాలని, అరెస్ట్ చేసి విచారించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ప్రకటించారు. ఈ అంశంలో సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు విశ్వాసం ఉండాలంటే ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారితనం తప్పనిసరిగా ఉండాలని అన్నారు. ఆరోపణలపై సంబంధిత సంస్థలు నిష్పక్షపాతంగా విచారణ జరిపి, చట్టప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓటరు జాబితాలో పేర్లు లేకపోవడం, వివరాల్లో తప్పులు ఉండటం వంటి సమస్యలను అర్హులైన పౌరులు నిర్లక్ష్యం చేయకూడదని వారు సూచించారు. ప్రజలు తమ ఓటరు వివరాలను పరిశీలించుకోవాలని, ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఎన్నికల అధికారులను సంప్రదించి తగిన ఆధారాలతో ఫిర్యాదు చేయాలని వారు పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం చివరి వరకు పోరాడతామన్నారు. నర్సాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మి రాజు యాదవ్ మాజీ మున్సిపల్ చైర్మన్ తోడుపునూరి చంద్రపాల్, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు పబ్బతి ప్రభాకర్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, ఆవుల గోపాల్ రెడ్డి, మల్లప్ప యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పరుశరామ్ గౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గంగాధర్ కాంగ్రెస్ నాయకులు రాగి అశోక్, శ్రీకాంత్ రెడ్డి, కిరణ్ గౌడ్, మహేందర్ రెడ్డి, సిపిఎం నాయకులు మల్లేశం, బాలమణి, షౌకత్ అలీ, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.




## తెలంగాణలో అపార్ట్‌మెంట్లకు ఫైర్ ఎన్‌ఓసీ..

# 24 మీటర్ల వరకు మినహాయింపు

**హైదరాబాద్, అక్టోబరు 6:**తెలంగాణలో కొత్తగా నిర్మించే నివాస అపార్ట్‌మెంట్‌లకు సంబంధించి రాష్ట్ర అగ్నిమాపక శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. భవన నిర్మాణానికి ముందు తీసుకోవాల్సిన ప్రొవిజనల్ ఫైర్ నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ కోసం అవసరమైన కనీస ఎత్తు పరిమితిని 18 మీటర్ల నుంచి 24 మీటర్లకు పెంచింది. ఈ సవరించిన నిబంధన అక్టోబర్ 7వ తేదీ నుంచి అమల్లోకి వస్తుందని అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. ఇప్పటివరకు ఉన్న నిబంధనల ప్రకారం, 18 మీటర్లు లేదా అంతకంటే ఎక్కువ ఎత్తు ఉన్న నివాస భవనాలు నిర్మాణ అనుమతికి ముందే తప్పనిసరిగా ఫైర్ ఎన్‌ఓసీ పొందాల్సి ఉండేది. తాజా మార్పుతో 18 నుంచి 24 మీటర్ల మధ్య ఎత్తు ఉండే అపార్ట్‌మెంట్‌లకు (సుమారు 5 నుంచి 7 అంతస్తులు) కేవలం ఎత్తు కారణంగా ప్రొవిజనల్ ఎన్‌ఓసీ తీసుకోవాల్సిన అవసరం ఉండదు. అయితే, ఈ సడలింపు కేవలం నివాస భవనాలకు మాత్రమే వర్తిస్తుంది. పాఠశాలలు, ఆసుపత్రులు, హోటళ్లు, హాస్టళ్లు, వాణిజ్య సముదాయాలు, కార్యాలయాలు, పరిశ్రమలు వంటి ఇతర భవనాలకు ప్రస్తుతం ఉన్న అగ్నిమాపక భద్రతా నిబంధనలే కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు. బిల్డర్ల సంఘాలతో జరిపిన సంప్రదింపులు, అలాగే ఇటీవల అమల్లోకి వచ్చిన నేషనల్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ స్టాండర్డ్స్ 2026కు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్, ఏప్రిల్ 30న నేషనల్ బిల్డింగ్ కోడ్ ఆఫ్ ఇండియా 2016 స్థానంలో 2026ను అమల్లోకి తెచ్చింది. ఈ నూతన జాతీయ ప్రమాణాల్లో నివాస భవనాల అగ్నిమాపక భద్రతకు 24 మీటర్ల ఎత్తును ఒక ముఖ్యమైన కొలమానంగా నిర్దేశించారు. తక్కువ, మధ్యస్థాయి నివాస భవనాలపై నియంత్రణ భారాన్ని తగ్గించి, అనుమతుల ప్రక్రియను సులభతరం చేయడమే ఈ మార్పు ముఖ్య ఉద్దేశమని తెలంగాణ ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్ వివరించారు. అయితే, ఎన్‌ఓసీ పరిధిలోకి రానంత మాత్రాన భవనాలకు ప్రాథమిక అగ్నిమాపక భద్రతా ప్రమాణాల నుంచి మినహాయింపు ఉండదని అధికారులు తేల్చిచెప్పారు. నిర్మాణ సమయంలో ప్రమాదరహిత నిష్క్రమణ మార్గాలు, అత్యవసర లైటింగ్, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, ఎలక్ట్రికల్ భద్రత వంటి ఏర్పాట్లను తనిఖీ చేసేందుకు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ అంశంపై కౌన్సిల్ ఫర్ ఫైర్ అండ్ లైఫ్ సేఫ్టీ వైస్ ప్రెసిడెంట్ ఎస్.పి. అంచురి స్పందిస్తూ, కేవలం భవనం ఎత్తు మాత్రమే అగ్నిప్రమాద తీవ్రతను నిర్ణయించదని హెచ్చరించారు. నివాసితుల సాంద్రత, తరలింపు ఏర్పాట్లు, పొగను నియంత్రించే వ్యవస్థలు (స్మోక్ మేనేజ్‌మెంట్), ఫైర్ టెండర్లు భవనంలోకి ప్రవేశించడానికి ఉన్న మార్గాలు వంటి అనేక అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. 18 నుంచి 24 మీటర్ల ఎత్తు భవనాల్లో కూడా తప్పనిసరిగా సురక్షితమైన మెట్లు, ఎమర్జెన్సీ లైటింగ్, ఫైర్ అలారం వ్యవస్థలు, తగిన అగ్నిమాపక పరికరాలు ఉండాలని ఆయన నొక్కిచెప్పారు. అపార్ట్‌మెంట్లలో మెట్ల మార్గాలను, టెర్రస్‌లను మూసివేయడం, ఉమ్మడి ప్రదేశాల్లో సామాగ్రిని నిల్వ చేయడం, అనధికారిక విద్యుత్ మార్పులు, ఫైర్ టెండర్లకు అడ్డంగా వాహనాలు పార్క్ చేయడం వంటివి పెను ప్రమాదాలకు దారితీస్తాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణ సమయంలో ఏర్పాటు చేసిన భద్రతా ప్రమాణాలను నివాసం ప్రారంభించాక కూడా నిరంతరం పాటించాలని వారు సూచిస్తున్నారు. 2025లో తెలంగాణలో 8,860కి పైగా అగ్నిప్రమాదాలు జరిగాయి. వీటిలో 160 మందికి పైగా మరణించారు. ఈ నేపథ్యంలో భద్రతా ప్రమాణాల విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం తగదని నిపుణులు హెచ్చరిస్తున్నారు



# ఈనాడు పత్రికకు లీగల్ నోటీసు పంపిన కేటీఆర్..

**పాస్‌పోర్టు జప్తు అంటూ తప్పుడు వార్త ప్రచురించారని ఆరోపణ**

**48 గంటల్లో క్షమాపణ చెప్పి, వార్తను ఉపసంహరించుకోవాలని డిమాండ్**

**కోర్టు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని నోటీసులో స్పష్టం చేసిన న్యాయవాది**

**చర్యలు తీసుకోకపోతే పరువునష్టం దావా వేస్తామని హెచ్చరిక**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ప్రముఖ తెలుగు దినపత్రిక ఈనాడుకు లీగల్ నోటీసు పంపారు. తన పాస్‌పోర్టును కోర్టు జప్తు చేసిందంటూ ప్రచురించిన వార్త పూర్తిగా అవాస్తవమని, నిరాధారమని ఆయన ఆరోపించారు. ఈ తప్పుడు కథనాన్ని వెంటనే ఉపసంహరించుకుని, బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తన న్యాయవాది ద్వారా నోటీసులు పంపిన విషయాన్ని కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా ధ్రువీకరించారు. సెప్టెంబర్ 29న ఈనాడు దినపత్రికలో 'కేటీఆర్ పాస్‌పోర్టు తాత్కాలికంగా జప్తు' శీర్షికతో వచ్చిన కథనంపై కేటీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ వార్త తన ప్రతిష్టకు భంగం కలిగించేలా, ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉందని ఆయన తరఫు న్యాయవాది ఎన్. లలితారెడ్డి సెప్టెంబర్ 30న పంపిన నోటీసులో పేర్కొన్నారు. ఈనాడు ఎడిటర్, పబ్లిషర్, ప్రింటర్, రెసిడెంట్ ఎడిటర్, సంబంధిత రిపోర్టర్‌కు ఈ నోటీసులు జారీ అయ్యాయి. వాస్తవానికి, ఏసీబీ దర్యాప్తు అధికారి ప్రత్యేక కోర్టులో కేటీఆర్ పాస్‌పోర్టుకు సంబంధించి తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ఒక మెమో మాత్రమే దాఖలు చేశారని, అంతమాత్రాన కోర్టు పాస్‌పోర్టు జప్తునకు ఆదేశాలు ఇచ్చినట్టు కాదని నోటీసులో స్పష్టం చేశారు. ప్రత్యేక కోర్టు అలాంటి ఉత్తర్వులేవీ జారీ చేయలేదని తేల్చిచెప్పారు. మరోవైపు, రీజనల్ పాస్‌పోర్టు కార్యాలయం నుంచి సెప్టెంబర్ 28న షోకాజ్ నోటీసు మాత్రమే అందిందని, వివరణ ఇచ్చేందుకు 15 రోజుల సమయం ఉందని వివరించారు. కోర్టు ఆదేశాలు లేకుండానే జప్తు అని పేర్కొనడం కేటీఆర్‌పై ప్రజల్లో తప్పుడు అభిప్రాయం కల్పించడమేనని న్యాయవాది పేర్కొన్నారు. ప్రచురితమైన తప్పుడు వార్తను 48 గంటల్లోగా అన్ని మాధ్యమాల (ప్రింట్, ఆన్‌లైన్, సోషల్ మీడియా) నుంచి తొలగించాలని నోటీసులో డిమాండ్ చేశారు. అదే ప్రాధాన్యతతో సవరణ ప్రచురించడంతో పాటు, కేటీఆర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని కోరారు. గడువులోగా స్పందించకపోతే సివిల్, క్రిమినల్ పరువునష్టం చర్యలు తీసుకుంటామని, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు కూడా ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ విషయాన్ని కేటీఆర్ తన సోషల్ మీడియా ఖాతా ద్వారా స్వయంగా వెల్లడించారు. "నా పాస్‌పోర్టు విషయంలో తప్పుడు వార్త ప్రచురించిన ఈనాడు దినపత్రికకు, నా న్యాయవాది ద్వారా లీగల్ నోటీస్ పంపించాను. 50 ఏళ్ల చరిత్ర కలిగిన ఒక ప్రముఖ దినపత్రిక వాస్తవాలు నిర్ధారణ చేసుకోకుండా, తప్పుడు వార్తలు ప్రచురించడం శోచనీయం" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.



# మన్నె క్రిశాంక్ అరెస్ట్...

**హైదరాబాద్, అక్టోబరు 6:**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబంపై ఆరోపణలు చేస్తూ వివాదాస్పద బ్యానర్లు ఏర్పాటు చేసిన కేసులో భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నేత, ఆ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్‌ను గోపాలపురం పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. సికింద్రాబాద్‌లోని మెడికవర్ ఆసుపత్రి వద్ద అభ్యంతరకర రీతిలో బ్యానర్లు ప్రదర్శించారన్న అభియోగంపై ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాల ప్రకారం, మెడికవర్ ఆసుపత్రికి సంబంధించి రూ. 13,200 కోట్ల మేర ఆర్థిక లావాదేవీలు జరిగాయని ఆరోపిస్తూ క్రిశాంక్ తన అనుచరులతో కలిసి ఆసుపత్రి వెలుపల బ్యానర్లు ఏర్పాటు చేసినట్లు పోలీసులు గుర్తించారు. ముఖ్యమంత్రి చిత్రపటాన్ని ఉపయోగిస్తూ, ఆయనకు అభినందనలు తెలుపుతున్నట్లుగా వ్యంగ్యంగా వీటిని రూపొందించారు. దీనిపై కాంగ్రెస్ నాయకుడు మెట్టు సాయి కుమార్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్), సైబర్ క్రైమ్ విభాగాలకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు అక్టోబర్ 5న హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో క్రిశాంక్, 'వీ= మీడియా తెలంగాణ" ప్రతినిధులపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని సెక్షన్లు 353(2), 352 కింద కేసులు నమోదయ్యాయి. అరెస్టుకు ముందు క్రిశాంక్ ఈ వ్యవహారంపై స్పందిస్తూ, వివాదాస్పద లావాదేవీల ద్వారా నల్లధనాన్ని తెల్లధనంగా మార్చుకున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి కుటుంబానికి చెందిన వ్యాపార ఆస్తులు, ఆర్థిక లావాదేవీలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)తో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదే కేసులో గతంలో బీఆర్ఎస్ నాయకులు సాయికిరణ్, వినీత్‌లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. క్రిశాంక్ అరెస్టును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి అవినీతిని ప్రశ్నించినందుకే కక్షపూరితంగా క్రిశాంక్‌ను లక్ష్యంగా చేసుకున్నారని ఆయన ఆరోపించారు. ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తోందని, ప్రభుత్వ వైఫల్యాలను నిరంతరం ఎండగడుతూనే ఉంటామని ఆయన సోషల్ మీడియా వేదికగా స్పష్టం చేశారు. మరోవైపు బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని ప్రభుత్వం, కాంగ్రెస్ నేతలు కొట్టిపారేశారు. ముఖ్యమంత్రి కుటుంబానికి మెడికవర్ ఆసుపత్రితో ఎటువంటి వ్యాపార సంబంధాలు లేవని తెలంగాణ ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. తాజా అరెస్టు పరిణామాలతో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ విమర్శలు, ప్రతివిమర్శలు మరింత ముదిరాయి.

# న్యూడ్ వీడియో కాల్..

**సీన్ కట్ చేస్తే 40 లక్షలు మాయం**

**గాంధీనగర్ , అక్టోబరు 6:**అవతలి వ్యక్తి ఎవరో తెలియదు.. కానీ వీడియో కాల్ ఎత్తగానే స్క్రీన్‌పై ఓ యువతి నగ్నంగా కనిపించింది. షాక్‌కు గురైన యువకుడు వెంటనే కాల్ కట్ చేసి నంబర్‌ను బ్లాక్ చేశాడు. ఇంతలో మరో నంబర్ నుంచి కాల్ వచ్చింది. "నీ నగ్న వీడియో మా దగ్గర ఉంది.. వైరల్ చేస్తాం" అంటూ బెదిరింపులు మొదలయ్యాయి. చివరకు ఈ భయాన్ని అడ్డుపెట్టుకుని సైబర్ నేరగాళ్లు అతడి నుంచి ఏకంగా రూ.49.78 లక్షలు కాజేశారు. ఈ ఘటన అహ్మదాబాద్‌లో వెలుగుచూసింది. పోలీసుల వివరాల ప్రకారం.. నగరానికి చెందిన 25 ఏళ్ల ప్రైవేట్ ఉద్యోగికి సెప్టెంబర్ 3న గుర్తుతెలియని నంబర్ నుంచి వాట్సాప్ వీడియో కాల్ వచ్చింది. కాల్ ఎత్తగానే నగ్నంగా ఉన్న ఓ యువతి స్క్రీన్‌పై కనిపించింది. దీంతో అతడు వెంటనే కాల్ కట్ చేసి నంబర్‌ను బ్లాక్ చేశాడు. కొద్దిసేపటికే మరో నంబర్ నుంచి కాల్ వచ్చింది. "నీ న్యూడ్ వీడియో రికార్డ్ చేశాం. డబ్బులు ఇవ్వకపోతే సోషల్ మీడియాలో వైరల్ చేస్తాం" అంటూ అవతలి వ్యక్తులు బెదిరించారు. ఈ క్రమంలో ఓ వీడియోను కూడా పంపారు. భయపడిన యువకుడు దాన్ని తర్వాత డిలీట్ చేశాడు. అక్కడితో ఆగని మోసగాళ్లు సెప్టెంబర్ 27న మరో నంబర్ నుంచి సంప్రదించారు. తాను ఢిల్లీ సైబర్ క్రైమ్ బ్రాంచ్ అధికారి సంజయ్ అరోరానని ఓ వ్యక్తి పరిచయం చేసుకున్నాడు. న్యూడ్ వీడియో కేసులో నేరం జరిగిందని.. దీనికి ఏడేళ్ల వరకు జైలు శిక్ష పడుతుందని చెప్పి యువకుడిని మరింత భయపెట్టాడు. అహ్మదాబాద్ పోలీసులు అరెస్ట్ చేసే అవకాశం ఉందంటూ హెచ్చరించాడు. అరెస్ట్ నుంచి తప్పించుకోవాలంటే యూట్యూబ్ ప్రతినిధితో మాట్లాడి 'డ్యూ ప్రాసెస్' పూర్తి చేయాలని చెప్పాడు. అనంతరం మరో వ్యక్తిని యూట్యూబ్ ఎగ్జిక్యూటివ్‌గా పరిచయం చేశాడు. తన పేరుతో రెండు న్యూడ్ వీడియోలు బయటకు వచ్చాయని.. వాటిని తొలగించాలంటే రూ.71,250 చెల్లించాలని అతడు చెప్పాడు. పోలీసులకు భయపడటం.. వీడియోలు బయటకు వస్తే పరువు, ఉద్యోగం పోతుందేమోనన్న ఆందోళనతో యువకుడు డబ్బులు చెల్లించాడు. అయితే ఆ తర్వాత అసలు మోసం మొదలైంది. ఒక్కోసారి ఒక్కో కారణం చెబుతూ నిందితులు మరిన్ని డబ్బులు డిమాండ్ చేశారు. వీడియో వైరల్ చేస్తామని.. కెరీర్ నాశనం చేస్తామని బెదిరింపులు కొనసాగించారు. అరెస్ట్ చేస్తామంటూ కూడా భయపెట్టారు. అలా నిందితులు అడిగిన ప్రతిసారీ యువకుడు డబ్బులు పంపుతూ వచ్చాడు. వివిధ సందర్భాల్లో వారు సూచించిన బ్యాంకు ఖాతాలకు మొత్తం రూ.49.78 లక్షలు బదిలీ చేశాడు. అయినా వారి డిమాండ్లు ఆగలేదు. మరింత డబ్బు కావాలంటూ మళ్లీ ఒత్తిడి చేశారు. చివరకు తాను సైబర్ మోసానికి గురైనట్లు గుర్తించిన యువకుడు సైబర్ క్రైమ్ బ్రాంచ్‌ను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసిన పోలీసులు.. డబ్బులు బదిలీ చేసిన బ్యాంకు ఖాతాలను పరిశీలిస్తున్నారు. ఈ మోసం వెనుక ఎంతమంది ఉన్నారన్న దానిపైనా దర్యాప్తు చేస్తున్నారు.

# ఫేక్ సర్టిఫికెట్ల బాగోతం

**హైదరాబాద్ , అక్టోబరు 6:**తెలంగాణలో నకిలీ విద్యార్హత సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన 35 మంది ప్రభుత్వ జూనియర్ లెక్చరర్లను ఇంటర్మీడియట్ విద్యాశాఖ విధుల నుంచి తొలగించింది. వారు సమర్పించిన సర్టిఫికెట్లు నకిలీవని ధ్రువీకరణ కావడంతో ఈ కఠిన చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. వివరాల్లోకి వెళితే, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మొదట కాంట్రాక్టు లెక్చరర్లుగా పనిచేసిన వీరందరినీ 2023లో ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసింది. అయితే, వారి విద్యార్హత పత్రాలపై అనుమానాలు రావడంతో ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఆ సర్టిఫికెట్లను సంబంధిత విశ్వవిద్యాలయాలకు వెరిఫికేషన్ కోసం పంపింది. పరిశీలన అనంతరం ఆ సర్టిఫికెట్లు నకిలీవని యూనివర్సిటీలు తేల్చి చెప్పాయి. దీంతో విద్యాశాఖ సదరు లెక్చరర్లకు షో–కాజ్ నోటీసులు జారీ చేసి, వారి వివరణ తీసుకున్న తర్వాత సర్వీస్ నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఉద్యోగాలు కోల్పోయిన వారిలో రాజన్న–సిరిసిల్ల జిల్లా నుంచి ఆరుగురు ఉండగా, పెద్దపల్లి, సిద్దిపేట, సూర్యాపేట జిల్లాల నుంచి ముగ్గురు చొప్పున ఉన్నారు. భద్రాద్రి కొత్తగూడెం, కరీంనగర్, ఖమ్మం, నిర్మల్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల నుంచి ఇద్దరేసి లెక్చరర్లు ఉన్నారు. మరో ఎనిమిది జిల్లాల నుంచి ఒక్కొక్కరు చొప్పున ఈ జాబితాలో ఉన్నారు. ఇదే తరహా ఆరోపణలపై గతంలో సుమారు 10 మంది లెక్చరర్లను తొలగించినట్లు సమాచారం. ప్రస్తుతం మరో 320 మంది లెక్చరర్ల సర్టిఫికెట్లను కూడా వెరిఫికేషన్ కోసం యూనివర్సిటీలకు పంపినట్లు అధికారులు వెల్లడించారు. ఇదిలా ఉండగా, ఈ వ్యవహారంపై సీబీ–సీఐడీ, విజిలెన్స్ విచారణ జరిపించాలని ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఛైర్మన్ డాక్టర్ పి. మధుసూదన్ రెడ్డి డిమాండ్ చేశారు. గతంలో ఈ నకిలీ పత్రాలను పరిశీలించి, ధ్రువీకరించిన అధికారుల పాత్రపై కూడా విచారణ జరపాలని ఆయన కోరారు. మోసం రుజువైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# స్థానిక ఎన్నికలపై కూటమి కసరత్తు

**ముగిసిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్ భేటీ..**

**హైదరాబాద్ , అక్టోబరు 6:**స్థానిక సంస్థల ఎన్నికలు దగ్గరపడుతున్నకొద్దీ కూటమి నేతల్లో సీట్ల పంపకాలు, పోటీ చేసే స్థానాలపై ఉత్కంఠ నెలకొంది. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంగళవారం ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఉదయం 9.45 గంటలకు ఉండవల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో భేటీ కాగా, రెండు గంటలపాటు పలు అంశాలపై చర్చించారు. ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఈ భేటీలో పాల్గొనలేదు. కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వైజాగ్ పర్యటన కారణం గా అటెండ్ కాలేక పోతున్నారని పార్టీ నేతలు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల సీట్ల సర్దుబాటుపై ఇప్పటికే మాధవ్, చంద్రబాబు మధ్య సమావేశం జరిగినట్లు వెల్లడించారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీల మధ్య స్థానాల సర్దుబాటుపై చర్చించనున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఏ పార్టీ ఎక్కడ పోటీ చేస్తుంది, ఎలాంటి వ్యూహాలు అనుసరించాలనే దానిపై చర్చిస్తున్నట్లు సమాచారం. కార్పొరేషన్లలో మేయర్ అభ్యర్థుల ఎంపికపై చర్చ జరగనుంది. ఏపీ ప్రభుత్వం బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది.

## బిజినెస్

# ప్రాపర్టీ రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ మధ్య తేడా ఏంటి?

## ఐఏఎఫ్ కాంట్రాక్టు లభిస్తే.. భారత్‌లో విమానాల తయారీ!



**వాషింగ్టన్/ఢిల్లీ:** భారత వాయుసేన (ఐఏఎఫ్) కోసం మధ్య తరహా రవాణా విమానాల సరఫరా కాంట్రాక్ట్ కనుక తమకు లభిస్తే, భారత్‌లో తమ ఉత్పత్తి సామర్థ్యాలను మరింత విస్తరించేందుకు సిద్ధంగా ఉన్నామని అమెరికా దిగ్గజ సంస్థ లాక్‌హీడ్ మార్టిన్ సీనియర్ అధికారి వెల్లడించారు. 60 మధ్య తరహా రవాణా విమానాలు కొనుగోలు చేసేందుకు 10.5 బిలియన్ డాలర్ల (సుమారు రూ.లక్ష కోట్ల) అంచనా వ్యయంతో, మనదేశం ఆగస్టులో టెండర్ జారీ చేసింది. ఈ కాంట్రాక్ట్ కోసం టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ (టీఏఎస్ఎల్), మహీంద్రా గ్రూప్, అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్), రిలయన్స్ డిఫెన్స్ సంస్థలు పోటీలో ఉన్నాయి. ఈ భారతీయ సంస్థలు అంతర్జాతీయ విమాన తయారీ సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకుని, ఈ ప్రాజెక్టు బిడ్డింగ్‌లో పాల్గొంటున్నాయి.

**హైదరాబాద్‌లో ఇప్పటికే**

లాక్‌హీడ్ మార్టిన్‌కు టీఏఎస్ఎల్‌తో దీర్ఘకాలంగా భాగస్వామ్యం ఉంది. హైదరాబాద్-వడోదరలో టాటాతో కలిసి సంయుక్తంగా నెలకొల్పిన టాటా లాక్‌హీడ్ మార్టిన్ ఏరోస్ట్రక్చర్స్ లిమిటెడ్ (టీఎల్ఎంఏఎల్) ప్లాంట్లున్నాయి. సీ-130జే విమానాలకు వివిధ విడిభాగాలు, వెనుక భాగంలోని నిర్మాణాలను తయారు చేస్తున్నట్లు లాక్‌హీడ్ మార్టిన్ గ్లోబల్ బిజినెస్ డెవలప్‌మెంట్ - స్ట్రాటజీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డాన్ టెన్నీ తెలిపారు. కొత్త ఆర్డర్ లభిస్తే ఈ సామర్థ్యాన్ని మరింత విస్తరించనున్నట్లు ఆయన చెప్పారు. విమానాల తయారీతో పాటు ఇతర కార్యకలాపాలు కూడా భారత్‌లోనే జరిగేలా చూస్తామన్నారు. లాక్‌హీడ్ మార్టిన్ ప్రతిపాదన ప్రకారం మొత్తం 60 విమానాల్లో 12 విమానాలను పూర్తిగా సిద్ధం చేసిన స్థితిలో భారత్‌కు అందిస్తారు. మిగిలిన 48 విమానాలను భారత్‌లోనే తయారు చేస్తామని కంపెనీ ప్రతిపాదించింది. భారత వైమానిక దళం (ఐఏఎఫ్) ఇప్పటికే వినియోగిస్తున్న 12 సీ-130జే విమానాలను కూడా అధునాతన కాన్ఫిగరేషన్‌కు అప్‌గ్రేడ్ చేస్తామనీ లాక్‌హీడ్ మార్టిన్ ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదన అమలైతే, ఐఏఎఫ్ వద్ద ఒకే రకమైన అధునాతన కాన్ఫిగరేషన్ కలిగిన మొత్తం 72 విమానాలుంటాయి. ప్రస్తుతం ఐఏఎఫ్ వినియోగిస్తున్న సీ-130జే విమానాలు ఇప్పటివరకు 58,000కు పైగా విమాన ప్రయాణ గంటలను పూర్తి చేశాయి. లద్దాఖ్‌లోని అత్యంత ఎత్తైన ప్రాంతాల్లో ఇవి కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. నేపాల్‌లో వరదల సమయంలో సహాయక చర్యలు, 2023లో సూడాన్‌లో చిక్కుకున్న భారతీయులను స్వదేశానికి తరలించే ఆపరేషన్ వంటి కీలక మిషన్లలో ఈ విమానాలను ఉపయోగించారు.

**రిజిస్ట్రేషన్**

మీరు ఏదైనా స్థిరాస్తి కొన్నప్పుడు ప్రభుత్వం వద్ద నమోదు ద్వారా చట్టబద్ధంగా దాని యాజమాన్య హక్కుల్ని బదిలీ చేసుకోవడం అవసరం. కేవలం కొన్నదేగాక, మీకు వారసత్వంగా వచ్చినా, బహుమతి రూపం లో అందినా, వీలునామా ద్వారా సంక్రమించినా ప్రాపర్టీ రిజిస్ట్రేషన్ తప్పనిసరి. ప్రాపర్టీ యజమాని బదిలీ చేస్తే తప్ప.. మీరు సదరు ఆస్తికి యజమాని కాలేరుమరి. ఇక ఆస్తి విలువ రూ.100 దాటితే భారతీయ రిజిస్ట్రేషన్ చట్టం-1908లోని సెక్షన్ 17 కింద ఆ ఆస్తిని రిజిస్టర్ చేయించాల్సిందే. సేల్ డీడ్, వీలునామా, గిఫ్ట్ డీడ్ తదితర యాజమాన్య ధ్రువీకరణ పత్రాలతోపాటు ఆధార్ ఇతర గుర్తింపు పత్రాలు ఇందుకు అవసరమవుతాయి. స్థిరాస్తి ఎక్కడ ఉన్నదో ఆ పరిధిలోని సబ్-రిజిస్ట్రార్ ఆఫీస్‌లో సాక్షుల సమక్షంలో కొన్నవారు, అమ్మినవారు సంబంధిత డాక్యుమెంట్లను సమర్పించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చు. అయితే పేర్కొన్న రిజిస్ట్రేషన్ ఫీజు, స్టాంప్ డ్యూటీలను చెల్లించాల్సి ఉంటుంది.

**మ్యుటేషన్**

ప్రభుత్వ భూ రెవిన్యూ రికార్డుల్లో ఆస్తి యజమాని పేరును మార్చడమే మ్యుటేషన్ ప్రక్రియ. ప్రాపర్టీ రిజిస్ట్రేషన్ పూర్తయ్యాకే మ్యుటేషన్‌కు వీలుంటుంది. సంబంధిత పత్రాలను సమర్పించి, మ్యుటేషన్ ఫీజు చెల్లిస్తే స్థానిక మున్సిపల్ కార్యాలయాల్లో పని జరుగుతుంది. ఆస్తి పన్ను, నీరు, విద్యుత్తు, గ్యాస్ కనెక్షన్ల కోసం కూడా ఇది తప్పనిసరి.




తర్వాత రోజుల్లో కొన్న ఆస్తిని తిరిగి అమ్ముకోవాలన్నా ఈ మ్యుటేషన్ ముఖ్యం. పైగా ఈ ప్రాపర్టీ రిజిస్ట్రేషన్, మ్యుటేషన్‌లు ఆస్తుల తగాదాలనూ నివారించగలవు.

## ఈఎంఐలు భారం కానున్నాయా? ఆర్‌బీఐ వడ్డీ రేట్లు పెంచే ఛాన్స్

**ముంబయి:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలకమైన రెపోరేటును పెంచే అవకాశం ఉంది. అక్టోబర్ నెల ద్రవ్యపరపతి విధాన సమీక్షలో రెపోరేటును 0.25 శాతం మేర పెంచుతూ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని ఆర్థిక విశ్లేషకులు, బ్యాంకర్లు అభిప్రాయపడుతున్నారు. పశ్చిమాసియాలో అనిశ్చిత పరిస్థితుల కారణంగా నెలకొన్న ద్రవ్యోల్బణ భయాలకు తోడు, ఇతర కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లు సవరిస్తుండడమే ఇందుక్కారణమని పేర్కొంటున్నారు. ఒకవేళ విశ్లేషకులు ఊహించినట్లే ఆర్‌బీఐ వడ్డీ రేట్లు సవరిస్తే.. రెపోరేటుతో ముడిపడి ఉన్న గృహ, వాహన రుణాలు ప్రియం కానున్నాయి. ఆ మేర నెలవారీ చెల్లించే ఈఎంఐలు భారం కానున్నాయి. 2023 ఫిబ్రవరిలో చివరిసారిగా ఆర్‌బీఐ వడ్డీ రేట్లను పెంచింది. దీంతో అప్పట్లో రెపోరేటు 6.50 శాతానికి చేరింది. ఆపై 2023-24లో స్థిరంగా కొనసాగించింది. 2025లో వరుసగా వడ్డీ రేట్లు తగ్గించిన ఆర్‌బీఐ.. పశ్చిమాసియా పరిస్థితుల నేపథ్యంలో స్థిరంగా కొనసాగిస్తోంది. ప్రస్తుతం రెపో రేటు 5.25 శాతంగా ఉంది. అక్టోబర్ నెలకు సంబంధించిన ఎంపీసీ భేటీలో రెపోరేటుపై నిర్ణయం తీసుకోనుంది. బుధవారం నిర్ణయం వెలువడనుంది.

**పాత ప్రీమియం కార్లను కొనేద్దాం**

ప్రపంచవ్యాప్తంగా ఉన్న కేంద్ర బ్యాంకులతో సమానంగా ఆర్‌బీఐ కూడా వడ్డీ రేట్లు సవరించవచ్చని పలువురు ఆర్థిక నిపుణులు పేర్కొన్నారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, వృద్ధి ఊపందుకోవడం వంటివి ఇందుకు కారణాలని చెబుతున్నారు. ముఖ్యంగా పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తతలు తలెత్తడం వల్ల ఇంధనం, కమోడిటీ ధరలు పెరుగుతున్నాయని, దీనివల్ల మరోసారి రెపోరేటు పెంచొచ్చని అభిప్రాయపడుతున్నారు. పీటీఐ నిర్వహించిన పోల్‌లో మెజారిటీ ఆర్థిక నిపుణులు ఇదే తరహా అభిప్రాయం వ్యక్తంచేశారు. అయితే, మరోసారి స్టేటస్ కో కొనసాగించే




అవకాశమూ లేకపోలేదని మరో ఆర్థికవేత్త అభిప్రాయపడ్డారు. డిమాండ్ ఆధారిత ద్రవ్యోల్బణం ఇంకా ఊపందుకోని కారణంగా మరికొంతకాలం వేచి చూసే ధోరణిని ఆర్‌బీఐ అవలంబించొచ్చని అభిప్రాయం వ్యక్తంచేశారు.

# ఖతార్‌లో కలుద్దాం..

## అట్టహాసంగా ముగిసిన ఆసియా గేమ్స్

**నగోయా (జపాన్) :** రెండు వారాల పాటు వేలాది మంది ఆసియా క్రీడాకారుల హోరాహోరీ పోరాటాలకు వేదికగా నిలిచిన 20వ ఆసియా గేమ్స్‌కు తెరపడింది. నగోయాలోని మిజుహో పార్క్ అథ్లెటిక్ స్టేడియంలో ఆదివారం సాయంత్రం 90 నిమిషాల పాటు సాగిన ముగింపు వేడుకలు కనువిందు చేశాయి. ఒలింపిక్ కౌన్సిల్ ఆఫ్ ఆసియా (ఓసీఏ) అధ్యక్షుడు షేక్ జోఆన్ బిన్ హమద్ అల్ థానీ క్రీడలు ముగిసినట్లు అధికారికంగా ప్రకటించారు. అనంతరం ఓసీఏ పతాకాన్ని 2030 ఎడిషన్‌కు ఆతిథ్యం ఇచ్చే ఖతార్‌లోని దోహా నగర ప్రతినిధులకు అధికారికంగా అందజేశారు. ఖతార్ హైజంప్ దిగ్గజం ముతాజ్ బార్షిమ్ నుంచి ఈక్వెస్ట్రియన్ రైడర్ జాసిమ్ అల్ కువారీ ఆసియాడ్ పతాకాన్ని స్వీకరించాడు.ముగింపు వేడుకలకు ప్రధాన ఆకర్షణగా నిలిచిన అథ్లెట్ల పరేడ్‌లో భారత ట్రాప్ షూటర్ నీరూ ధండా త్రివర్ణ పతాకాన్ని చేతిలో పట్టుకుని ముందు నడిచింది. తెలుపు, నీలం రంగు దుస్తులు ధరించిన సుమారు 30 మంది భారత అథ్లెట్లు, అధికారులు ఈ మార్చ్‌పాస్ట్‌లో పాల్గొన్నారు. 'వన్ ఆసియా' అనే ఇతివృత్తంతో రూపొందించిన వేదికపై జపాన్ సాంప్రదాయ 'బాన్-ఒడోరి' నృత్యాలు, 'మత్సుకెన్ సాంబా2' ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



**ఆరంభ లోపాలను దాటి**

ఈసారి ఆసియా క్రీడల నిర్వహణలో జపాన్ భిన్నమైన వ్యూహాన్ని అనుసరించింది. భారీ ఖర్చులతో ప్రత్యేకంగా అథ్లెట్స్ విలేజ్‌లు, కొత్త స్టేడియంలు నిర్మించకుండా.. అందుబాటులో ఉన్న వేదికలు, తాత్కాలిక నిర్మాణాలతో తక్కువ ఖర్చుతో క్రీడలను నిర్వహించింది. ఆరంభంలో హోటల్ వసతి సమస్యలు, రవాణా ఆలస్యం, అక్రిడిటేషన్ గందరగోళం ఎదురైనప్పటికీ.. నిర్వాహకులు త్వరగానే లోపాలను సరిదిద్ది పోటీలను విజయవంతంగా ముగించారు. 45 దేశాల నుంచి దాదాపు 11 వేల మంది అథ్లెట్లు పాల్గొన్న పోటీల్లో 54 ప్రపంచ రికార్డులు, 89 ఆసియా రికార్డులు బ్రేక్ అవడంతో ఈ ఆసియాడ్ సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది.

## డివిలియర్స్ విధ్వంసం.. విండీస్‌పై సౌతాఫ్రికా భారీ స్కోరు



వరల్డ్ చాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ (డబ్ల్యూసీఎల్) 2026 టోర్నీలో భాగంగా వెస్టిండీస్ చాంపియన్స్‌తో జరుగుతున్న టీ20 మ్యాచ్‌లో సౌతాఫ్రికా చాంపియన్స్ భారీ స్కోరు సాధించింది. కెప్టెన్ ఏబీ డివిలియర్స్ (39 బంతుల్లో 70; 4 ఫోర్లు, 5 సిక్సర్లు), ఓపెనర్ రిచర్డ్ లెవీ (39 బంతుల్లో 87; 5 ఫోర్లు, 8 సిక్సర్లు) భారీ అర్ధశతకాలతో విధ్వంసం సృష్టించారు. వీరిద్దరి బీభత్సం ధాటికి సౌతాఫ్రికా చాంపియన్స్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 242 పరుగులు చేసింది. చివర్లో సారెల్ ఎర్వీ (23) ధాటిగా ఆడాడు. వెస్టిండీస్ చాంపియన్స్ బౌలర్లలో దేవ్ మొహమ్మద్ రెండు వికెట్లు తీయగా, ఫిడెల్ ఎడ్వర్డ్స్, రెయాడ్ ఎమ్రిట్, డ్వేన్ బ్రావో తలా ఒక వికెట్ తీశారు. ముందుగా రిచర్డ్ లెవీ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. ఫోర్లు, సిక్సర్లతో మైదానం హోరెత్తించాడు. అగ్నికి వాయువు తోడైనట్లు లెవీకి డివిలియర్స్ జత కలవడంతో స్కోరుబోర్డు ఉరకలెత్తింది. ఈ ఇద్దరు రెండో వికెట్‌కు 42 బంతుల్లోనే 104 పరుగులు సాధించి సౌతాఫ్రికా భారీ స్కోరుకు బాటలు వేశారు. లెవీ ఔటైనప్పటికీ, సారెల్ ఎర్వీతో కలిసి డివిలియర్స్ జట్టు స్కోరును 200 దాటించాడు.

## స్పోర్ట్స్

## ముకేష్ వికెట్ల వేట.. 30వసారి 'ఇరానీ' విజేతగా రెస్టాఫ్ ఇండియా..!



భారత వన్డే జట్టులో చోటు కోల్పోయిన రిషభ్ పంత్ దేశవాళీ క్రికెట్‌లో సత్తా చాటాడు. ఆటగాడిగా ధనాధన్ బ్యాటింగ్‌తో అలరించే పంత్ ఈసారి కెప్టెన్‌గా రెస్టాఫ్ ఇండియా(=వర్ ాట ×అఎఖు)కు టైటిల్ అందించాడు. ఇరానీ కప్ (×త్ఖుఅఱ జబజూ) ఫైనల్లో ముకేశ్ కుమార్(2-84, 33-6) ఎనిమిది వికెట్లతో విరచుకుపడగా.. పంత్ సారథ్యంలోని రెస్టాఫ్ ఇండియా 167 పరుగుల తేడాతో జమ్ము కశ్మీర్‌ను ఓడించింది. దాంతో రికార్డు స్థాయిలో ముప్పయ్యోసారి ట్రోఫీని ముద్దాడింది. ఇరానీ ట్రోఫీ 2026-27 ఫైనల్లో రెస్టాఫ్ ఇండియా అదరగొట్టింది. రెండో ఇన్నింగ్స్‌లో ఓపెనర్ సనత్ సాంగ్వన్(55) అర్ధ శతకంతో శుభారంభమివ్వగా.. స్మరణ్ రవిచంద్రరన్(135) సూపర్ సెంచరీతో కదం తొక్కాడు. అనంతరం 279 పరుగుల ఛేదనలో జమ్ము కశ్మీర్ బ్యాటర్లను పేసర్ ముకేశ్ కుమార్ (2-84, 33-6) వణికించాడు. బుల్లెట్ బంతులతో నిప్పులు చెరిగిన ముకేశ్ ఏకంగా ఆరుగుని ఔట్ చేసి ప్రత్యర్థిని కోలుకోలేని దెబ్బతీశాడు. దాంతో.. జమ్ము 111 రన్స్‌కే కుప్పకూలింది. ఆల్‌రౌండ్ షోతో కనబరిచి 167 పరుగుల తేడాతో గెలుపొందిన రెస్టాఫ్ ఇండియా 30వ సారి ఈ టోర్నీలో ఛాంపియన్‌గా నిలిచింది. తద్వారా జట్టుకు ట్రోఫీ కట్టబెట్టిన రెండో వికెట్ కీపర్‌గా పంత్ గుర్తింపు సాధించాడు. ఖతర్నాక్ శతకంతో విజయంలో భాగమైన స్మరణ్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికయ్యాడు.



# విశ్వక్‌సేన్ ‘కల్ట్’ విడుదల అప్పుడే

విశ్వక్‌సేన్ స్వీయ దర్శకత్వంలో నటిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘కల్ట్’. తారక్ సినిమా పతాకంపై సందీప్ కాకరాల భారీ టెక్నాలజీతో నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్‌ని పూర్తి చేసుకున్నది. హైదరాబాద్ ఆర్‌ఎఫ్‌సీలో నిర్మించిన భారీసెట్‌లో వందలాది మోడల్స్‌తో 40-50 రోజుల పాటు జరిగిన కీలక సన్నివేశాల చిత్రీకరణతో షూటింగ్ పూర్తయిందని మేకర్స్ తెలిపారు. భారతీయ భాషలతోపాటు విదేశీ భాషల్లో కూడా ఈ సినిమాను విడుదల చేస్తున్నామని, ఈనెల 30న ప్రపంచవ్యాప్తంగా ‘కల్ట్’ విడుదల కానున్నదని మేకర్స్ చెప్పారు. గాయత్రి భరద్వాజ్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి మురళీశర్మ, శ్రీకాంత్ అయ్యంగార్, తారక్ పొన్నప్ప, ప్రజ్ఞ ఇతరపాత్రధారులు. ఈచిత్రానికి మాటలు: తరుణ్‌భాస్కర్, సౌండ్ డిజైన్: ‘యానిమల్’ఫేం సచిన్.

# ఓ వైపు శాంతం మరోవైపు రౌద్రం

ప్రస్తుతం సాయిపల్లవికి మహర్దశ నడుస్తున్నది. ఒక కథానాయికగా దేశవ్యాప్తంగా తిరుగులేని గుర్తింపు రావడం అరుదైన విషయం. అన్ని భాషలకు చెందిన ప్రేక్షకులూ తమ హీరోయిన్‌గా ఓన్ చేసుకోవడం ఈ మధ్య సాయిపల్లవి విషయంలోనే జరిగిందని చెప్పక తప్పదు. వచ్చే నెలలో రెండు వారాల తేడాతో ఆమె సినిమాలు రాబోతున్నాయి. వాటిలో మొదటిది నితీష్ తివారీ ‘రామాయణ: పార్ట్ 1’. ఈ పాన్ ఇండియా పౌరాణిక దృశ్యకావ్యంలో సాయిపల్లవి సీతామహాసాధ్విగా కనిపించనున్నారు. సరిగ్గా ఈ సినిమా విడుదలైన రెండు వారాలకు, అంటే.. నవంబర్ 20న ధనుష్ హీరోగా రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో రూపొందుతున్న ‘ఓం: చాప్టర్ 1’ విడుదల కానున్నది. ఇందులో సాయిపల్లవిది కీలకమైన పాత్ర. యాక్షన్, ఎమోషన్స్‌తో ఆమె పాత్ర సాగుతుందని సమాచారం. రెండు వారాల గ్యాప్‌తో రెండు పొంతన లేని పాత్రల ద్వారా ప్రేక్షకులకు భిన్నమైన అనుభూతిని సాయిపల్లవి పంచనున్నదని సినీవర్గాలు అంటున్నాయి. ఈ ప్రయత్నాలు రెండూ ఫలిస్తే.. సాయిపల్లవి క్రేజ్ దేశవ్యాప్తంగా మరింత పెరగడం ఖాయమని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.



# మట్టితో మమేకమైన కూలీ కథ

హీరో శర్వానంద్ నటిస్తున్న ఇంటెన్స్ పీరియడ్ యాక్షన్ డ్రామా ‘భోగి’. సంపత్‌నంది దర్శకుడు. కేకే రాధామోహన్ నిర్మాత. ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకున్నది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా జరుగుతున్నాయి. ప్రమోషన్స్‌లో భాగంగా ఈసినిమా టీజర్‌ని ఆదివారం మేకర్స్ విడుదల చేశారు. గ్రామీణ జానపద శైలిలో సాగే వాయిస్ ఓవర్‌తో టీజర్ మొదలైంది. బొగ్గుల గుట్ట అనే గ్రామాన్ని అక్కడి నాగరికతనూ, పగలు, ప్రతీకారాలు, భక్తి, మూఢ విశ్వాసాల నేపథ్యంలో టీజర్ సాగింది. శర్వా రఫ్ అండ్ రగ్డ్ లుక్‌లో మట్టితో మమేకమైన ఓ సాధారణ కూలీగా కనిపించారు. అనుపమ పరమేశ్వరన్ పాత్ర కూడా సీరియస్ మోడ్‌లో ఆసక్తిని రేకెత్తించేలా ఉన్నది. 1960ల ప్రారంభంలో తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులోని ఓ కల్పిత గ్రామం నేపథ్యంలో సాగే ఈ కథను దర్శకుడు సంపత్‌నంది ఎంతో సహజంగా, నేటివిటితో తెరకెక్కిస్తున్నట్టు టీజర్ చెబుతున్నది. రా, ఇంటెన్స్, రూటెడ్ ప్రపంచాన్ని టీజర్ ఆవిష్కరించింది. డింపుల్ హయాతీ మరో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: కిశోర్‌కుమార్ అరోకియా, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, సమర్పణ: లక్ష్మీ రాధామోహన్, నిర్మాణం: శ్రీసత్యసాయి ఆర్ట్స్.






# ‘చకోర’ ఓ అమ్మ చెప్పిన కథ

శ్రవణ్, మలైకా టి వాసుపల్ జంటగా నటించిన చిత్రం ‘చకోర -- లూనార్ లవ్ బర్డ్’. మంగా శ్రీనివాస్ దర్శకుడు. చింతాడ హేమారావు నిర్మాత. అక్టోబర్ 9న సినిమా థియేట్రికల్ రిలీజ్ కానున్నది. ఈ సందర్భంగా ప్రీరిలీజ్ ఈవెంట్ వైజాగ్‌లో జరిగింది. ప్రముఖ దర్శకుడు శివ నిర్వాణ అతిథిగా విచ్చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. ‘ఇదొక అమ్మ చెప్పిన ప్రేమకథ. కేవలం వర్షపునీళ్లతోనే దాహం తీర్చుకునే విశిష్టమైన పక్షి చకోర. ఆ పక్షిలాగే మనం కూడా స్వచ్ఛమైన పేమ కోసమే వేచి చూడాలని, అలాగే.. చకోర పక్షికి జాబిల్లిని చేరాలని కోరిక. దాని కోసం అలుపెరగకుండా ప్రయాణిస్తుంది. ఆ ప్రయత్నంలోనే మరణిస్తుంది. మనం కూడా చకోర పక్షిలా లక్ష్యాన్ని చేరుకునేందుకు అవిశ్రాంతంగా శ్రమించాలని ఈ సినిమా ద్వారా చెబుతున్నాం’ అని దర్శకుడు మంగా శ్రీనివాస్ అన్నారు. ఈ సినిమాలో భాగం కావడం పట్ల హీరోహీరోయిన్లు శ్రవణ్, మలైకా ఆనందం వెలిబుచ్చారు. ఇంకా చిత్రబృందం అంతా మాట్లాడారు.

# ‘చట్టం ప్రజలకు అర్థమయ్యేలా ఉండాలి

న్యాయవ్యవస్థ పనితీరులో కరుణ, మానవత్వాల పాత్రను నొక్కి చెబుతూ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. చట్టం ప్రాథమిక బాధ్యత అది ఎవరిని పాలిస్తుందో ఆ ప్రజలకు సులభంగా అర్థం కావడం, అలానే ప్రజలను ఆ చట్టం కూడా అర్థం చేసుకోవడమేనని వ్యాఖ్యానించారు. ఇక్కడ చట్టం అనేది ప్రజల కష్టాలను, వారి పరిస్థితులను కూడా అర్థం చేసుకోవాలని ఉద్దేశం వచ్చేలా మాట్లాడారు. ఈ సందర్భంగా కోర్టు తీర్పులలో మానవీయ కోణానికి ప్రాధాన్యం ఇవ్వాలని జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. ప్రొఫెసర్ (డాక్టర్) ఎన్ ఆర్ మాధవ్ మీనన్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన మెమోరియల్ లెక్చర్ (స్మారక ఉపన్యాసం) కార్యక్రమంలో పాల్గొని ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. న్యాయమూర్తులు తీర్పులు ఇచ్చే సమయంలో కేసు వెనుక ఉన్న పూర్తి మానవీయ కోణాల్ని కూడా చూడాలని సూచించారు. ‘మొదట తీర్పులు ఇచ్చేటప్పుడు కరుణ అంటే ఏంటో మనం తెలుసుకోవాలి. న్యాయ నిర్ణయాలలో కరుణ చూపడం అంటే కేవలం సానుభూతి చూపడమూ, ఉదారతనో కాదు. తీర్పును ఒక వైపునకు మొగ్గు చూపేలా చేసేది అంతకన్నా కాదు. ఒక కేసు వెనుక ఉన్న పూర్తి మానవీయ పరిస్థితుల్ని క్రమశిక్షణతో చూసే నిబద్ధత. న్యాయ నిర్ణయాల్లో కరుణ లేకపోతే చట్టం కేవలం కాగితాల మీద రూల్స్ మాట్లాడే ఒక కఠినమైన వ్యవస్థగా మారిపోతుంది’ న్యాయవ్యవస్థలో కనిపించని బాధితులపై కూడా దృష్టి పెట్టాలని సీజేఐ సూచించారు. లైంగిక హింసకు గురైన వ్యక్తులు, విచారణ ఎదుర్కొంటున్న ఖైదీల కుటుంబాలు, దివ్యాంగులు వంటి వారి పరిస్థితులను కూడా న్యాయ ప్రక్రియలో పరిగణనలోకి తీసుకోవాలని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ చెప్పారు. వారి వాదనలు కోర్టు రికార్డులకు చేరకపోయినా వారి ఆవేదనను ఆలకించాల్సిన బాధ్యత న్యాయమూర్తులపై ఉందన్నారు. ఇంకా న్యాయస్థానాల్లో వాదనలు, వెలువడే తీర్పులు



పిటిషనర్లకు సులభంగా అర్థమయ్యే భాషలో ఉండాలని ఇంకా పోలీస్ స్టేషన్ల స్థాయిలోనే న్యాయ సహాయం అందాలని ఆయన పిలుపునిచ్చారు.

**సాంకేతికత న్యాయాన్ని వేగవంతం చేయొచ్చు కానీ!**

ఇదే కార్యక్రమంలో నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ జస్టిస్ విక్రమ్ నాథ్ కూడా కీలక వ్యాఖ్యలు చేశారు. న్యాయమూర్తులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి అంతేకానీ న్యాయం విషయంలో ఏమాత్రం ఉదాసీనంగా వ్యవహరించొద్దని అన్నారు. ఇంకా న్యాయ ప్రక్రియలో సాంకేతికత కీలక పాత్ర పోషించగలదని చెప్పిన ఆయన అది ప్రక్రియను వేగవంతం చేయగలదేమో కానీ న్యాయమైన తీర్పును ఇవ్వలేదని అభిప్రాయపడ్డారు. టెక్నాలజీ మానవీయ కోణంలో ఆలోచించలేదని వ్యాఖ్యానించారు. మానవ మేధస్సును, న్యాయమూర్తి జీవిత కాలంలో సంపాదించిన అనుభవాన్ని సాంకేతికత భర్తీ చేయలేదని స్పష్టం చేశారు. అందుకే న్యాయమూర్తులకు టెక్నాలజీ ఎప్పటికీ ప్రత్యామ్నాయం కాలేదని పేర్కొన్నారు

**సుప్రీంకోర్టుకు ముగ్గురు కొత్త న్యాయమూర్తులు**

ఇదెలా ఉండగా, కేంద్ర ప్రభుత్వం సోమవారం రోజు దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టులో ముగ్గురు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులను నియమిస్తున్నట్లు నోటిఫికేషన్ విడుదల చేసింది. నియామకాలపై కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ సోషల్ మీడియా ద్వారా అధికారిక ప్రకటన చేశారు. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని సుప్రీం కోర్టు కొలిజీయం సెప్టెంబర్ 28న చేసిన సిఫార్సులకు కేంద్రం ఆమోద ముద్ర వేసింది. తాజాగా ముగ్గురు న్యాయమూర్తుల నియామకంతో సుప్రీం కోర్టులో పనిచేస్తున్న న్యాయమూర్తుల సంఖ్య 37కు చేరింది. సుప్రీం కోర్టు మంజూరు చేసిన మొత్తం న్యాయమూర్తుల పోస్టుల సంఖ్య 38 కాగా, ఒక స్థానం ఖాళీగా ఉంది.

జస్టిస్ సునీతా అగర్వాల్– 1990లో న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించిన ఈమె, 2011లో అలహాబాద్ హైకోర్ట్ జడ్జిగా పదోన్నతి పొందారు. 2023 జులై నుంచి గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈమె నియామకంతో సుప్రీం కోర్టులో మహిళా న్యాయమూర్తుల సంఖ్య మూడుకు చేరింది. జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ– 2011లో అలహాబాద్ హైకోర్టు జడ్జిగా బాధ్యతలు స్వీకరించిన ఈయన, అంతకుముందు ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వ చీఫ్ స్టాండింగ్ కౌన్సిల్‌గా సేవలందించారు. 2023 జులైలో బాంబే హైకోర్టు సీజేగా, తర్వాత 2025 జనవరి నుంచి దిల్లీ హైకోర్టు సీజేగా పనిచేస్తున్నారు. జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్– దిల్లీ యూనివర్సిటీ నుంచి న్యాయ విద్య పూర్తి చేసి పట్నా, ఝార్ఖండ్ హైకోర్టుల్లో ప్రాక్టీస్ చేశారు. 2012లో తొలిసారి ఝార్ఖండ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. రెండేళ్లకు శాశ్వత న్యాయమూర్తి హోదాను పొందారు. 2023 ఏప్రిల్‌లో త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, తర్వాత 2025 జులై నుంచి తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సేవలందిస్తూ వచ్చారు.

## భారత్-అమెరికా వాణిజ్య చర్చల్లో స్తబ్దత ఏర్పడింది

భారత్, అమెరికాల మధ్య కొంతకాలంగా కొనసాగుతున్న వాణిజ్య ఒప్పంద చర్చలు దాదాపుగా తుది దశకు చేరుకున్నప్పటికీ, ప్రస్తుతం అవి ప్రతిష్టంభనలో ఉన్నట్లు కనిపిస్తున్నాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య వాణిజ్యం ప్రస్తుతం భారత్‌కు అనుకూలంగా ఉండటంతో, ఆ లోటును తగ్గించుకోవడానికి అమెరికా తీవ్రంగా ప్రయత్నిస్తోందని ఆమె వెల్లడించారు. సోమవారం ఢిల్లీలో నిర్వహించిన ‘మ్యూనిచ్ లీడర్స్ మీటింగ్ 2026’లో ఆమె మాట్లాడారు. “వాణిజ్య ఒప్పందం కోసం ఇరు దేశాలు పట్టుదలగా చర్చలు జరిపాయి. ప్రస్తుతం ఇచ్చిపుచ్చుకునే ధోరణికి అతీతంగా చర్చలను ముందుకు తీసుకెళ్లడం కష్టతరంగా మారింది” అని ఆమె అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ, ఈ చర్చలను మరింత ముందుకు తీసుకెళ్లే అవకాశాలను ఇరుపక్షాలు అన్వేషించవచ్చని సూచించారు. భారత్‌తో వాణిజ్యం వల్ల తమకు ఏళ్లుగా నష్టం జరుగుతోందన్న అమెరికా ఆందోళన ఈ చర్చల్లో స్పష్టంగా ప్రతిబింబిస్తోందని ఆమె తెలిపారు. ఫిబ్రవరి 2026లో ప్రకటించిన మధ్యంతర వాణిజ్య ఒప్పంద ముసాయిదా ప్రాతిపదికన ఈ చర్చలు కొనసాగుతున్నాయి. ఇదే క్రమంలో భారత్–యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందాన్ని ఆమె ఒక విజయవంతమైన ఉదాహరణగా పేర్కొన్నారు. యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ అభివర్ణించినట్లుగా ఇది ‘తల్లి లాంటి ఒప్పందం’ అని ఆమె కొనియాడారు. ఈ ఒప్పందంలో భాగంగా భారత్ 92.5 శాతం టారిఫ్ లైన్లను, 97 శాతం వాణిజ్య విలువను అందుబాటులోకి తెస్తే, ఈయూ తన వైపు నుంచి 97 శాతం టారిఫ్ లైన్లను, 99 శాతం వాణిజ్య విలువను విముక్తం చేసిందని ఆమె వివరించారు.

## ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు నోటీసులు?



ఎన్నికల సంఘం తీసుకునే నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగా లేదా మెజారిటీ సభ్యుల ఆమోదంతోనే ఉండాలని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్నవారు ఎల్లప్పుడూ చట్టప్రకారం నడుచుకోవాలని హితవుపలికింది. ఫారం 6లో మార్పులను తాము ఆమోదించలేదని సుప్రీంకోర్టు వెల్లడించింది. ఎన్నికల సంఘంలో సీఈసీ జ్ఞానేష్ కుమార్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని, ఈ వ్యవహారంపై విచారణ పూర్తయ్యే వరకు ఆయనను సస్పెండ్ చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం విచారణకు స్వీకరించింది. ఈ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వంతో పాటు కేంద్ర ఎన్నికల సంఘానికి నోటీసులు జారీచేసింది. వారం రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని నోటీసుల్లో ఆదేశించింది. అలాగే సీఈసీ, ఈసీలకు చట్టపరంగా ఇచ్చిన ప్రాసిక్యూషన్ మినహాయింపు చెల్లుబాటుపై కూడా విచారణ జరుపుతామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఒకవేళ ఎన్నికల సంఘం తీసుకున్న ఏ నిర్ణయమైనా చట్టవిరుద్ధమని తేలితే దాన్ని తక్షణమే రద్దు చేస్తామని తేల్చిచెప్పింది. అయితే ఈసీ తీసుకున్న నిర్ణయాలను తాత్కాలికంగా నిలిపివేసేందుకు సుప్రీం నిరాకరించింది.

**ఫారం 6లో మార్పులను ఆమోదించలేదు : సుప్రీం**

మరోవైపు కొత్త ఓటర్ల నమోదు కోసం ఎన్నికల సంఘం (ఈసీ) ఉపయోగించే ఫారం 6లో మార్పులను తాము ఆమోదించలేదని సుప్రీంకోర్టు సోమవారం వెల్లడించింది. 2025లో ఈ ఫారంలో ప్రవేశపెట్టిన అనుబంధ పత్రంపై చెలరేగిన వివాదం నేపథ్యంలో కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. అయితే సెప్టెంబర్ 28న విడుదల చేసిన ఒక ప్రకటనలో ఎన్నికల సంఘం ఈ వివాదంపై స్పందిస్తూ ఫారం 6కు జతచేసిన ప్రకటనను సుప్రీంకోర్టు సమర్థించినట్లు తెలిపింది. “ఎస్ఐఆర్ కోసం ఫారం 6కు జతచేసిన డిక్లరేషన్‌ను సుప్రీంకోర్టు సమర్థించింది. ఎస్ఐఆర్ లేని కాలానికి, నిబంధనల (ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ నిబంధనలు 1960) ప్రకారం వర్తించే ఫారాలను ఉపయోగిస్తాం.” అని పేర్కొంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ముందు, సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ వాదనలు వినిపించారు. ఆయన వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం ఈసీకి, కేంద్రానికి నోటీసులు జారీ చేసింది. “ఎన్నికల సంఘం నిర్ణయాలు ఏకగ్రీవంగా లేదా మెజారిటీతో తీసుకోవాలని, అన్ని నిర్ణయాలు ఈ విధంగానే తీసుకున్నారని తాము భావిస్తున్నట్లు” ధర్మాసనం పేర్కొంది.

పట్నాకు చెందిన రాకేశ్ కుమార్ సింగ్ సుప్రీంకోర్టులో ఈ ప్రజాప్రయోజన వ్యాజ్యం వేశారు. ఎన్నికల సంఘానికి చెందిన అన్ని అధికారాలను సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వ్యక్తిగతంగా వినియోగిస్తున్నారా, లేదా అనేది నిర్ధరించాలని న్యాయస్థానాన్ని కోరారు. ఒక వేళ సీఈసీ ఏకాభిప్రాయం లేదా మెజారిటీతో సంబంధం లేకుండా నిర్ణయాలు తీసుకుంటే, వాటిని అనధికారికమైనవిగా ప్రకటించాలని, ఆయనపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ధర్మాసనాన్ని కోరారు. అలాగే “ఈ కేసు తుది విచారణ జరిగే వరకు జ్ఞానేశ్ కుమార్ సీఈసీ విధులు చేపట్టరాదని ఆదేశించాలి. ఈ సమయంలో కమిషన్? కార్యకలాపాలు ఎన్నికల కమిషనర్లు సుఖ్?బీర్? సింగ్?, వివేక్? జోషిల ఏకగ్రీవ నిర్ణయం ద్వారా జరగాలి. ప్రధాన ఎన్నికల కమిషనర్? పదవికి ఎవరినైనా నియమించాలంటే, గౌరవనీయ భారత ప్రధాన న్యాయమూర్తితో కూడిన ఒక కమిటీ సిఫారసు మేరకే అది జరగాలని ఆదేశించాలి” అని పిటిషనర్? పేర్కొన్నారు.

**సీఈసీ ద్రోహం చేశారు!**

సుప్రీంకోర్టు తాజాగా ఈ కేసు విషయమై కేంద్రానికి, ఈసీకి నోటీసు జారీ చేసిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ జ్ఞానేశ్?కుమార్?పై తీవ్ర విమర్శలు చేసింది. ఆయన ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్? షాల ఆదేశాలతో రాజ్యాంగానికి తీరని ద్రోహం చేశారని ఆరోపించింది.

“1. ఎస్?ఐఆర్?ను తాత్కాలికంగా, చట్టవిరుద్ధంగా, అజాగ్రత్తగా నిర్వహిస్తున్న తీరు. 2. సుప్రీంకోర్టులోని ప్రస్తుత, పదవీ విరమణ చేసిన న్యాయమూర్తుల విమర్శలు. 3. సరైన విచారణ లేకుండా విచ్చలవిడిగా ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగించడం. మొదలైన వాటిని ఆధారంగా చేసుకొని, మన గణతంత్ర దేశ సమగ్రతకు కీలకమైన ఎన్నికల సంఘంపై ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించడానికి సుప్రీంకోర్టుకు ఒక అద్భుతమైన అవకాశం ఉంది.”

‘ఎన్నికలు ఎలా నిర్వహించాలనే దానికి తొలి సీఈసీ, దివంగత సుకుమార్? సేన్ మంచి ప్రమాణాలను నెలకొల్పారు. కానీ వాటిలో ఒక్కదాన్నీ ప్రస్తుత సీఈసీ జ్ఞానేశ్ కుమార్? పాటించలేదు. వాస్తవానికి దురుద్దేశపూరితమైన ఫారమ్?–6 సవరణ, అతని నీచమైన, ఏమాత్రం సమర్థించలేని ప్రవర్తనకు ఒక ఉదాహరణ. వాస్తవానికి ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదేశాల మేరకు జ్ఞానేశ్ కుమార్ అబద్దాలు చెప్పడమే కాకుండా, చట్టాన్ని ఉల్లంఘించి, రాజ్యాంగాన్ని అక్షర రూపపంలోనూ, స్ఫూర్తి రూపంలోనూ ద్రోహం చేశారు’ అని జైరాం రమేశ్ తీవ్ర విమర్శలు చేశారు.

**అలా మొదలైంది!**

ఓ ప్రముఖ వార్తాపత్రిక ఈ సెప్టెంబర్? 25న సంచలన కథనాన్ని ప్రచురించింది. అందులో ఈసీఈ జ్ఞానేశ్ కుమార్ ఇతర ఎన్నికల కమిషనర్లకు తెలియకుండా లేదా వారి ఆమోదం లేకుండా ఎస్?ఐఆర్?పై నిర్ణయాలు తీసుకున్నారని, ఉత్తర్వులు జారీ చేశారని రాసింది. అందుకే కాదు వీటిపై ఎన్నికల కమిషనర్లు సుఖ్?బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత 10 నెలల్లో కనీసం 14 సార్లు అభ్యంతరం వ్యక్తం చేశారని పేర్కొంది. దీనిపై స్పందించిన ఎన్నికల కమిషన్?, ఏ సంస్థలో అయినా భిన్నాభిప్రాయాలు ఉండడం సాధారణమేనని పేర్కొంది.

# ఇది అస్థిరత యుగం

ప్రస్తుతం ప్రపంచ పరిణామాలు ఎంతో అనిశ్చితి, ఘర్షణలు, తీవ్ర అస్థిరతతో నిండి ఉన్నాయని, ఈ నేపథ్యంలోనే ప్రపంచం ఫ్లక్స్ యుగంలోకి (నిరంతర మార్పులు, తీవ్ర అస్థిరత) వెళ్తోందని కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ స్పష్టం చేశారు. ఈ సంక్షోభాలతో ఎదురయ్యే సవాళ్లను అధిగమించడమే మన ముందున్న ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రపంచంలో రెండు ప్రధాన ఘర్షణలతో పాటు ఇతర ఉద్రిక్తతలు కూడా కొనసాగుతున్నాయని, టారిఫ్‌లో అనిశ్చితి వాతావరణం నెలకొందని చెప్పుకొచ్చారు. వీటితో పాటు మార్కెట్‌కు సంబంధించినవి కాని ఇతర అంశాల ప్రభావం కూడా పెరుగుతోందన్నారు. అయితే ఈ సవాళ్లను భారత్ సమర్థంగా ఎదుర్కొంటుందన్న నమ్మకం తనకు ఉందన్నారు. న్యూదిల్లీలో 3 రోజుల పాటు జరిగిన 5వ కౌటిల్య ఎకనామిక్ కాన్‌క్లేవ్ ముగింపు కార్యక్రమంలో జైశంకర్ ఇలా మాట్లాడారు. ‘రెసిలెన్స్ ఇన్ ఆన్ ఏజ్ ఆఫ్ ఫ్లక్స్’ అనే థీమ్‌తో ఈ సదస్సు నిర్వహించారు. ఇందులో సింగపూర్ మాజీ విదేశాంగ మంత్రి జార్జ్ యోంగ్ బూన్ యోతో కలిసి జైశంకర్ ఇంటరాక్టివ్ సెషన్‌లో పాల్గొన్నారు. ఈ క్రమంలోనే ఆయన ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితులపై కీలక వ్యాఖ్యలు చేశారు.

‘ప్రపంచం తీవ్ర మార్పులకు (అస్థిరత) లోనవుతోంది. వివిధ దేశాల మధ్య ఘర్షణలు, ఉద్రిక్తతలు, సుంకాలలో వస్తున్న హెచ్చుతగ్గులు అంతర్జాతీయ పరిస్థితుల్ని అల్లకల్లోలంగా మారుస్తున్నాయి. ఈ క్లిష్ట పరిస్థితుల నుంచి పుట్టుకొస్తున్న సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవడమే ప్రస్తుతం మన ముందున్న ప్రధాన కర్తవ్యం’

ప్రస్తుత ప్రపంచ భౌగోళిక, రాజకీయ పరిస్థితులపై అడిగిన ప్రశ్నకు స్పందించిన జైశంకర్– ప్రస్తుత పరిస్థితులు తీవ్ర అస్థిరంగా, అనిశ్చితితో, అల్లకల్లోలంగా ఉన్నాయని వివరించారు. ఇవన్నీ ప్రపంచ దేశాలకు సవాళ్లను విసురుతున్నాయని చెప్పుకొచ్చారు. ప్రస్తుత పరిస్థితుల్ని ఆయన తుపాన్ తరంగాలతో పోల్చారు. అలాంటి అస్థిర సమయం నడుస్తుందన్న ఉద్దేశంతో ఇలా వ్యాఖ్యానించారు. కొవిడ్ మహమ్మారి విజృంభించిన సమయంలో భారత్ ఎన్నో సవాళ్లను సమర్థంగా ఎదుర్కొని ముందుకు వెళ్లిందని అదే బాటలో ఇప్పుడు కూడా బయటపడతామన్న నమ్మకం ఉందని జైశంకర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక్కడ ప్రస్తుత ఉద్రిక్తతలు, ఘర్షణల కారణంగా ఇంధనం, ఆహారం, ఎరువులు వంటి కీలక రంగాల్లో ఎదురయ్యే సమస్యల ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి ప్రణాళికలు రూపొందించుకొని దానికి అనుగుణంగా స్పందించాల్సిన అవసరం ఉందన్నారు.

**గ్లోబల్ సౌత్ గళం వినిపించాల్సిందే**

ప్రపంచ వేదికలపై గ్లోబల్ సౌత్ దేశాల గళాన్ని, సమస్యల్ని భారత్ బలంగా వినిపిస్తోందని, ఆ దేశాలు కూడా అదే కోరుకుంటూ భారత్‌పైనే ఎంతో నమ్మకం ఉంచాయని జైశంకర్ వెల్లడించారు. అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఆహారం, ఇంధనం, ఎరువులు, ఇతర ఆర్థిక వనరులకు సంబంధించిన సమస్యలు సాధారణంగానే ఉన్నాయని చెప్పారు. భారత్ ప్రస్తావిస్తున్న అంశాలు కేవలం తమ ప్రయోజనాలకే పరిమితం కాలేదని, ఇది గ్లోబల్ సౌత్‌లోని అనేక దేశాల విస్తృత ప్రయోజనాల్ని కాపాడుతుందని జైశంకర్ వివరించారు. సాధారణంగా అభివృద్ధి చెందుతున్న అలాగే తక్కువ, మధ్య ఆదాయం కలిగిన దేశాల్ని ఇలా గ్లోబల్ సౌత్ పేరుతో పిలుస్తుంటారు. భారత్ కూడా ఇదే కేటగిరీలో ఉంది.

**రష్యా– ఉక్రెయిన్ యుద్ధంపై భారత్ వైఖరి**

ఇదే వేదికగా రష్యా– ఉక్రెయిన్ యుద్ధం సమస్య గురించి కూడా జైశంకర్ మాట్లాడారు. ప్రస్తుతం ఈ సంక్షోభానికి కేవలం చర్చలు, దౌత్యం ద్వారా మాత్రమే పరిష్కారం సాధ్యమవుతుందని భారత్ తన విధానాన్ని పునరుద్ఘాటించింది. ఈ విషయంలో భారత్ కేవలం మాటలకే పరిమితం కాకుండా, యుద్ధం ముగింపు విషయంలో ఆ దేశాలతో నేరుగా చర్చలు జరుపుతున్నట్లు ఆయన ఇదివరకే స్పష్టం చేశారు. ఇదే సమయంలో నల్ల సముద్రం నుంచి గల్ఫ్ ప్రాంతం వరకు వాణిజ్య నౌకలపై దాడులు జరగడం కూడా ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని ఆయన హెచ్చరించారు. చివరగా ప్రపంచవ్యాప్తంగా శాంతి భద్రతల పర్యవేక్షణలో బహుపాక్షిక వ్యవస్థల (మల్టీలాటరల్ ఇన్‌స్టిట్యూషన్స్) పాత్ర తగ్గిపోతోందని జైశంకర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇక్కడ ప్రధానంగా ఐక్యరాజ్యసమితి నిశ్చల స్థితిలో ఉండిపోయిందని, ఇందులో సంస్కరణలు జరగకుండా కొన్ని దేశాలు ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటున్నాయని మండిపడ్డారు.

# భారత్ కీలక శక్తిగా ఎదుగుతోంది

అంతర్జాతీయ దౌత్య రంగంలో భారత్ అత్యంత కీలకమైన శక్తిగా ఎదుగుతోందని స్విట్జర్లాండ్ ప్రెసిడెంట్ గై పార్మెలిన్ ప్రశంసించారు. గ్లోబల్ గవర్నెన్స్, సాంకేతిక రంగాలలో కూడా న్యూదిల్లీ కీలక పాత్ర పోషిస్తుందని కొనియాడారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు 3 రోజుల అధికారిక పర్యటన నిమిత్తం దిల్లీ విచ్చేసిన ఆయన, ప్రధాని మోదీతో ద్వైపాక్షిక చర్చలు జరిపిన అనంతరం ఉమ్మడి పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రపంచం ఒకవైపు రాజకీయంగా, భౌగోళికంగా విభజనకు గురవుతున్న తరుణంలో భారత్ వంటి దేశాలతో భాగస్వామ్యం అత్యంత కీలకం అని మాట్లాడారు. ఏ అంతర్జాతీయ వేదిక అయినా భారత్ చర్చలు, సహకారానికి ఇస్తున్న ప్రాధాన్యాన్ని కూడా తాము అనుసరిస్తామని తెలిపారు. గ్లోబల్ టెక్నాలజీ చర్చల్లో అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రాతినిధ్యాన్ని పెంచడంలోనూ భారత్ అసాధారణ నాయకత్వ పటిమను ప్రదర్శించిందని పార్మెలిన్ అన్నారు. ఈ క్రమంలోనే 2026 ఫిబ్రవరిలో న్యూదిల్లీ వేదికగా భారత్ నిర్వహించిన ‘ఏఐ ఇంపాక్ట్ సమిట్ 2026’ గొప్ప విజయాన్ని సాధించిందని ప్రశంసలు కురిపించారు. దీనికి 88 దేశాలు, ఇతర అంతర్జాతీయ సంస్థలు ఆమోదించాయని ఆయన గుర్తు చేశారు. అందరికీ సమాన అవకాశాలు కల్పించే ఆర్టిఫిషియెల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) విధానం ఉండాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. సాంకేతిక ప్రయోజనాలు కొన్ని దేశాలు, సంస్థలకే పరిమితం కాకుండా ప్రపంచంలోని అన్ని ప్రాంతాలకు చేరేలా భాగస్వామ్యం కల్పించడానికి, ఏఐ పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వడానికి స్విట్జర్లాండ్ కృషి చేస్తుందన్నారు. 2027 జూన్‌లో



జెనీవాలో స్విట్జర్లాండ్ నిర్వహించబోయే తదుపరి గ్లోబల్ ఏఐ సమిట్‌కు భారత్‌ను కీలక భాగస్వామిగా పరిగణిస్తున్నట్లు పార్మెలిన్ పేర్కొన్నారు. ఇక్కడ ఆమోదించిన ‘న్యూదిల్లీ డిక్లరేషన్ ఆన్ ఏఐ ఇంపాక్ట్’ మార్గదర్శకాల ఆధారంగానే తాము కూడా ముందుకు సాగుతామని వెల్లడించారు.

**ɹజ్హూరా డీల్‌తో సంబంధాలు మరింత బలోపేతం**

భారత్– స్విట్జర్లాండ్ ఆర్థిక సంబంధాల్లో ఇండియా–యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్ (జుఖీూా) మధ్య జరిగిన ɹజ్హూరా (ట్రేడ్ అండ్ ఎకనామిక్ పార్ట్‌నర్‌షిప్ అగ్రిమెంట్) కీలకంగా మారుతోంది. భారత్, స్విస్, నార్వే, ఐస్‌లాండ్, లిక్టెన్‌స్టెయిన్‌లతో కూడిన జుఖీూా మధ్య కుదిరిన ఈ డీల్ 2025, అక్టోబర్ 1 నుంచే అమల్లోకి వచ్చింది. ఈ డీల్ మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని, దీని అమలు తీరుపై తాము చాలా సంతోషంగా ఉన్నామని పార్మెలిన్ వెల్లడించారు. ఈ ఒప్పందం అమల్లోకి వచ్చాక స్విస్ కంపెనీల నుంచి ఆసక్తి బాగా పెరిగిందన్నారు. రానున్న సంవత్సరాల్లో భారత్– స్విట్జర్లాండ్ ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మరింత బలోపేతం చేయడంలో ఈ ఒప్పందం కీలకంగా మారనుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఇక్కడ ఒకవైపు స్విస్‌కు వినూత్న సాంకేతికతలు, పెట్టుబడి సామర్థ్యం, అంతర్జాతీయ కంపెనీలు ఉండగా, భారత్‌కు భారీ మార్కెట్, అత్యంత నైపుణ్యం కలిగిన మానవ వనరులు, వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ ఉన్నాయని ఆయన వివరించారు. ఇలా రెండు వైపులా బలబలాలు ఇరు దేశాలకు మరింత ప్రయోజనం చేకూర్చే అవకాశాల్ని కల్పిస్తున్నాయని స్విస్ ప్రెసిడెంట్ చెప్పుకొచ్చారు. రవాణా, లాజిస్టిక్స్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఫార్మాస్యూటికల్స్, బయోటెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో స్విస్ కంపెనీలు ఇప్పటికే భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టాయని వెల్లడించారు.

**15 ఏళ్లలో 100 బిలియన్ డాలర్ల పెట్టుబడులు**

ɹజ్హూరా కేవలం ఎగుమతి, దిగుమతులపై సుంకాలను మాత్రమే తగ్గించే ఒప్పందం కాదని, దీర్ఘకాలిక పెట్టుబడులు, ఉపాధి, ఆవిష్కరణలు, స్థిరమైన ఆర్థిక వృద్ధికి ఇది పునాది వేస్తుందని స్విట్జర్లాండ్ అధ్యక్షుడు వివరించారు. ఈ వాణిజ్య ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (ɹజ్హూరా) కింద జుఖీూా దేశాలు భారత్‌లో 15 ఏళ్లలో ఏకంగా 100 బిలియన్ డాలర్ల పెట్టుబడుల్ని ప్రోత్సహించడం, ఇందులో భాగంగా సుమారు 10 లక్షల ఉద్యోగాలను కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు స్పష్టం చేశారు. మరోవైపు మోదీ కూడా భారత్– జుఖీూా ఒప్పందాన్ని భారత్– స్విస్ ఆర్థిక సంబంధాల్లో కీలక ముందడుగుగా అభివర్ణించారు.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137